అనుదినం... జనస్వరం

నవతెలంగాణ


బుధవారం 1-2-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 31 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

ప్రజా సమస్యల ప్రస్తావన లేదు

రాష్ట్రపతి ప్రసంగం నిరాశపరిచింది

- సీపీఐ(ఎం) పార్లమెంటరీ పార్టీ నేత ఎలమారం కరీం



న్యూఢిల్లీ : రాష్ట్రపతి ప్రసంగంలో ప్రజా సమస్యల ప్రస్తావన లేదని సీపీఐ(ఎం) పార్లమెంటరీ పార్టీ నేత ఎలమారం కరీం అన్నారు. మంగళవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం చాలా నిరాశపరిచిందని అన్నారు. "రాష్ట్రపతి ప్రసంగం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్ బుజ్జగింపు విధానాల కథనం తప్ప మరేమీ కాదు. 19 పేజీల ప్రసంగంలో కార్మికుడు అనే పదాల ప్రస్తావన లేదు. ఇందులో మన భారతదేశంలోని వ్యవసాయ రంగం గురించి ఏమీ ప్రస్తావించ లేదు. దేశంలోని అణగారిన...2లో

ఆర్థిక వ్యవస్థ.. తిరోగమనం



గత మూడేండ్ల లెక్కల సారాంశమిదే

- ఆర్థిక మందగమనం వల్ల ఎగుమతులపై ప్రభావం..
- కరంట్ అకౌంట్ లోటుతో రూపాయికి ఒత్తిడి
- 'కరోనా'ను ఎదుర్కోవటంలో స్వయం సహాయక బృందాలది కీలక పాత్ర
- కేంద్ర ఆర్థిక సర్వేలో వెల్లడి

ఆత్మ నిర్భర్ భారత్ అంటూ కేంద్రంలోని బీజేపీ సర్కార్ చెప్పిన మాటలన్నీ 'కేవలంమాటలేనని' తేలిపోయింది. దేశం అభివృద్ధిలో దూసుకుపోతోందంటూ ప్రధాని మోడీ పదే పదే చేసిన ప్రకటనలన్నీ కేవలం ఊకదంపుడు ఉపన్యాసాలు, ఊదరగొట్టుడేనని స్పష్టమైంది. గత మూడేండ్ల లెక్కలు, గణాంకాలప్రకారం... దేశ ఆర్థిక వ్యవస్థ పురోగమనంలో కాదు.. తిరోగమనంలో కొనసాగుతోందని స్పష్టమైంది. ఇది ప్రతిపక్షాలో, ఆర్థిక నిపుణులో చెబుతున్న విషయం కాదు. సాక్షాత్తూ కేంద్ర ఆర్థిక సర్వే (2022-23) నిగ్గు తేల్చిన నిజాలు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనం వల్ల మన దేశ ఎగుమతులపై ప్రభావం పడే అవకాశముందని ఆ సర్వే వెల్లడించింది. ఇది ప్రతికూల ప్రభావాన్ని చూపనుందని ఆందోళన వ్యక్తం చేసింది.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చే ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభమయ్యే 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన దేశ ఆర్థిక వ్యవస్థ 6 శాతం నుంచి 6.8 శాతం వరకు వృద్ధి చెందే అవకాశం ఉందంటూ ఈ సర్వే అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ వృద్ధి రేటు 7 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. అంటే వచ్చే ఏడాది ప్రస్తుత సంవత్సరం కన్నా తక్కువ వృద్ధి రేటు నమోదయ్యే అవకాశముందనే విషయం విదితమవుతున్నది. 2022-23 ఆర్థిక సర్వే నివేదికను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంటుకు సమర్పించారు. ఈ నివేదికలో దేశ జీడీపీ, ఆర్థిక వ్యవస్థ వృద్ధి, కరంట్ అకౌంట్ లోటు, కొనుగోలు శక్తి, కోవిడ్ అనంతర ఆర్థిక పరిస్థితులు, ఉక్రెయిన్- రష్యా యుద్ధ ప్రభావం, వినియోగదారుల ధరల సూచీ, ద్రవోల్బణం తదితరాంశాలను ప్రస్తావించారు. ఈ క్రమంలో కేంద్రంలోని బీజేపీ సర్కారు ఎనిమిదిన్నరేండ్ల కాలంలో అనుసరించిన విధానాల వల్ల ఆర్థిక వృద్ధి మెరుగుపడకపోగా... మరింత దిగజారిందనే విషయాన్ని నివేదికలోని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఫలితంగా ప్రజల జీవన ప్రమాణాలు, స్థితిగతులు దారుణంగా దెబ్బతింటూ వస్తున్నాయి. దేశంలో ఒక్క పూట కూడా తిండి తినలేని వారి సంఖ్య 23 కోట్లుగా ఉందంటే...పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు గతంలో 20 శాతంగా ఉంటే... ఇప్పుడు ఆ శాతం ఏడుకు పడిపోయింది. ఈ పరిణామాలన్నిటి రీత్యా... మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాలు.. ప్రజల సంక్షేమం, దేశ ఆర్థికాభివృద్ధి కోసం కాకుండా కొంత మంది వ్యక్తులు, కార్పొరేట్ శక్తులకే ఎక్కువగా ఉపయోగపడుతున్నాయనే విషయం సుస్పష్టమవుతున్నది.

ఆర్థిక సర్వేలోని ముఖ్యాంశాలు...

-భారతదేశ ఆర్థిక వ్యవస్థ 6.8 శాతంతో వృద్ధి చెందుతున్నది. దీన్నిబట్టి ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మన దేశం స్థానం కొనసాగుతోందని చెప్పొచ్చు.

- రాబోయే ఆర్థిక సంవత్సరం(2023-24)లో మన దేశ జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి) నామినల్ టర్మ్స్‌లో 11 శాతంగా ఉంటుందని అంచనా. మౌలికాంశాలు బలంగా ఉండటం వల్ల దేశ వృద్ధి నిలకడగా కొనసాగుతుంది. అత్యధిక మూలధన వ్యయం, ప్రయివేటు వినియోగం, చిన్న తరహా వ్యాపార సంస్థలకు ఇచ్చే రుణాలు పెరగడం, కార్పొరేట్ బ్యాలెన్స్ షీట్ పటిష్టంగా ఉండటం, వలస కార్మికులు తిరిగి ...2లో



అవినీతే అతి పెద్ద శత్రువు : ద్రౌపది ముర్ము

రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్,ఆప్



న్యూఢిల్లీ : ప్రజాస్వామ్యానికి, సామాజిక న్యాయానికి అవినీతే అతి పెద్ద శత్రువు అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లోక్‌సభ, రాజ్యసభ సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి మంగళవారం ప్రసంగించారు. వరుసగా రెండుసార్లు సుస్థిర ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు దేశ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ దేశ ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తుందనీ, విధానపరమైన వ్యూహాన్ని సమూలంగా...5లో

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా బడ్జెట్ : ప్రధాని మోడీ



మన దేశ బడ్జెట్‌పై యావత్తు ప్రపంచం దష్టి సారించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చెప్పారు. ప్రపంచంలో నేడు ఉన్న పరిస్థితుల నేపథ్యంలో దేశ బడ్జెట్ గురించి తెలుసుకోవాలని మన దేశవాసులే కాకుండా, యావత్తు ప్రపంచం ఎదురు చూస్తున్నదని చెప్పారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. అంతర్జాతీయంగా ఆర్థిక పరిస్థితులు అస్థిరంగా ఉన్నాయనీ, అయినప్పటికీ మన దేశ బడ్జెట్ సామాన్యుల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రయత్నిస్తుందని తెలిపారు.

జూన్ 5 నుంచి గ్రూప్-1 మెయిన్

12 వరకు రాతపరీక్షల నిర్వహణ : టీఎస్‌పీఎస్సీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జూన్ ఐదు నుంచి 12వ తేదీ వరకు గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలను నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్ 11న ఆదివారం కావడంతో ఆరోజు పరీక్ష ఉండబోదని తెలిపారు. ఈ పరీక్షలు ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ భాషల్లో ఉంటాయని వివరించారు. జనరల్ ఇంగ్లీష్ పేపర్ మినహా అన్ని పేపర్లకూ అభ్యర్థులు వారు ఎంచుకున్న భాషలో పరీక్ష రాసుకోవచ్చని సూచించారు. గతేడాది అక్టోబర్ 16న నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 3,80,081 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, వారిలో 2,85,916 మంది అభ్యర్థులు హాజరైన విషయం తెలిసిందే. వారిలో 25,150 మంది అభ్యర్థులు మెయిన్స్ రాతపరీక్షలకు అర్హత సాధించారు. హైకోర్టు ...2లో

సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు



'మన ఊరు-మనబడి' పనులు పూర్తి

- నేడు గంభీరావుపేటలో మంత్రులు కేటీఆర్, సబిత చేతుల మీదుగా ప్రారంభం

వివరాలు 5లో

నవతెలంగాణ

రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శిగా నవీన్ మిట్టల్

- సీసీఎల్ఏగా అదనపు బాధ్యతలు
- పలువురు కలెక్టర్ల బదిలీ • ఉత్తర్వులు జారీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ బోర్డు కార్యదర్శిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ నవీన్ మిట్టల్ బదిలీ అయ్యారు. ఆయన్ను రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మిట్టల్‌కు సీసీఎల్ఏగా అదనపు బాధ్యతలను కూడా అప్పగిస్తున్నట్టు జీవోలో పేర్కొన్నారు. ఆయనతో పాటు మరో 15 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ మరో జీవో జారీ చేశారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి (2010 బ్యాచ్)... మహిళా శిశుసంక్షేమశాఖ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. రాజీవ్ గాంధీ హనుమంతు (2012)ను నిజామాబాద్ కలెక్టర్‌గా, సిక్తా పట్నాయక్ (2014)ను హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా రాహుల్ రాజ్ (2015), వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా నారాయణరెడ్డి (2015), మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్‌గా అమోయ్ కుమార్ (2013), కుమురంభీం ఆసిఫాబాద్ కలెక్టర్‌గా యాస్మిన్ బాషా (2015), మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌గా జి.రవి (2015), సూర్యాపేట జిల్లా కలెక్టర్‌గా ఎస్.వెంకటరావు (2015), రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఎస్.హరీశ్ (2015), మెదక్ కలెక్టర్‌గా రాజర్షి షా (2017), వనపర్తి కలెక్టర్‌గా తేజాస్ నంద్లాల్ పవార్ (2018)ను బదిలీ చేశారు. కరీంనగర్ కలెక్టర్ ఆర్‌వి కర్ణన్ (2012)కు జగిత్యాల కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. కర్నాటి వరుణ్ రెడ్డి (2019)ని నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్‌కు హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

ప్రజా సమస్యల ప్రస్తావన లేదు

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలతో కేంద్ర ప్రభుత్వం నిలబడదనే వాస్తవాన్ని ఇది సమర్థిస్తుంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, నేడు దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు రాష్ట్రపతి ప్రసంగంలో భాగం కాకపోవడం బాధాకరం" అని అన్నారు.

"వరుసగా రెండు పర్యాయాలు కేంద్రంలో సుస్థిర ప్రభుత్వాన్ని కలిగి ఉన్నందుకు గర్వపడుతున్నామని రాష్ట్రపతి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచే గవర్నర్ల రాజ్యాంగ విరుద్ధమైన జోక్యాలను మరిచారు. కేంద్రంలో వరుసగా రెండు పర్యాయాలు సుస్థిర ప్రభుత్వాన్ని అందించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజల ఆదేశాన్ని తుంగలో తొక్కి దేశంలోని అనేక రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన బిజెపి కుట్రలను చూడడం లేదు" అని విమర్శించారు.

"మౌలిక సదుపాయాల కల్పన, పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత రంగాల్లో ప్రభుత్వం చేస్తున్న జోక్యాలను ప్రశంసిస్తూ ప్రసంగంలో పేర్కొన్న అనేక ప్రాజెక్టులు నిజానికి సామాన్యులకు ఏ విధంగానూ ఉపయోగపడని ప్రకటనలు మాత్రమే. ప్రభుత్వ రంగ సంస్థలను, దేశ సంపదను అమ్మేసే విధానాన్ని అనుసరిస్తున్న ప్రభుత్వం దేశాన్ని ఎలా ప్రగతిపథంలో నడిపిస్తుంది?" అని ప్రశ్నించారు.

జూన్ 5 నుంచి గ్రూప్-1 మెయిన్

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశాలతో సమాంతర విధానంతో రిజర్వేషన్లు చేపట్టామని పేర్కొన్నారు. మల్టీ జోన్, రిజర్వేషన్ల ప్రకారం 1:50 ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు. ఇతర వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. 503 పోస్టుల భర్తీకి తెలంగాణ తొలి గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ ఏప్రిల్ 26వ తేదీన విడుదల చేసిన విషయం తెలిసిందే.

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల షెడ్యూల్

తేదీ	సమయం	మార్కులు	సబ్జెక్టు
జూన్ 5	3	150	జనరల్ ఇంగ్లీష్
జూన్ 6	3	150	పేపర్-1 జనరల్ ఎస్సే
జూన్ 7	3	150	పేపర్-2 హిస్టరీ, కల్చర్, జాగ్రఫీ
జూన్ 8	3	150	పేపర్-3 ఇండియన్ సొసైటీ, కాన్‌స్టిట్యూషన్, గవర్నెన్స్
జూన్ 9	3	150	పేపర్-4 ఎకానమీ, డెవలప్‌మెంట్
జూన్ 10	3	150	పేపర్-5 సైన్స్ అండ్ టెక్నాలజీ, డాటా ఇంటర్‌ప్రిటేషన్
జూన్ 12	3	150	పేపర్-6 తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర అవిర్భావం

ఉపాధ్యాయ బదిలీల దరఖాస్తుకు నేడే ఆఖరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే గడువు ప్రక్రియ బుధవారంతో ముగియనుంది. గతనెల 28 నుంచి వాటి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం సాయంత్రం వరకు బదిలీల కోసం 63 వేల మంది దరఖాస్తు చేసినట్టు సమా చారం. బదిలీలకు సంబంధించిన ఉపాధ్యాయుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది.

ఈ ప్రక్రియ గురువారం వరకు కొనసాగుతుంది. బదిలీలకు దరఖాస్తు చేసేందుకు బుధవారం చివరి రోజు కావడంతో మరో పది వేల వరకు దరఖాస్తులొచ్చే అవకాశమున్నట్టు తెలుస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా 40 వేల నుంచి 50 వేల వరకు ఉపాధ్యాయ బదిలీలు చేపట్టే అవకాశమున్నది. ఈ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా చేపట్టేందుకే విద్యాశాఖ సీనియర్ అధికారులను జిల్లాల వారీగా పరిశీలకులుగా నియమించిన సంగతి తెలిసిందే.

మధుసూదన్‌రెడ్డిపై నిషేధం

- ఇంటర్ బోర్డు, కమిషనరేట్‌లోకి రాకుండా ఆంక్షలు : నవీన్ మిట్టల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ బోర్డు, ఇంటర్ కమిషనర్ కార్యాలయాల్లోకి రాకుండా సస్పెండైన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి మధుసూదన్‌రెడ్డిపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి, ఇంటర్ విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. మహిళా ఉద్యోగుల రక్షణ, ప్రభుత్వ దస్త్రాల భద్రత కోసమే ఈ ఆంక్షలను విధించినట్టు స్పష్టం చేశారు. ఇంటర్ కమిషనరేట్‌లో సీసీ కెమెరాల ట్యాంపరింగ్‌కు పాల్పడ్డారంటూ ఆయనపై సోమవారం బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైందని వివరించారు. అలాంటి వ్యక్తి తమ కార్యాలయాల్లోకి రాకుండా ఆదేశాలిచ్చామని తెలిపారు. సరూర్ నగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎకనామిక్స్ అధ్యాపకునిగా పనిచేస్తున్న మధుసూదన్‌రెడ్డి సస్పెన్షన్‌లో కొనసాగుతున్నారని పేర్కొన్నారు. వివిధ నేరారోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆయన్ను గతంలోనే సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. ఆయనపై మహిళా అధికారిని లైంగికంగా వేధించిన కేసు నమోదైందని వివరించారు. దీంతో తమ కార్యాలయాల్లోకి అతను ప్రవేశిస్తే కుట్రపూరితంగా నేరంగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది అధికారులతో నేరుగా గానీ, పరోక్షంగా గానీ మాట్లాడేందుకు ప్రయత్నించినా నేరపూరిత చర్యగానే పరిగణిస్తామని ఆదేశాల్లో ప్రకటించారు. అయితే నవీన్ మిట్టల్ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శిగా బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది.

ఇది అవివేకం : మధుసూదన్‌రెడ్డి

ఇంటర్ బోర్డు, కమిషనర్ కార్యాలయాల్లోకి తనను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అవివేకమని ఇంటర్ విద్యా జేఏసీ చైర్మెన్ పి మధుసూదన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

అక్రమంగా నియామకం పొంది కోర్టు ఉత్తర్వుల ద్వారా కొనసాగుతున్న ఒక మహిళా ఉద్యోగి అభ్యర్థన మేరకు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నదని పేర్కొన్నారు. అధ్యాపకుల వాణిని వినిపించే అవకాశాన్ని కాలరాయడం నవీన్ మిట్టల్ అహంకారానికి నిదర్శనమని ఆరోపించారు.

అప్పుల భారతం

కేంద్రం అప్పు రూ.134.08 లక్షల కోట్లు

- ఆరేండ్లలో అప్పు రూ.68.81 లక్షల కోట్ల పెరుగుదల
- ప్రభుత్వరంగ సంస్థల్లో రూ.4 లక్షల కోట్లు పెట్టుబడులు ఉపసంహరణ
- స్పష్టం చేసిన ఆర్థిక సర్వే



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అప్పు ఏటా పెరిగిపోతున్నది. ప్రస్తుతం కేంద్రం అప్పు రూ.134.08 లక్షల కోట్లకు పెరిగిందని పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. గత ఆరేండ్లలోనే కేంద్ర ప్రభుత్వం చేసిన రూ.68.81 లక్షల కోట్లు పెరిగినట్టు తెలిపింది. 15వ ఆర్థిక సిఫారసుల్లో భాగంగా రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధులనూ కేంద్ర ప్రభుత్వం సక్రమంగా విడుదల చేయటం లేదు. దాదాపు రూ.30,878 కోట్లు ఇంకా విడుదల చేయకుండా కేంద్ర పెండింగ్‌లో ఉంచింది.

కేంద్ర ప్రభుత్వం అప్పు

ఏడాది	అప్పు (రూ.లక్షల కోట్లు)
2016	65.27
2017	70.16
2018	77.85
2019	86.35
2020	99.91
2021	116.98
2022	134.08

రూ.4 లక్షల కోట్ల పెట్టుబడుల ఉపసంహరణ

గత తొమ్మిదేండ్లలో ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణతో రూ.4.07 లక్షల కోట్లు సమకూరినట్టు కేంద్ర ఆర్థిక సర్వే తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.65 వేల కోట్లను లక్ష్యంగా నిర్దేశించుకోగా, 48 శాతం లక్ష్యాన్ని ప్రభుత్వం చేరుకుందని వెల్లడించింది. తద్వారా రూ.31 వేల కోట్లు ఖజానాకు చేరినట్టు పేర్కొంది. 2014 తరువాత ప్రయివేటు భాగస్వామ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నదని ఆర్థిక సర్వే తెలిపింది. ఐడీబీఐతో పాటు షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎన్ఎండీసీ స్టీల్ లిమిటెడ్, బీఈఎంఎల్, కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, వైజాగ్ స్టీల్ ప్లాంట్ వంటి సంస్థలను విక్రయించే అంశంపై ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రస్తుతం ఈ ప్రక్రియ వివిధ దశల్లో ఉంది.



ఎంఎస్ఎంఈలను ఆదుకున్న అత్యవసర రుణ హామీ

కరోనా కారణంగా బాగా దెబ్బతిన్న సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈ) కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అత్యవసర రుణ హామీ పథకం (ఈఎల్సీజీఎస్) ఆదుకుందని ఆర్థిక సర్వే చెప్పుకుంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మన దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) నామినల్ టెర్మ్‌లో 11 శాతం ఉంటుందని సర్వే అంచనా వేసింది. మౌలికాంశాలు బలంగా ఉండటం వల్ల భారత దేశ వృద్ధి నిలకడగా కొనసాగుతుందని పేర్కొంది. అత్యధిక మూలధన వ్యయం, ప్రైవేట్ వినియోగం, చిన్న తరహా వ్యాపార సంస్థలకు ఇచ్చే రుణాలు పెరగడం, కార్పొరేట్ బ్యాలెన్స్ షీట్ పటిష్టంగా ఉండటం, వలస కార్మికులు తిరిగి నగరాలకు చేరుకుంటుండటం వంటివాటివల్ల జీడీపీ వృద్ధి నిలకడగా కొనసాగుతుందని తెలిపింది.

దేశంలో 12.6 శాతం మంది విద్యార్థుల డ్రాపౌట్స్ అయినట్టు ఆర్థిక సర్వే తెలిపింది. లేబర్ కోడ్స్ కు సంబంధించిన గెజిట్ విడుదల చేసినట్టు తెలిపింది. వేతన కోడ్‌ను 31, పారిశ్రామిక సంబంధాల కోడ్ 28, సామాజిక భద్రతా కోడ్ 28, ఆరోగ్య భద్రత, పని పరిస్థితుల కోడ్ 26 రాష్ట్రాలు నిబంధనలు విడుదల చేసినట్టు పేర్కొంది.

గ్రామీణ ద్రవ్యోల్బణంలో తెలుగు రాష్ట్రాలు

గ్రామీణ ద్రవ్యోల్బణంలో తెలుగు రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని ఆర్థిక సర్వే తెలిపింది. తెలంగాణ, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హర్యానా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అత్యధిక గ్రామీణ ద్రవ్యోల్బణం నమోదు చేసుకున్నట్టు పేర్కొంది. దీనికి పెట్రోలియం, దుస్తులు ధరలు పెరగడమే కారణమని తెలిపింది.

రాష్ట్రాలకు కేంద్రం విడుదల చేయాల్సిన నిధులు

	కేటాయింపు	విడుదల (రూ.కోట్లలో)
రెవెన్యూ లోటు	86,201	57,467
విపత్తు నిర్వహణ	23,294	10,976
స్థానిక సంస్థల నిధులు	69,421	28,609
ఆరోగ్య రంగం నిధులు	13,192	275

అదానీ ఆస్తుల లావాదేవీలపై 'సుప్రీం' పర్యవేక్షణలో విచారణ జరపాలి

ప్రజలకు నిజానిజాలు తెలపాలి : తమ్మినేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అదానీ గ్రూప్ దొడ్డిదారిన నిధులను తరలిస్తున్నదనీ, మూల ధనాన్ని ఎక్కువ చేసి చూపించిందంటూ అమెరికాకు చెందిన పరిశోధన సంస్థ హిండెన్‌బర్గ్ గుట్టురట్టు చేశారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. దిక్కు తోచని అదానీ జాతీయవాదం పేరుతో తన డొల్లతనాన్ని కప్పి పుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాడని మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ సంస్థ మోడీ కనుసన్నల్లో ఉండడం వల్ల కార్పొరేట్ వ్యవహారాలు చూసే ఈడీ, సెబీ, ఆర్బీఐ నిమ్మకుండడంతో అదానీ దోపిడీకి అంతులేకుండా పోయిందని పేర్కొన్నారు. ఈ పరిశోధన సంస్థ ఆరోపణలపై నిజానిజాలు తేల్చడానికి సుప్రీంకోర్టు పర్యవేక్షణలో, సంబంధిత మంత్రిత్వ శాఖలన్నింటినీ కలుపుకుని ఒక ఉన్నతస్థాయి బృందాన్ని ఏర్పాటు చేసి అదాని గ్రూపు ఆస్తుల లావాదేవీలపై విచారణను పారదర్శకంగా జరిపించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను గౌతమ్ అదానీ గ్రూపునకు అప్పనంగా అప్పజెప్పడం తో గత తొమ్మిదేండ్లుగా విపరీతంగా ఆస్తులను పోగేసుకుందని పేర్కొన్నారు. మరో పక్క ఆశ్రిత పెట్టుబడులను రాబడుతూ, తమ ఆధ్వర్యంలోని విదేశీ డొల్ల కంపెనీలకు నిధులు తరలించారని తెలిపారు. షేర్ల విలువ పెంచి దాని ఆధారంగా ప్రభుత్వ బ్యాంకులు, ఎల్ఐసీ నిధులను పెట్టుబడి పెట్టిందని వివరించారు. 1000 శాతానికి పైగా షేర్ల విలువలు ఫ్యాబ్రికేట్ చేసి దేశ ఆర్థిక వ్యవస్థకు, ప్రభుత్వ సంస్థలకు, బ్యాంకులకు నష్టం కలుగజేసిందని విమర్శించారు. ఇప్పటికే 40 శాతం భారత ఆర్థిక వ్యవస్థ ఒక్క శాతంగా ఉన్న సంపన్నుల చేతిలో ఉందని తెలిపారు. దీనిపై నియంత్రణ లేకపోతే దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తం కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లి ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అదానీ గ్రూపు వ్యవహారమంతటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలనీ, ఆ గ్రూపు డొల్లతనాన్ని బయటపెట్టి ఇలాంటి ఆర్థిక దోపిడీ పద్ధతులను అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆర్థిక వ్యవస్థ.. తిరోగమనం

(మొదటిపేజీ తరువాయి)

నగరాలకు చేరుకుంటుండటం తదితర పరిణామాల వల్ల జీడీపీ వృద్ధి నిలకడగా కొనసాగుతుంది. అంతర్జాతీయంగా ఎదురవుతున్న ఒడుదొడుకుల నడుమ ఈ అంచనాలు గట్టి భరోసాను ఇస్తున్నాయి. అయితే కరంట్ అకౌంట్ లోటు మరింతగా విస్తరిస్తే, భారతదేశ కరెన్సీ అయిన రూపాయి ఒత్తిళ్లకు గురవుతుంది.

-కొనుగోలు శక్తినిబట్టి చూసినపుడు భారత దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో మూడో స్థానంలోనూ, ఎక్స్ఛేంజ్ రేట్‌నుబట్టి చూసినప్పుడు ఐదో స్థానంలోనూ ఉంటుంది.

-భారతదేశ ఆర్థిక వ్యవస్థ దాదాపు కోలుకుందని ఆర్థిక సర్వేలో కేంద్రం తెలిపింది. కోవిడ్-19 మహమ్మారి, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సమయాల్లో మందగమనం నుంచి ఆ వ్యవస్థ తేరుకున్నట్టు... మళ్లీ పుంజుకున్నట్టు తెలిపింది.

-కరంట్ అకౌంట్ డెఫిసిట్‌కు ఫైనాన్స్ చేయడానికి తగిన విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఉన్నట్టు ధీమా వ్యక్తం చేసింది. రూపాయి విలువలో చంచలత్వాన్ని సర్దుబాటు చేయగలదనే నమ్మకాన్ని వ్యక్తం చేసింది. ప్రపంచంలోని ఇతర ఆర్థిక వ్యవస్థలతో పోల్చినపుడు సీపీఐ (వినియోగ దారుల ధరల సూచీ) ద్రవ్యోల్బణం భారతీయ రిజర్వు బ్యాంకు నిర్దేశిత పరిమితి కన్నా మించిపోలేదని పేర్కొంది.

-కోవిడ్ మహమ్మారి సమయంలో ఏర్పడిన సంక్షోభాన్ని ఎదుర్కోవటంలో స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు కీలక పాత్ర పోషించారు. మాస్కులను తయారు చేయడంతోపాటు వాటిని గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని ప్రజలు వాడేలా వారికి అవగాహన కల్పించటంలో ఈ మహిళల పాత్ర గొప్పగా ఉందంటూ ప్రశంసించింది. నిలకడగా కొనసాగుతుంది. అంతర్జాతీయంగా ఎదురవు తున్న ఒడుదొడుకుల నడుమ ఈ అంచనాలు గట్టి భరోసాను ఇస్తున్నాయి. అయితే కరంట్ అకౌంట్ లోటు మరింతగా విస్తరిస్తే, భారతదేశ కరెన్సీ అయిన రూపాయి ఒత్తిళ్లకు గురవుతుంది.

-కొనుగోలు శక్తినిబట్టి చూసినపుడు భారత దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో మూడో స్థానంలోనూ, ఎక్స్ఛేంజ్ రేట్‌నుబట్టి చూసినప్పుడు ఐదో స్థానంలోనూ ఉంటుంది.

-భారతదేశ ఆర్థిక వ్యవస్థ దాదాపు కోలుకుందని ఆర్థిక సర్వేలో కేంద్రం తెలిపింది. కోవిడ్-19 మహమ్మారి, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సమయాల్లో మందగమనం నుంచి ఆ వ్యవస్థ తేరుకున్నట్టు... మళ్లీ పుంజుకున్నట్టు తెలిపింది.

-కరంట్ అకౌంట్ డెఫిసిట్‌కు ఫైనాన్స్ చేయడానికి తగిన విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఉన్నట్టు ధీమా వ్యక్తం చేసింది. రూపాయి విలువలో చంచలత్వాన్ని సర్దుబాటు చేయగలదనే నమ్మకాన్ని వ్యక్తం చేసింది. ప్రపంచంలోని ఇతర ఆర్థిక వ్యవస్థలతో పోల్చినపుడు సీపీఐ (వినియోగ దారుల ధరల సూచీ) ద్రవ్యోల్బణం భారతీయ రిజర్వు బ్యాంకు నిర్దేశిత పరిమితి కన్నా మించిపోలేదని పేర్కొంది.

-కోవిడ్ మహమ్మారి సమయంలో ఏర్పడిన సంక్షోభాన్ని ఎదుర్కోవటంలో స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు కీలక పాత్ర పోషించారు. మాస్కులను తయారు చేయడంతో పాటు వాటిని గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని ప్రజలు వాడేలా వారికి అవగాహన కల్పించటంలో ఈ మహిళల పాత్ర గొప్పగా ఉందంటూ ప్రశంసించింది.

విద్యకు 24 శాతం, వైద్యానికి 12 శాతం నిధులు కేటాయించాలి

ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

- కోఠి మహిళా కాలేజీ వద్ద సంతకాల సేకరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్ (2023-24)లో విద్యారంగానికి 24 శాతం, వైద్య రంగానికి 12 శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ పౌర స్పందన వేదిక (టీపీఎస్వీ) రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీపీఎస్వీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని కోఠి మహిళా కాలేజీ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 1,054 మంది సంతకాలు చేయడంతో మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ విద్యావైద్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం తగిన నిధులు కేటాయించకపోవడం వల్ల రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులు, విద్యాసంస్థలు మౌలిక వసతులకు నోచుకోలేక పోతున్నాయని చెప్పారు. దీనివల్ల పేద మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందడం లేదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో గత్యంతరం లేక లక్షల రూపాయలు ఖర్చు పెట్టుకుని ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్తున్నారని విమర్శించారు. భరించలేని ఖర్చులతో అప్పులపాలై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ ఏడాది బడ్జెట్‌లో విద్యావైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యతని వ్వాలని కోరారు. ప్రభుత్వ వర్సిటీలకు గతేడాది బడ్జెట్‌కు అదనంగా 50 శాతం నిధులు పెంచాలని సూచిం చారు. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో పెరుగుతున్న జనాభా కనుగుణంగా ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రభుత్వ విద్యాసంస్థల సంఖ్యను పెంచి మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రజలకు నాణ్యమైన విద్యా వైద్యం అందించడం సాధ్యమౌతుందని వివరించారు. టీపీఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రాధేశ్యాం, రాష్ట్ర సలహాదారు ఎంఏకె దత్, రంగారెడ్డి జిల్లా నాయకులు కావ్యారెడ్డి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జి రాములు పాల్గొన్నారు.

5న దేశవ్యాప్త ఆర్టీసీ నాయకుల సమావేశం

- ఆతిథ్యమిస్తున్న టీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశవ్యాప్తంగా ఆర్టీసీలు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కారాలను సూచిస్తూ ఫిబ్రవరి 5వ తేదీ హైదరాబాద్‌లో దేశవ్యాప్త ఆర్టీసీ సంఘాల నాయకుల సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆర్టీసీలకు చెందిన దాదాపు 80 మంది ప్రతినిధులు హాజరయ్యే ఈ సమావేశానికి టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ఆతిథ్యమిస్తున్నది. దీని నిర్వహణకు సంబంధించి రాష్ట్ర కమిటీ సమావేశం ఆ సంఘం అధ్యక్షులు వీరాంజనేయులు అధ్యక్షతన ఆన్‌లైన్ వేదికగా జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు సమావేశ ప్రాధాన్యతను వివరించారు. దానితోపాటు నిర్వహణకు అవసరమైన ఆర్థికసహకారాన్ని కూడా కోరారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, పెరుగుతున్న డీజిల్ ధరలతో దేశవ్యాప్తంగా ఆర్టీసీలు నిర్వీర్యం అవుతున్నాయనీ, వాటి పరిరక్షణ కోసం భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) పిలుపునిచ్చిందని తెలిపారు. దానిలో భాగంగా ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ అనుబంధ సంఘాల నాయకుల సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జమ్మూ కాశ్మీర్ సహా దేశంలోని పలు రాష్ట్రాల ఆర్టీసీల నుంచి దాదాపు 80 మంది ప్రతినిధులు ఈ సమావేశాల్లో పాల్గొంటారని చెప్పారు. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ అధ్యక్షులు నేపాల్‌దేవ్ భట్టాచార్య, ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య, ఎస్‌టీయూ సెక్టార్ కన్వీనర్ ఆర్ముగనాయనార్ హాజరవుతారని వివరించారు.

ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం 9న మహాధర్నా

- హైదరాబాద్‌లోని ఇందిరాపార్కుకు తరలిరండి : వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో జాగాలేని పేదలందరికీ స్థలాలిచ్చి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టుకోవడానికి వీలుగా రూ.5 లక్షల ఆర్థిక సహాయం చేయాలని ప్రభుత్వాన్ని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇండ్ల పట్టాలివ్వాలనీ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయాలని కోరారు. ఇవే డిమాండ్లపై ఈ నెల 9న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. పేదలంతా ఈ ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు ఉండేందుకు సొంత జాగాలు లేక ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని తెలిపారు. వేలాది మంది నిరుపేదలు తాగడానికి నీళ్లు, కనీససౌకర్యాలు, కరెంటు లేకపోయినా డేరాల్లోనే కాపురాలు చేస్తున్న దైన్యస్థితిని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి గుడిసెలు వేసుకున్న చోటనే 125 గజాల ఇంటి జాగాకు పట్టాలివ్వాలనీ, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు అధికారులు తాళాలేశారనీ, అవి నేడు అసాంఘిక శక్తులకు, పందికొక్కులకు నిలయాలుగా మారాయని విమర్శించారు. పోడు సాగదారులను గుర్తించడానికి చేసిన సర్వే ఆధారంగా సాగుదారులకు హక్కు పట్టాలివ్వడంతో పాటు రైతుబంధు, రైతు బీమాను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. గ్రామ సభ తీర్మానం, ఫిజికల్ సర్వే ఆధారంగా లబ్దిదారులను గుర్తించి హక్కు పట్టాలిచ్చేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అభివృద్ధి కోసం భూమిని సేకరణ ప్రాంతాల్లో 2013 సేకరణ చట్ట ప్రకారం ఇస్తున్న పునరావాస ప్యాకేజీని వ్యవసాయ కార్మికులకు, వృత్తిదారులకు కూడా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పేదలు సాగు చేసుకుంటున్న పట్టాలేని భూములకు కూడా మార్కెట్ విలువ కంటే నాలుగు రెట్ల అధిక పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 57 ఏండ్లు పైబడ్డ వారందరికీ నెలకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. తెల్ల రేషన్‌కార్డు కోసం నిరంతరం మీ సేవలో దరఖాస్తులు పెట్టుకునే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ధరణిలో అసైన్మెంట్, బంజరు, ఇనాం భూములకు పట్టాలు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి. ప్రసాద్, నారి ఐలయ్య, కొండమడుగు నరసింహ, పొన్నం వెంకటేశ్వరరావు, మహిళా కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ బి.పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు పెద్ది వెంకట్రాములు, నరసింహులు, వెంకటయ్య, గోపాల్, ములకలపల్లి రాములు, కందుకూరి జగన్, సమ్మయ్య, అల్వాల వీరన్న, ఎదునూరి వెంకట్ రాజాం, తదితరులు పాల్గొన్నారు.

ఫారం యుఆర్‌సి-2

ఛాప్టర్ XXI యొక్క పార్ట్ I క్రింద రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన నోటీసు ఇవ్వవలసిన ప్రకటన (కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 374(బి) మరియు కంపెనీల (రిజిస్టర్ చేయుటకు అధికారం ఇవ్వబడిన) రూల్స్, 2014 లోని రూల్ 4(1)నకు అనుగుణంగా)

1) ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా వాటాల ద్వారా ప్రైవేట్ లిమిటెడ్‌గా కంపెనీల చట్టం, 2013 లోని ఛాప్టర్ XXI యొక్క పార్ట్ I క్రింద భాగస్వామ్య సంస్థగా నమోదుకాబడుతున్న మెసర్స్ **గ్లోబల్‌అరెనా6 స్పోర్ట్స్ ఎల్ఎల్‌పి** కు సంబంధించి రిజిస్ట్రార్, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ వారి కార్యాలయం, సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్‌కార్పొరేట్ అఫైర్స్ (ఐఐసిఏ), ప్లాట్ నెం.6,7, 8, సెక్టార్ 5, ఐఎంటి మానేసర్, గుర్గామ్, హర్యానా, ఇండియా-122050 వారికి దరఖాస్తు చేయుటకు ప్రతిపాదించనున్నదని కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 366లోని ఉప-సెక్షన్ (2)నకు అనుగుణంగా ఇందుమూలంగా తెలియజేయడమైనది.

2) కంపెనీ యొక్క ప్రధాన ఉద్దేశ్యాలు దిగువ విధంగా కలవు :
గోయింగ్ కన్‌సర్న్ ఆధారంగా మెసర్స్ **గ్లోబల్‌అరెనా6 స్పోర్ట్స్ ఎల్ఎల్‌పి** (లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్) యొక్క ప్రస్తుతమున్న వ్యాపారాన్ని కొనసాగించుటకు మరియు నిర్వహించుటకు.

3) ప్రతిపాదిత కంపెనీ యొక్క డ్రాఫ్ట్ మెమొరాండం మరియు ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ యొక్క ముసాయిదా ప్రతిని ఆఫీసు 10వ అంతస్తు, సర్వే నెం.115/1, ఐఎస్‌బి రోడ్, కపిల్ టవర్స్, ఫైనాన్షియల్ జిల్లా గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, హైదరాబాద్, తెలంగాణ-500032, ఇండియా వద్ద పరిశీలించుకోవచ్చును.

4) ఈ దరఖాస్తును వ్యతిరేకించదలచిన ఏ వ్యక్తి అయినా వ్రాతపూర్వకంగా వారి అభ్యంతరాలను ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి ఇరవై ఒక (21 రోజుల) లోపల రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ వారి కార్యాలయం, సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్‌అఫైర్స్ (ఐఐసిఏ), ప్లాట్ నెం.6, 7, 8, సెక్టార్-5, ఐఎంటి మానేసర్ జిల్లా, గుర్గామ్, హర్యానా, ఇండియా-122050 వారికి వ్రాతపూర్వకంగా కంపెనీకి దీని ఆఫీసుకు మరియు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, తెలంగాణ రాష్ట్రం కొరకు 2వ అంతస్తు, కార్పొరేట్ భవన్, బండ్లగూడ, నాగోల్, తట్టిఅన్నారం గ్రామం, హయాత్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్-500068 వద్ద ఒక ప్రతితో తెలియజేయవలెను.

దరఖాస్తుదారు పేరు
మెసర్స్ గ్లోబల్‌అరెనా6 స్పోర్ట్స్ ఎల్ఎల్‌పి
సం/- అభిషేక్ రెడ్డి కంకణాల
డిసిగ్నేటెడ్ పార్ట్‌నర్

తేది: 31 జనవరి, 2023

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

बैंक ऑफ महाराष्ट्र
Bank of Maharashtra
एक परिवार एक बैंक

స్ట్రెస్డ్ అసెట్స్ మేనేజిమెంట్ బ్రాంచ్
నెం. 4-3-448 నుండి 460 & 465 నుండి 468, 1వ అంతస్తు, వినూత్న పిట్‌స్ మెజెస్టి, గోపాల్‌బాగ్, బ్యాంక్ స్ట్రీట్ దగ్గర, కోఠి, హైదరాబాద్-500001.

ప్రకటన
(ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్, 2016 క్రింద)

ఐబిసి-2016లోని సెక్షన్ 95 క్రింద దిగువ పేర్కొన్న కార్పొరేట్ డెటార్ల యొక్క వ్యక్తిగల హామీదారులపై పర్సనల్ ఇన్సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రాసెస్ ప్రారంభించబడినది. గౌరవ ఎన్‌సిఎల్‌టి, హైదరాబాద్ వారు పిటిషనర్ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (ఫైనాన్షియల్ క్రెడిటార్) వారిని ఇన్సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రాసెస్‌ను ప్రారంభించుటకు సంబంధించి వారి వ్యక్తిగత చిరునామాలకు దరఖాస్తులు డెలివరీ కాని సంబంధిత హామీదారులను గుర్తించాల్సిందిగా ఆదేశించింది.

క్ర.సం.	పర్సనల్ గ్యారెంటర్	కార్పొరేట్ డెటార్	కేస్ రిఫరెన్స్ నెం.	తదుపరి విచారణతేది
1	శ్రీ కె శ్రీనివాస రావు	సన్‌కార్ప్ ఫ్లస్ (ప్రై) లిమిటెడ్	C.P. (IB) - 382/95/HDB /2022	21.02.2023
2	శ్రీ సుంకు రమేష్	సన్‌కార్ప్ ఫ్లస్ (ప్రై) లిమిటెడ్	C.P. (IB) - 380/95/HDB/2022	21.02.2023

తదుపరి వివరాల కొరకు, సంబంధిత వాటాదారులు **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర**, ఎస్ఏఎం బ్రాంచ్, కోఠి వారిని సంప్రదించండి.

అధీకృత అధికారి,
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

CUBEX TUBINGS LIMITED

CIN: L27109TG1979PLC002504
Registered Office:1-7-27 to 34, 2nd Floor, Shyam Towers, United Building Complex, Sarojini Devi Road, Secunderabad - 500003 Telangana, India. Email:info@cubextubings.com

STATEMENT OF UN-AUDITED FINANCIAL RESULTS FOR QUARTER & NINE MONTHS ENDED 31ST DECEMBER, 2022

(₹. in Lacs)

Particulars	3 months Ended current year	Year to date Figures	Corresponding 3 Months ended in the previous year
	31.12.2022 Un-audited	31.12.2022 Un-audited	31.12.2021 Un-audited
Total income from operations (net)	5267.39	13190.06	3281.49
Net Profit/(Loss) for the period (Before tax, Exceptional and/or Extraordinary items)	**93.65**	**227.69**	**43.66**
Net Profit/(Loss) for the period (after Exceptional and/or Extraordinary items)	93.65	227.69	43.66
Net Profit/(Loss) for the period after tax (after Exceptional and/or Extraordinary items)	**58.18**	**136.11**	**37.98**
Total comprehensive income for the period [comprising profit/(Loss) for the period (after tax) And other comprehensive income (after tax)]	58.18	136.11	37.98
Equity Share Capital	1431.89	1431.89	1431.89
Reserves (excluding Revaluation Reserve as shown in the balance sheet of previous year	4779.13	4779.13	4537.39
Earning per Share (of Rs.10/- each) (for continuing and discontinued operations) Basic:	0.41	0.95	0.26
Diluted:	0.41	0.95	0.26

1. The above is an extract of the detailed format of quarterly Financial Results filed with the Stock Exchanges under Regulation 33 of the SEBI (Listing and other Disclosure Requirements) Regulations, 2015
2. The above unaudited financial results have been reviewed by the Audit Committee and taken on record by the Board of Directors at their meeting held on **31st January, 2023**
3. The above results for the quarter ended on 31st December, 2022 are in compliance with the Indian Accounting Standards (Ind-AS) as notified by Ministry of Corporate Affairs. Consequently, results for the quarter ended on 31st December, 2022 have been restated to comply with Ind-AS to make comparable
4. The full format of the Financial Results are available on the Stock exchange websites and on www.cubextubings.com

For **CUBEX TUBINGS LIMITED**
Sd/-
P R BHANDARI
MANAGING DIRECTOR
DIN: 00062271

Place: Hyderabad
Date: 31st January 2023

SAMSRITA LABS LIMITED

(Formerly Known as DR Habeebullah Life Sciences Limited)
CIN No : L85110TG1996PLC099198
Regd. Office: 6-3-354/13/B2, Flat No.B2, Suryateja Apartments, Hindinagar, Punjagutta, Hyderabad - 500 082, Telangana State, India. Contact No. 9490424639
E-mail id: investorrelations@drhlsl.com, pcproductsindia@gmail.com
Website : www.drhlsl.com

31 డిసెంబర్, 2022తో ముగిసిన 3వ త్రైమాసికం మరియు 9 నెలల కాలవ్యవధి కొరకు ఆర్థిక ఫలితాల యొక్క సారాంశం

(రూ.లక్షల్లో)

వివరాలు	ముగిసిన 3 నెలలకు 31-12-2022	గతసంవత్సరంలో ముగిసిన సంబంధిత 3 నెలలకు 31-12-2021	ముగిసిన ప్రీసిడింగ్ 3 నెలలకు 30-09-2022	ముగిసిన ప్రస్తుత 9నెలల కాలవ్యవధికి 31-12-2022	ముగిసిన గత 9నెలల కాలవ్యవధికి 31-12-2021	ముగిసిన గత సంవత్సరం 31-03-2022
	ఆడిట్‌చేయనివి	ఆడిట్‌చేయనివి	ఆడిట్‌చేయనివి	ఆడిట్‌చేయనివి	ఆడిట్‌చేయనివి	ఆడిట్‌చేసినవి
ఆపరేషన్ల నుండి మొత్తం ఆదాయం (నికర)	4.64	4.17	4.52	13.55	12.18	192.87
కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపు మరియు/లేదా అసాధారణ ఐటంలకు ముందు)	(0.89)	(1.67)	0.03	(5.36)	(7.97)	149.84
పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపు మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	(0.89)	(1.67)	0.03	(5.36)	(7.97)	149.84
పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపు మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	(0.89)	(1.67)	0.03	(5.36)	(7.97)	149.84
కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు (కంప్రైసింగ్ లాభం/(నష్టం)(పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	(0.89)	(1.67)	0.03	(5.36)	(7.97)	149.84
ఈక్విటీ వాటా మూలధనం (ముఖ విలువ రూ.10/-చొప్పున)	1,480.87	1,480.87	1,480.87	1,480.87	1,480.87	1,480.87
వాటా ఒక్కింటికి రాబడి కొనసాగుతున్న మరియు నిలిచిపోయిన ఆపరేషన్ల కొరకు) (రూ.10/-చొప్పున) బేసిక్:	(0.01)	(0.01)	0.00	(0.04)	(0.05)	1.01
డైల్యూటెడ్:	(0.01)	(0.01)	0.00	(0.04)	(0.05)	1.01

గమనికలు:
1. 31 డిసెంబర్, 2022తో ముగిసిన 3వ త్రైమాసికం మరియు 9 నెలల కాలానికి పై ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలు చట్టబద్ధమైన ఆడిటర్లచే పరిమిత సమీక్షకు లోబడి ఉన్నాయి, మరియు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు మంగళవారం 31 జనవరి, 2023న నిర్వహించబడిన వారి సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్లచే ఆమోదించబడినవి.
2. సెబీ (ఎల్ఓడిఆర్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 నియమాలను అనుసరించి మరియు భారతదేశంలో సాధారణంగా ఆమోదించబడిన ఇతర అకౌంటింగ్ విధానాలు మరియు కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 133 క్రింద నిర్దేశించిన ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్ (ఐఎన్‌డి ఏఎస్) అనుసరించి ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలు సిద్ధం చేయబడినవి.
3. కంపెనీ ఒకే ఒక రిపోర్టబుల్ సెగ్మెంట్ అనగా హెల్త్ కేర్ సెక్టార్‌ను నిర్వహిస్తున్నది. కావున, సెగ్మెంట్ సమాచారంపై వేరుగా డిస్‌క్లోజర్ అవసరం లేదు.
4. పోల్చడం నిమిత్తం అవసరమైనచోట సంబంధిత గత త్రైమాసికాలు/ సంవత్సరం యొక్క అంకెలు రీ-గ్రూప్/ రీ-అరెంజ్ చేయబడినవి.

For **Samsrita Labs Limited**
సం/-
కె. కృష్ణం రాజు
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(DIN 00874650)

ప్రదేశం: హైదరాబాద్
తేది: 31-01-2023

నూతన రెవెన్యూ కార్యాలయాల నిర్మాణాలకు నిధులివ్వండి

- మంత్రి హరీశ్‌రావుకు ట్రెసా విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కొత్త కలెక్టరేట్ల మాదిరిగా డివిజన్, మండల కేంద్రాల్లో రెవెన్యూ శాఖకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు వీలుగా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగ రవీందర్‌రెడ్డి, కె.గౌతమ్‌కుమార్, ఉపాధ్యక్షులు కె.నిరంజన్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో ఈ మేరకు వారు మంత్రి హరీశ్‌రావును కలిసి విజ్ఞప్తి చేశారు. కొత్త మండలాలు, డివిజన్ కేంద్రాల్లో శాశ్వత రెవెన్యూ భవనాలు నిర్మించాలని కోరారు. పాత రెవెన్యూ కార్యాలయాల మరమ్మతులకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కొత్త మండలాలు, డివిజన్లు, కలెక్టరేట్లలో నూతన కేడర్ స్ట్రెంగ్త్ నిర్ధారించి సిబ్బందిని నియమించాలన్నారు. తహసీల్, డివిజన్ కార్యాలయాల నిర్వహణకు రెగ్యులర్ బడ్జెట్‌లో భాగంగా నిధులు కేటాయించాలని ప్రతిపాదించారు. తహసీల్దార్లకు, ఆర్డీవోలకు ఏకరూప వాహనాల కొనుగోలుకు నిధులివ్వాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏలకు పే స్కేలు వర్తింపజేసి వారి సర్వీసును క్రమబద్ధీకరించాలని కోరారు. ట్రెసా ప్రతిపాదించిన అంశాలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి హరీశ్‌రావు హామీనిచ్చారు.

హాస్టల్ వర్కర్ల బకాయిల కోసం 2న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి నిరాహార దీక్ష : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల 39 నెలల పెండింగ్ వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్ డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టేకం ప్రభాకర్, బి.మధు డిమాండ్ చేశారు. ఇదే అంశంపై ఈ నెల రెండో తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శాసనసభ సమావేశాల్లో తమ సమస్యలను ప్రస్తావించాలనీ, తమ డిమాండ్ల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి వినతిపత్రం అందజేశామని తెలిపారు. హాస్టల్ వర్కర్ల వేతనాల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల రెండో తేదీన ఎస్వీకేలో తాను నిరాహారదీక్షకు దిగుతానని నర్సిరెడ్డి ప్రకటించారని పేర్కొన్నారు. ఈ నిరాహార దీక్షలో ఔట్‌సోర్సింగ్, డైలీవేజ్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలకు సంబంధించి రూ. 9.15 కోట్ల విలువైన చెక్కు జనవరి నాలుగో తేదీ నుంచి పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. వేతనాల్లేక కార్మికులు అల్లాడుతుంటే చెల్లింపులపై సర్కారు ఆంక్షలు విధించడం అన్యాయమని తెలిపారు. డైలీవేజ్ కార్మికుల వేతనాల నిమిత్తం రూ.38 కోట్లు అవసరం కాగా కేవలం రూ.13 కోట్ల 65 లక్షలు జనవరి 14న విడుదల చేసినప్పటికీ 020 పద్దు ద్వారా వేతనాల చెల్లింపులపై ఈ-కుబేర్ సిస్టమ్‌లో ఆర్థిక శాఖ ఫ్రీజింగ్ విధించిందని వాపోయారు. తక్షణమే ఫ్రీజింగ్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 2)

Form No 3.
[See Regulation 15(1)(a)/16(3)]

1st Floor, Triveni Complex Abids, Hyderabad 500001

Case No.: OA/381/2021

Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.

CANARA BANK
VS
M/S FENOPLAST LIMITED AND OTHERS

To,
(4) **Mr. H. Krishna Kumar S/o Mr. H. Narsaiah** Age : Not Known, Occ : Director, R/o Flat No. 503, The Pooja Palace,Motilal Nehru Nagar, Begumpet,Hyderabad- 500016 **Alternatively Residing At** :Villa No. 112, First League,Journalist Colony, Gopannapally Village,Gachibowli, Hyderabad - 500032

SUMMONS

WHEREAS OA/381/2021 WAS LISTED BEFORE Hon'ble Presiding Officer/ Registrar on 04/01/2023 WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summon/ notice on the said Application under section 19(4) of the Act,(OA) filed against you for recovery Of debts of Rs.52,82,37,659.86/- (application along with copies of document etc, annexed)

In accordance with sub-section(4) of section 19 of the Act, you, the defendants are directed as under:-
(i) To show cause within thirty days of service of summons as to why relief prayed for should not be granted;
(ii) To disclose particulars of property or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and property disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and property specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the tribunal.
(v) You shall be liable to account for the sale proceeds realised by sale of secured assets or other assets and property in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets

You are directed to file the written statement with a copy thereof furnished to the applicant and appear before P.O on 27/02/2023 at 11.00 A.M. failing which the application shall be heard and decided in your absence.

Given under my hand and the seal of this tribunal on this date :

Sd/-
Signature of the Officer Authorised to Issue Summons

SPANDANA SPHOORTY FINANCIAL LIMITED

(CIN: L65929TG2003PLC040648)
Regd. Office: Galaxy, Wing B, 16th Floor, Plot No.1, Sy.No.83/1, Hyderabad Knowledge City, TSIIC, Raidurg Panmaktha, Hyderabad-500081, Telangana, India.
Phone No. : 040-45474750, Website: www.spandanasphoorty.com

31 డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలలకు ఆడిట్‌చేయని కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల నివేదిక యొక్క సారాంశం

(రూపాయలు మిలియన్లలో పేర్కొనకపోతే)

క్ర. సం.	వివరాలు	ముగిసిన త్రైమాసికం 31-12-2022 (Unaudited)	ముగిసిన తొమ్మిది నెలలకు 31-12-2022 (Unaudited)	గత సంవత్సరంలో సంబంధిత క్వార్టర్ 31-12-2021 (Unaudited)
1	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	3,546.61	9,026.24	3,461.36
2	కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల ముందు)	960.44	(1,207.43)	594.71
3	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	960.44	(1,207.43)	594.71
4	పన్ను తరువాత కాల్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	713.70	(931.80)	450.97
5	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత))	879.52	(1,596.20)	(329.54)
6	ఈక్విటీ వాటా మూలధనం (ముఖ విలువ వాటాకు రూ.10/-)	709.83	709.83	644.08
7	రిజర్వులు (గత సంవత్సరపు ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా రివ్యాల్యూవేషన్ రిజర్వులు మినహాయించి)			
8	వాటా ఒక్కింటికి రాబడి (రూ.10/- చొప్పున) (వార్షికం కానిది)- (కొనసాగుతున్న & నిలిచిపోయిన ఆపరేషన్ల కొరకు) బేసిక్ (రూ.)	10.05	(13.20)	6.99
	డైల్యూటెడ్ (రూ.)	10.03	(13.20)	6.97

గమనికలు:
1. పై ఆర్థిక ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు **31 జనవరి, 2023**న నిర్వహించబడిన వారి సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్లచే ఆమోదించబడినవి. సదరు సంవత్సరంలో కన్సాలిడేటెడ్ మరియు స్టాండ్‌అలోన్ ఆర్థిక నివేదికలు రెండింటిపై మార్పులేని అభిప్రాయాన్ని చట్టబద్ధ ఆడిటర్లు వ్యక్తం చేశారు.
2. కీ స్టాండ్‌అలోన్ ఆర్థిక సమాచారం.

వివరాలు	ముగిసిన త్రైమాసికం 31-12-2022 (Unaudited)	ముగిసిన తొమ్మిది నెలలకు 31-12-2022 (Unaudited)	గత సంవత్సరంలో సంబంధిత క్వార్టర్ 31-12-2021 (Unaudited)
ఆపరేషనల్ నుండి పూర్తి ఆదాయం	3,401.50	8,533.22	3,277.20
పన్నుకు ముందు లాభం	938.21	(1,351.98)	525.92
పన్ను తరువాత నికర లాభం	692.72	(1,038.85)	397.29

3. సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్ అండ్‌డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33క్రింద స్టాక్ ఎక్ఛేంజీలతో దాఖలుచేసిన త్రైమాసిక/వార్షిక ఆర్థిక ఫలితాల వివరణాత్మక ఫార్మాట్‌కు పై పేర్కొన్నవి సారాంశం. త్రైమాసిక మరియు వార్షిక ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్ఛేంజీల వెబ్‌సైట్స్: www.bseindia.com మరియు www.nseindia.com మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్ అనగా: www.spandanaspoorty.com పై అందుబాటులో ఉంటాయి.
4. అవసరమైనచోట పరిగణించుటకు గత సంవత్సరపు/కాలవ్యవధి యొక్క అంకెలు రీగ్రూప్ మరియు/ లేదా రిక్లాసిఫైడ్ చేయబడినవి.

బోర్డు ఆఫ్ డైరెక్టర్ల తరపున మరియు కొరకు
SPANDANA SPHOORTY FINANCIAL LIMITED
సం/-
శలభ్ సక్సేనా
మేనేజింగ్ డైరెక్టర్ & సిఇఓ.
DIN: 08908237

ప్రదేశం: హైదరాబాద్
తేది: 31 జనవరి, 2023

ఇండస్‌ఇండ్ బ్యాంక్

నెం.25, స్ట్రీపెల్ రీచ్, ఏ బ్లాక్, మూడవ అంతస్తు, క్యాథడ్రల్ రోడ్, గోపాలపురం, చెన్నై-600 086.

బహిరంగ ప్రకటన (సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3(1) క్రింద)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు యొక్క ప్రత్యామ్నాయ సర్వీసులు

ఇందుమూలంగా దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు నోటీసు ఇవ్వడమేమనగా **ఇండస్‌ఇండ్ బ్యాంక్ లిమిటెడ్ (ఐబిఎల్)** నుండి వారు పొందిన రుణ సదుపాయల తిరిగి చెల్లింపులో వారు డిఫాల్ట్ చెందినందున, అందుకు ఆర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం బ్యాంక్ యొక్క బుక్స్‌లో ఖాతా నాన్-పెర్ఫార్మింగ్ అసెట్స్‌గా వర్గీకరించబడినవి. ఆ తరువాత, దిగువ ఇచ్చిన వివరాల ప్రకారం సంబంధిత నోటీసు/ల తేది నుండి 60 రోజుల్లోపు నోటీసుల్లో పేర్కొన్నట్లుగా పై చెప్పిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటుతో తదుపరి మరియు ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు, చార్జీలు మొ।। వాటితో పూర్తి బాకీపడిన మొత్తాలను తిరిగిచెల్లించవలసిందిగా వారిని డిమాండ్ చేస్తూ మరియు సదరు రుణగ్రహీతలను కోరుతూ వారి చివరగా తెలిసిన చిరునామాలకు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 (SARFAESI చట్టం) యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును బ్యాంక్ జారీచేసింది. అయితే, సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2005 (SARFAESI రూల్స్) యొక్క రూల్ 3 ప్రకారం ఈ ప్రచురణ రూపంలో మాచే సర్వీసు చేయబడుతున్నది:

రుణ ఖాతా నెం.లు, ఏహెచ్ఏ00864ఎన్; **ఎన్‌పిఏ తేది:** 05.10.2022; **13(2) నోటీసు తేది:** 12.12.2022; **రుణగ్రహీత:** శ్రీ గండి భార్గవ్ గౌడ్, నివాసం: ఇ.నెం.5-2-9, వెంకటేశ్వర నగర్ కాలనీ, రాంపల్లి, కీసర మండలం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా-501301; సహ-రుణగ్రహీత: 1) శ్రీమతి ఎం.కల్పన, భర్త శ్రీ.గండి భార్గవ్ గౌడ్, నివాసం: ఇ.నెం.5-2-9, వెంకటేశ్వర నగర్ కాలనీ, రాంపల్లి, కీసర మండలం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా-501301; 13(2) నోటీసు మొత్తం: 11.11.2022 నాటికి మీరు బకాయిఉన్న మరియు చెల్లించాల్సినవి రూ.26,32,846.95 పై (రూపాయలు ఇరవైఆరు లక్షల ముప్పైరెండువేల ఎనిమిది వందల నలభైఆరు & తొంభైఐదు పైసలు మాత్రమే); ఆస్తి వివరణ: రాంపల్లి గ్రామం మరియు గ్రామపంచాయితీ, కీసర మండలం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వద్దగల సర్వే నెం.లు 191 & 192లోగల ప్లాట్ నం.5పై డోర్ నెం.5-2-9కలిగిన ఇంటితోసహా 290చ.గ.లు లేదా 242.44చ.మీ.ల విస్తీర్ణపు స్థలం యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: ఉత్తరం: 25' వెడల్పు రోడ్డు, దక్షిణం: ఓపెన్ ల్యాండ్, తూర్పు: ప్లాట్ నెం.6 మరియు పడమర: ప్లాట్ నెం.4.

రుణ ఖాతా నెం.లు, ఏహెచ్ఏ01011ఎన్; **ఎన్‌పిఏ తేది:** 05.10.2022; **13(2) నోటీసు తేది:** 12.12.2022; **రుణగ్రహీత:** శ్రీ బొక్క మురళీధర్ రెడ్డి, తండ్రి శ్రీ బొక్క సత్తిరెడ్డి, ప్లాట్ నెం.27, ఇంజపూర్, హయత్‌నగర్, రంగారెడ్డి జిల్లా-501510; సహ-రుణగ్రహీత 1: శ్రీమతి బొక్క శిరిష, భర్త శ్రీ.బొక్క మురళీధర్ రెడ్డి, నివాసం: ప్లాట్ నెం.27, ఇంజపూర్, హయత్‌నగర్, రంగారెడ్డి జిల్లా-501510; 13(2) నోటీసు మొత్తం: 11.11.2022 నాటికి మీరు బకాయిఉన్న మరియు చెల్లించాల్సినవి రూ.32,65,539.87 పై (రూపాయలు ముప్పైరెండు లక్షల అరవైఐదువేల ఐదువందల ముప్పైతొమ్మిది & ఎనభైఏడు పైసలు మాత్రమే); ఆస్తి వివరణ: ఇంజపూర్ గ్రామం, గతంలో హయత్‌నగర్ మండలం, ఇప్పుడు అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ మండలం, రంగారెడ్డి జిల్లా, గతంలో ఇంజపూర్ గ్రామపంచాయితీ, ఇప్పుడు తుర్కయాంజల్ మున్సిపాలిటీ & సబ్-రిజిస్ట్రార్, వనస్థలిపురం యొక్క రిజిస్ట్రేషన్ పరిధిలోని సర్వే నెం.లు 3/ఏ, 3/ఏఏ, 3/ఇ మరియు 3/ఇఇలోని ఆర్‌సిసి రూఫ్‌లో 784చ.అ.ల ప్లింత్ ఏరియా కలిగియున్న ఇ.నెం.6-116 (పిటిఐఎన్ నెం.1200200342)గల ఇంటితోసహా 171చ.గ.లు = 142.97చ.మీ.ల విస్తీర్ణపు స్థలం మొత్తం భాగం మరియు సరిహద్దులు: ఉత్తరం: 20'-0" వెడల్పు రోడ్డు, దక్షిణం: ప్లాట్ నెం.28, తూర్పు: 20'-0" వెడల్పు రోడ్డు మరియు పడమర: పొరుగువారి స్థలం.

మేము ఇందుమూలంగా రుణగ్రహీతను ఈ నోటీసు తేది నుండి 60 రోజుల్లోపు మాకు బాకీపడిన మొత్తం దానిపై తదుపరి వడ్డీ ప్లస్ ఖర్చులు, చార్జీలు, వ్యయాలతోసహా జారీచేసిన సంబంధిత డిమాండ్ నోటీసుల్లో మరింత స్పష్టంగా పేర్కొన్న బాకీపడిన మొత్తం తిరిగిచెల్లించమని కోరడమైనది, విఫలం చెందితే మీ స్వంత ఖర్చుల మరియు పరిణామాలతో సదరు రుణగ్రహీత(లు)/ సహరుణగ్రహీత(లు)/ చట్టబద్ధమైన వారసులు/ చట్టబద్ధమైన ప్రతినిధుల యొక్క పూర్తి రిస్క్‌తో సెక్యూర్డ్ అసెట్స్ యొక్క స్వాధీనంలోకి తీసుకొనుటకు మరియు విక్రయించుటకు వర్తించు రూల్స్ పరిమితి లేకుండా మరియు సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద పై సెక్యూర్డ్ ఆస్తులు/ స్థిరాస్తు(ల)పై చర్య తీసుకొనుటకు ముందుకు సాగుతాము. SARFAESI చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం, బ్యాంకు యొక్క వ్రాతపూర్వమైన అనుమతి లేకుండానే పై చెప్పిన సెక్యూర్డ్ అసెట్స్ అమ్మకం, లీజు లేదా ఇతర రూపాల్లో బదిలీచేయుట నుండి మీరందరూ నిషేధించబడినారని దయచేసి ఈ విషయాన్ని గమనించగలరు. మీచే సదరు సెక్షన్ యొక్క ఏదేని ఉల్లంఘన విషయంలో SARFAESI చట్టం మరియు/ లేదా ఈ విషయంలోని ఏదేని ఇతర లీగల్ ప్రొవిజన్ యొక్క సెక్షన్ 29 క్రింద పేర్కొన్నట్లుగా పీనల్ ప్రొవిజన్స్ సహాయం కోరవచ్చును.

చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (8) ప్రకారం, ఐబిఎల్‌చే వెచ్చించిన అన్ని ఖర్చులు, చార్జీలు మరియు వ్యయాలతోసహా ఐబిఎల్ యొక్క బకాయిలను అమ్మకం లేదా బదిలీ కొరకు నిర్ణయించిన తేదికి ముందుగా ఏదేని సమయానికి ఐబిఎల్‌కు చెల్లించినట్లయితే, సెక్యూర్డ్ అసెట్స్ ఐబిఎల్‌చే విక్రయించబడవు లేదా బదిలీచేయబడవు మరియు సెక్యూర్డ్ అసెట్ యొక్క బదిలీ లేదా అమ్మకం కొరకు ఐబిఎల్‌చే తదుపరి చర్యలు తీసుకోబడవు.

సం/-
ఇండస్‌ఇండ్ బ్యాంక్ లిమిటెడ్ తరపున
అధీకృత అధికారి

తేది: 01-02-2023
ప్రదేశం: హైదరాబాద్

చారిటీ కోసం ఫుడ్ కార్నివల్

- ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ ఏర్పాటు



హైదరాబాద్ : పేద, బలహీన వర్గాలకు సాయాన్ని కొనసాగించడానికి ఎస్‌బీఐ లేడిస్ క్లబ్ ఫన్ అండ్ ఫుడ్ కార్నివల్‌ను ఏర్పాటు చేసింది. బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ నుపూర్ జింగ్రాన్, హైదరాబాద్ సర్కిల్ సీజీఎం అమిత్ జింగ్రాన్ లాంచనంగా ప్రారంభించారు. ఇక్కడ 55 ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేశారు. అధికంగా ఇందులో మహిళలు ఏర్పాటు చేసినవే కావడం విశేషం. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన నిధులను సహాయ కార్యక్రమాలకు ఉపయోగించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఎస్‌బీఐ లేడిస్ క్లబ్ చేపట్టే ఈ తరహా కార్యక్రమాలకు తమ మద్దతు కొనసాగుతుందని అమిత్ జింగ్రాన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి లేడీస్ క్లబ్ ప్రతినిధులు సహా బ్యాంక్ ఉద్యోగులు వారి కుటుంబాలతో హాజరయ్యారు.

TCI EXPRESS

LEADER IN EXPRESS

టిసిఐ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్
CIN: L62200TG2008PLC061781
రిజిస్టర్డు ఆఫీస్: ఫ్లాట్ నెం.లు 306& 307, 1-8-271 నుండి 273, అశోక భూపాల్ చాంబర్స్, ఎస్.పి.రోడ్, హైదరాబాద్-500 003, తెలంగాణ.
కార్పొరేట్ ఆఫీస్: టిసిఐ హౌస్, 69 ఇన్స్టిట్యూషనల్ ఏరియా, సెక్టార్-32, గురుగ్రామ్-122001, హర్యానా
Tel.: + 91 124 2384090-94, E-mail: secretarial@tciexpress.in, Website: www.tciexpress.in

31 డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలలకు ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల నివేదిక

క్ర. సం.	వివరాలు	ముగిసిన త్రైమాసికం 31 డిసెంబర్, 2022 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన 9 నెలలకు 31 డిసెంబర్, 2022 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన సంవత్సరం 31 డిసెంబర్, 2021 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన సంవత్సరం 31 మార్చి, 2022 (ఆడిట్‌చేసినవి)
1.	ఆపరేషన్ల నుండి మొత్తం ఆదాయం (నికర)	315.72	920.26	288.99	1089.65
2.	కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల &/లేదా అసాధారణ ఐటంలకు ముందు)	42.65	133.66	46.84	172.01
3.	పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల&/లేదా అసాధారణ ఐటంలకు తరువాత)	42.65	133.66	46.84	172.01
4.	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల&/లేదా అసాధారణ ఐటంలకు తరువాత)	32.02	100.82	35.13	128.85
5.	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధిలో కంప్రైసింగ్ లాభం (నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత))	32.02	100.56	35.13	127.81
6.	చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం (ముఖ విలువ రూ.2/-)	7.67	7.67	7.70	7.70
7.	ఇతర ఈక్విటీ				528.49
8.	వాటా ఒక్కింటికి రాబడి -ఈపిఎస్ (వార్షికం కానిది)-రూ.లలో				
	బేసిక్ వాటా ఒక్కింటికి రాబడి	8.32	26.21	9.13	33.48
	డైల్యూటెడ్ వాటా ఒక్కింటికి రాబడి	8.30	26.14	9.12	33.45

గమనికలు:
1) సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్ మరియు డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్ఛేంజీతో దాఖలు చేసిన ముగిసిన త్రైమాసికం ఆర్థిక ఫలితాల వివరణాత్మక ఫార్మాట్‌కు పై పేర్కొన్నవి సారాంశం. ముగిసిన త్రైమాసిక ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్ఛేంజీల వెబ్‌సైట్లు (www.bseindia.com మరియు www.nseindia.com) పై మరియు కంపెనీ వెబ్‌సైట్ (www.tciexpress.in) పై అందుబాటులో ఉంటాయి.
2) 31 డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసికం కొరకు కంపెనీ యొక్క ఆర్థిక ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు ఆ తరువాత 31 జనవరి, 2023న నిర్వహించబడిన వారి సంబంధిత సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ద్వారా ఆమోదించబడినవి. వాటికి సంబంధించి పరిమిత సమీక్షను కంపెనీ యొక్క చట్టబద్ధమైన ఆడిటర్లు నిర్వహించారు.

టిసిఐ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్
చందర్ అగర్వాల్
(మేనేజింగ్ డైరెక్టర్)

ప్రదేశం: గురుగ్రామ్
తేది: 31 జనవరి, 2023

SOUTHERN MAGNESIUM AND CHEMICALS LIMITED

SMCL

CIN: L27109TG1985PLC005303. Regd. office: Deccan Chambers, 5th Floor, 6-3-666/B, Somajiguda, Hyderabad – 500 082. Phone No: 040-23312341, 23311789, 48538444. Fax No.: 040-23319871.

31 డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలలకు ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలు

రూ.లక్షల్లో

క్ర. సం.	వివరాలు	ముగిసిన త్రైమాసికం 31.12.2022	ముగిసిన త్రైమాసికం 30.09.2022	ముగిసిన త్రైమాసికం 31.12.2021	ముగిసిన అర్ధ సంవత్సరానికి 31.12.2022	ముగిసిన అర్ధ సంవత్సరానికి 31.12.2021	ముగిసిన సంవత్సరానికి 31.03.2022
		ఆడిట్‌చేయనివి	ఆడిట్‌చేయనివి	ఆడిట్‌చేయనివి	ఆడిట్‌చేయనివి	ఆడిట్‌చేయనివి	ఆడిట్‌చేసినవి
I	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం (నికర)	280.43	107.04	141.09	680.66	220.74	237.79
II	కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను మరియు మినహాయింపు ఐటెంలకు ముందు)	160.28	39.64	84.29	378.90	77.92	50.46
iii.	మినహాయింపుగల ఐటంలు	-	-	-	-	-	-
iv.	కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్నుకు ముందు మినహాయింపుగల ఐటంల తరువాత)	160.28	39.64	84.29	378.90	77.92	50.46
	ప్రస్తుత పన్ను వ్యయాలు	42.25	10.34	13.49	90.81	13.49	6.66
	ఇదివరకటి సంవత్సరాలకు సంబంధించినది	-	-	-	-	-	-
	వ్యత్యాస పన్ను	(0.11)	(0.38)	6.14	7.63	3.35	3.76
v.	కాలవ్యవధి కొరకు నికర లాభం/ (నష్టం) (మినహాయింపుగల ఐటంల తరువాత)	118.15	29.67	64.66	280.45	61.08	40.04
vi.	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం	118.15	29.67	64.66	280.45	61.08	40.04
vii.	ఈక్విటీ వాటా మూలధనం	3,000,000	3,000,000	3,000,000	3,000,000	3,000,000	3,000,000
viii.	ఈక్విటీ వాటా ఒక్కింటికి రాబడి-(వార్షికం కానిది) ఎ) బేసిక్:	3.94	0.99	2.16	9.34	2.04	1.33
	బి) డైల్యూటెడ్:	3.94	0.99	2.16	9.34	2.04	1.33

గమనికలు:
పై ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు 31.01.2023న నిర్వహించిన వారి సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్లచే ఆమోదించబడినవి. సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ & డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్స్ సెక్షన్ 33 క్రింద స్టాక్ ఎక్ఛేంజీలతో దాఖలు చేయబడిన ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక ఫార్మాట్ యొక్క సారాంశం పై విధంగా ఉన్నది. ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్ఛేంజ్ వెబ్‌సైట్: www.bseindia.com మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్: www.southernmagnesium.com పై అందుబాటులో ఉంటాయి.

బోర్డు ఆఫ్ డైరెక్టర్ల కొరకు & తరపున
సం/- (ఎస్.రాజేందర్ ప్రసాద్)
జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్

తేది: 31-01-2023
ప్రదేశం: హైదరాబాద్

సంపాదకీయం

దీపశిఖలు

దక్షిణాఫ్రికాలో మహిళల తొలి అండర్-19 టీ20 వరల్డ్ కప్‌లో ఆదివారం సాయంత్రం భారతీయ బాలికలు ఇంగ్లండ్ జట్టును మట్టికరిపించి, ప్రపంచ విజేతగా నిలిచిన క్షణాలు. మహిళా క్రికెట్లో భారత్‌కిది మొట్టమొదటి ఐసీసీ ట్రోఫీ. ఈ ప్రతిభాపాటవాలు భారత మహిళా క్రికెట్ భవిష్యత్తుకు బలమైన పునాది. తెలుగమ్మాయిలు త్రిష,

ప్రభుత్వాలు మొండి చేయి చూపినా పట్టుదలతో అంతర్జాతీయ పోటీల్లో ప్రతిసారీ దేశ ప్రతిష్టను నిలబెట్టే బాధ్యతను భుజాన వేసుకొంటున్న మగువలను అభినందించాలి. ఇకనైనా, తరతరాలుగా సమాజంలో అణచివేతకు గురైన స్త్రీమూర్తులకు ఇంటా బయటా తగినంత ప్రోత్సాహం, శిక్షణ అందించడంపై ప్రభుత్వాలు దష్టిపెట్టాలి. అతివలంటే అబలలు కాదని నిరూపించిన వీర వనితలకు జేజేలు.

షబ్నమ్‌లూ మువ్వన్నెల పతాకను రెపరెపలాడించడంలో కీలక భూమిక పోషించారు. నిజానికి, అర్ధశతాబ్ద కాలంలో మన మహిళా క్రికెట్ అనేక శంఖలాలు తెంచుకొంది. పంజరాలను దాటింది. సామాన్య స్థాయి నుంచి అసామాన్యతకు ఎదిగింది. గడచిన రెండు సీనియర్ల టీ20 వరల్డ్ కప్‌లలో మన మహిళా జట్టు సెమీ ఫైనలిస్టుగా, ఫైనలిస్టుగా నిలిచింది. దక్షిణాఫ్రికాలో తాజా టీ20 కప్‌లో బాలికలు ఏకంగా విజేతలయ్యారు. ఇది వారి జీవితాల్లోనే కాదు. యావత్ భారత మహిళా క్రికెట్ చరిత్రలోనే కీలక మలుపు.

నిరుడు ఫిబ్రవరిలో 19 ఏండ్లలోపు అబ్బాయిలు జయకేతనం ఎగరవేస్తే.. నేడు షెఫాలీ వర్మ సేన అదే ఇంగ్లాడ్‌ను చిత్తుగా ఓడించి విశ్వవిజేతగా నిలిచింది. ఈ టోర్నీ ఆసాంతం శ్వేత, షెఫాలీ, త్రిషలు పరుగుల వరద పారిస్తే, పార్శవి చోప్రా, మన్నత్ కశ్యప్, అర్చనాదేవి ప్రభృతులు వికెట్లు కూల్చి భారత్‌ను విజయపథాన నిలబెట్టారు. పురుషులతో పాటు సమాన పారితోషికం లేకున్నా, ఇంటా బయటా ఎన్ని అవమానాలు ఎదురైనా, ఆర్థిక, సామాజిక అవరోధాలున్నా అవన్నీ దాటుకొని వచ్చిన అమ్మాయిలు కాబట్టి తాజా విజయం మరింత గొప్పది. ఆడపిల్లలను ప్రోత్సహిస్తే వారు కుటుంబానికే కాదు... దేశానికీ ఎంతటి పేరు తెస్తారో చెప్పడానికి ఇదొక తాజా దర్పణం. బ్యాడ్మింటన్ తర్వాత భారత మహిళా క్రీడాంగణంలో ఇక క్రికెట్ కొత్త దీపశిఖ.

వాస్తవానికి దేశం నలుమూలలా క్రీడా పాఠశాలల్లో రకరకాల సమస్యలు తిష్టవేయడం నిర్ఘాంతపరుస్తోంది. విజేతల సృజనలో తలమునకలు కావాల్సిన ప్రాంగణాలు శిక్షకుల కొరతతో, నిధుల లేమితో కిందమీదలవుతున్నాయి. ఒకప్పుడు దేశమంతటా మోతెక్కిపోయిన 'ఖేలో ఇండియా' స్ఫూర్తి నిలువునా నీరోడుతోంది! ఆ మాటకొస్తే, దక్షిణ భారతదేశంలోని మూడోవంతు పాఠశాలలకు ఆటస్థలాలు లేవు. బిహార్, ఒడిశా, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో మైదానాలు కలిగిన బడులు 40శాతం లోపే. దేశీయంగా అత్యంత నిరాదరణకు గురవుతున్న క్రీడల దౌర్భాగ్య పరిస్థితికి అధికారిక గణాంకాలే నిలువుటద్దం.

'కంప్యూటర్ ప్లే స్టేషన్‌లో కాదు... నిజమైన క్రీడామైదానాల్లో యువత స్వేదం చిందించాలి' అని 'మన్ కీ బాత్'లో ప్రధాని మోడీ పిలుపిచ్చారు. కానీ, అందుకు తగిన కార్యాచరణ గురించి ఎప్పుడూ ప్రధాని ఉలకరూ,పలకరు. గత కొంత కాలంగా మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్న రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై చర్యలకు ప్రధాని మనసు అంగీకరించడం లేదు. ప్రతి పాఠశాలలోనూ ఆటస్థలం, క్రీడాసామగ్రి ఉండి తీరాలన్న విద్యాహక్కు చట్టం దశాబ్దాలుగా చట్టుబండలవుతోంది! పాఠశాల దశనుంచీ ఆటలకు ప్రోత్సాహం, అంశాలవారీగా ప్రత్యేక శిక్షణా సంస్థల అవతరణ, విస్తృత మౌలిక వసతుల పరికల్పనలకు విశేష ప్రాధాన్యమిస్తున్న చైనా, థాయ్‌లాండ్, జపాన్, యూకే ప్రభృత దేశాలు ప్రతిష్టాత్మక వేదికలపై పతకాల పంట పండిస్తున్నాయి. అమెరికా, ఆస్ట్రేలియా వంటివి క్రీడను పరిశ్రమగా సమాదరిస్తూ అద్భుత ఫలితాలను ఒడిసిపడుతున్నాయి. అదే ఇక్కడ? ఉన్నత స్థాయి క్రీడా సదుపాయాలు, మేలిమి శిక్షణ ఏర్పాట్ల విషయంలో మాటలకు, చేతలకు మధ్య ఉన్న యోజనాల దూరం తరగడంలేదు.

ఇప్పుడు కండ్లు తెరిస్తే కనిపించే నిజం ఒక్కటే 'ఆడవాళ్ళకు ఆటలేమిటి' అన్న సమాజానికి ఇప్పుడు ఆ ఆడవాళ్లే విజయాలను అందిస్తున్నారు. పాఠశాలల్లో ఆడుకోవడానికి ఖాళీ స్థలం మొదలు కనీస సౌకర్యాలు కూడా కష్టమైన దేశంలో, మార్కులు తప్ప ఆటలెందుకని ఆలోచించే పెంపకంలో, 'వంటింట్లో తప్ప మైదానంలో ఆడవాళ్ళకేం పని' అనే పాలకనేతల మానసిక స్థితి మారనంత కాలం ఇంతే. ఎంత ప్రతిభ ఉన్నా ఆర్థిక, హార్దిక ప్రోత్సాహం కరమైన పరిస్థితుల్లో, ఆటల్లోనూ అధికార, కులమత రాజకీయ రొచ్చు క్రీడల్లో సైతం చొరబడటం శోచనీయం. ప్రభుత్వాలు మొండి చేయి చూపినా పట్టుదలతో అంతర్జాతీయ పోటీల్లో ప్రతిసారీ దేశ ప్రతిష్టను నిలబెట్టే బాధ్యతను భుజాన వేసుకొంటున్న మగువలను అభినందించాలి. ఇకనైనా, తరతరాలుగా సమాజంలో అణచివేతకు గురైన స్త్రీమూర్తులకు ఇంటా బయటా తగినంత ప్రోత్సాహం, శిక్షణ అందించడంపై ప్రభుత్వాలు దృష్టిపెట్టాలి. అతివలంటే అబలలు కాదని నిరూపించిన వీర వనితలకు జేజేలు.

రష్యా-జర్మనీలను శాశ్వత శత్రుదేశాలుగా
మార్చే అమెరికా కుటిల పన్నాగం!

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ(45) పుట్టిన రోజు సందర్భంగా జనవరి 25న అమెరికా, జర్మనీ, ఇతర ఐరోపా దేశాలు ఆధునిక టాంకులను అందచేస్తామని ప్రకటించాయి. ఉక్రెయిన్‌పై రష్యా ప్రారంభించిన సైనిక చర్యకు ఫిబ్రవరి 24నాటికి ఏడాది పూర్తి అవుతుంది. ఉక్రెయిన్-రష్యాలను కూర్చోబెట్టి రెండు దేశాల్లో ఉన్న భయ, సందేహాలను పోగొట్టి వివాదాన్ని పరిష్కరించి ప్రశాంతతను చేకూర్చాల్సిందిపోయి మరింత ఆజ్యం పోసేందుకు పూనుకున్నాయి. టాంకులను ఎప్పుడైతే ఇస్తామని చెప్పిన వెంటనే తమకు జెట్ యుద్ధ విమానాలు కావాలని ఉక్రెయిన్ కోరటం గమనించాల్సిన అంశం. సంక్షోభంలో ఇదొక ప్రమాదకర కొత్త మలుపు. నిజానికి ఇదంతా ఒక పథకం ప్రకారమే జరుగుతోందని చెప్పవచ్చు. సమీప భవిష్యత్‌లో దీన్ని ముగించే బదులు ఏ పరిణామాలకు దీన్ని తీసుకుపోతాయో అన్న ఆందోళన కలుగుతోంది.


ఎం. కోటేశ్వరరావు

తమ వద్ద ఉన్న అబ్రామ్ టాంకులను ఇస్తామని అమెరికా, లెపర్డ్(చిరుత పులి) రకం టాంకులను ఇస్తామని జర్మనీ కొద్ది తేడాతో ఒకే రోజు ప్రకటించాయి. జర్మనీ ఆ రకం టాంకులను ఇప్పటికే అనేక నాటో దేశాలకు సరఫరా చేసింది. ఒప్పందం ప్రకారం వాటిని మరో దేశానికి విక్రయించాలంటే జర్మనీ అనుమతి అవసరం. గత రెండు మూడు నెలలుగా ఆ మేరకు కొన్ని దేశాలు ఒత్తిడి తెస్తున్నాయి. తామే వాటిని ఉక్రెయిన్ ఇచ్చేందుకు అంగీకరించినందున మిగతా దేశాలకు సైతం

మరో దేశానికి మారణాయుధాలు అందిస్తే అమెరికా సమాజంలో వ్యతిరేకత తలెత్తే అవకాశం ఉంది. దాన్ని నివారించేందుకు ముందుగానే అమె రికా రాజకీయ నేతలు కూడా సన్నాయి నొక్కులు ప్రారంభించారు. అంతకు ముందే రష్యాను ఒక బూచిగా చూపుతున్న సంగతి తెలిసిందే." వారికేమి కావాలో తెలుసుకొనేందుకు కీవ్ (ఉక్రెయిన్) నేతలతో నిరంతరం చర్చలు జరుపుతున్నాం.మరిన్ని ఆయుధాలు కావాలని కోరుతున్న ఉక్రేనియన్లను కూడా మనం తప్పు పట్టలేము.

అనుమతి ఇచ్చింది. అబ్రామ్ రకం టాంకులను అందచేస్తున్నట్లు జో బైడెన్ ప్రకటించేశాడు. దీని వెనుక అమెరికా దుష్ట పన్నాగం గురించిన హెచ్చరికలు వినిపించాయి. జర్మనీలోని యుద్ధ, ఆయుధ లాబీలను కూడగట్టుకొని అమెరికా వేసిన ఎత్తుగడలో భాగంగా జర్మనీ కూడా టాంకులను అందించేందుకు సిద్ధపడిందన్నది ఒక కథనం. ఐరోపాలో తమ పెత్తనాన్ని సుస్థిరం గావించుకొనేందుకు జర్మన్ పాలకవర్గ పూనికలో భాగంగానే ఇదంతా జరుగుతోందన్నది మరొక కథనం. జర్మనీని ముందుకు తోస్తే ఒక వేళ రష్యా ప్రతిదాడికి దిగితే తొలి దెబ్బ పడేది జర్మనీ మీదనే కనుక తన చేతికి మట్టి అంటకుండా ఐరోపాలో పెత్తనాన్ని పటిష్టపరుచుకొనేందుకు అమెరికాకు వీలుకలుగుతుంది.

సినిమాల్లో కథను రక్తి కట్టించేందుకు నాటకీయ మలుపులు తిప్పుతారు. పశ్చిమ దేశాల తీరు మొదటి నుంచీ అలాగే ఉంది. సైనిక చర్య ప్రారంభం కాగానే రష్యాతో రాజీ చర్చ లంటూ తొలి అంకానికి తెరలేపారు. పరిష్కారానికి తాము మద్దతు ఇస్తున్నా మంటూ సానుకూల వచనాలు పలికారు. తరువాత పడనీయకుండా కొత్త కొత్త డిమాండ్లను ముందుకు తెస్తూ సాగదీశారు.చివరకు మాటా మంతీ లేని స్థితికి నెట్టారు. ఆ తరువాత రష్యాను ఎదుర్కొనేందుకు తమకు తోడ్పడాలంటూ జెలెన్స్కీ చేసిన ప్రతిపాదనలన్నింటినీ అవి రష్యాతో వైరాన్ని పెంచేవిగా ఉన్నవంటూ ముందు పశ్చిమ దేశాలు తిరస్కరించటం తరువాత ఆకస్మికంగా మారు మనస్సు పుచ్చుకున్నట్లుగా అనివార్యమైనందున అంగీకరించాల్సి వచ్చిందని ప్రపంచాన్ని నమ్మించేందుకు చూశాయి. దాన్లో భాగంగా నాటో దేశాలు వేలాది ఎటిజిఎం(నిర్దేశిత టాంకు విధ్వంసక క్షిపణులు), మాన్‌పాడ్స్ (భుజాల మీద మోసుకుపోతూ విమానాలు, హెలికాప్టర్ల మీద దాడి చేసేవి)ను ఉక్రెయిన్‌కు అందచేశారు. ఇప్పుడు భారీ టాంకులను, వాటిని నడిపేందుకు అవసరమైన ఇంధనాన్ని అందచేసేందుకు కూడా నిర్ణయించాయి. ఆ ప్రకటనలు ఇంకా జనం నోళ్లలో నాను తుండగానే తమకు జెట్ విమానాలిచ్చి పుతిన్ సేనలను ఎదుర్కొనేందుకు తోడ్పడాలని ఉక్రెయిన్ వినతులు ప్రారంభించింది. దీని వెనుక ఉన్న అసలు కథ ఏమంటే ఇప్పటి వరకు ఉక్రెయిన్ వద్ద ఉన్న సోవియట్ కాలం నాటి టాంకులు, విమానాలు నిండుకుంటున్నందున కొత్త వాటిని సమకూర్చుతున్నారు. రానున్న రోజుల్లో జరిగే ప్రతిఘటనంతా పశ్చిమ దేశాల సరకు, సరంజామాతోనే. నాటో కూటమికి చెందిన మిలిటరీ ప్రత్యక్షంగా పాల్గొనదు తప్ప ఆయుధాలన్నీ దాదాపు వారివే.



తదుపరి పెద్ద తమకు పెద్ద ఆటంకం ఫైటర్ జెట్స్ మాత్రమే అని ఉక్రెయిన్ రక్షణ మంత్రి సలహాదారు యూరీ శాక్ చెప్పాడు. నాలుగవ తరం ఆధునిక విమానాలను సాధ్యమైనంత త్వరలో పొందేందుకు చేయాల్సిందంతా చేస్తాము అన్నాడు. వాటిలో అమెరికా ఎఫ్16తో సహా ఉంటాయని వేరే చెప్పనవసరం లేదు. " తొలుత వారు మాకు భారీ ఫిరంగులు ఇవ్వాలను కోలేదు, తరువాత ఇచ్చారు. హిమార్స్ వ్యవస్థలను కూడా ఇవ్వాలనుకోలేదు, తరువాత ఇచ్చారు, టాంకులు కూడా అంతే ఇప్పుడు ఇస్తామని చెప్పారు. అణ్వాయుధాలు తప్ప మేం పొందలేనిది ఏదీ లేదు " అని శాక్ చెప్పాడంటే పశ్చిమ దేశాల పథకం గురించి తెలియదని అనుకోలేము. తమ గగన తలంలోకి రష్యా చొరబడకుండా ఉండేందుకు తమకు విమానాలు కావాలని గతేడాదే జెలెన్స్కీ అమెరికా కాంగ్రెస్‌ను కోరాడు. ఆ కోర్కెను అంగీకరించటమంటే అది నాటో కూటమి రష్యాతో ప్రత్యక్షంగా తలపడటంతో సమానం కనుక మరీ ఎక్కువగా ఆ డిమాండ్‌ను ముందుకు తీసుకురావద్దని గతంలో సలహా ఇచ్చినట్లు వార్తలు.

ఇప్పుడు మరోసారి దాన్ని పునరుద్ఘాటించటమంటే వాటిని కూడా అందచేసేందుకు అవసరమైన పూర్వరంగాన్ని సిద్ధం చేస్తున్నారనే అనుకోవాలి. అందుకు గాను ప్రచార యంత్రాంగాన్ని ఒక విధంగా ఇప్పటికే రంగంలోకి దించారు. కొన్ని ప్రాంతాల నుంచి పుతిన్ సేనలు వెనక్కు తగ్గటం వెనుక భారీ దాడులకు సిద్ధం కావటమే అంటూ కథనాలు రాశారు.

మరో దేశానికి మారణాయుధాలు అందిస్తే అమెరికా సమాజంలో వ్యతిరేకత తలెత్తే అవకాశం ఉంది. దాన్ని నివారించేందుకు ముందుగానే అమెరికా రాజకీయ నేతలు కూడా సన్నాయి నొక్కులు ప్రారంభించారు. అంతకు ముందే రష్యాను ఒక బూచిగా చూపుతున్న సంగతి తెలిసిందే." వారికేమి కావాలో తెలుసుకొనేందుకు కీవ్ (ఉక్రెయిన్) నేతలతో నిరంతరం చర్చలు జరుపుతున్నాం. మరిన్ని ఆయుధాలు కావాలని కోరుతున్న ఉక్రేనియన్లను కూడా మనం తప్పు పట్టలేము.యుద్ధ విమానాల గురించి వారు మాట్లాడటం ఇదే మొదటి సారి కాదు. దాని గురించి చేసేందుకు నా వద్ద ఎలాంటి ప్రకటనలు లేవు. " అని అమెరికా రక్షణశాఖ ప్రతినిధి జాన్ కిర్బీ చెప్పాడు. అంటే తరువాత వీలు చూసుకొని రష్యా ఏకపక్ష దురాక్రమణ కారణంగా ఇవ్వటం మినహా తమకు మరొక మార్గం లేదని పెంటగన్ చెప్పేందుకు చూస్తున్నదనుకోవాలి.టాంకులు ఉక్రెయిన్ ప్రాంతాలను కాపాడటం తప్ప రష్యాకు ముప్పుతెచ్చేందుకు కాదని అమెరికా విదేశాంగ మంత్రి లాయడ్ ఆస్టిన్ చెప్పాడు. పుతిన్ సేనలు ఎప్పుడు వెనక్కు పోతే పోరు ఆ మరు నాడే ఆగుతుందన్నాడు. ప్రపంచాన్ని నమ్మించే వంచన కబుర్లు తప్ప ఇవి మరొకటి కాదు.తమ ప్రాదేశిక సమ గ్రతకు హామీ ఇచ్చి, నాటోను విస్తరించబోమని, ఉక్రెయిన్‌ను తమ పక్కలో బల్లెంగా మార్చబోమని నాటో కూటమి హామీ ఇస్తే సైనిక చర్యను వెంటనే ఆపివేస్తామని ప్రారంభంలోనే రష్యా ప్రకటించిన సంగతి తెలిసిందే.

జర్మనీ తొలుత 14 చిరుత రకం టాంకులు ఇస్తామని చెబితే అమె రికా 31 ఇవ్వనున్నట్లు ప్రకటించింది. తరువాత వాటిని ఇంకా పెంచుతారు. ఇవిగాక ఉక్రెయిన్‌కు మద్దతు ఇస్తున్న ఇతర ఐరోపా దేశాలు కూడా తమ వద్ద ఉన్న చిరుతలను అందచేస్తామని ప్రకటిస్తున్నాయి. పశ్చిమ దేశాలు ఇప్పటి వరకు ఇచ్చిన సాయంతో పుతిన్ సేనలను వెనక్కు కొట్టామని, అనేక విజయాలను సాధించినట్లు చేసిన ప్రచారం గురించి తెలిసిందే. నిజానికి అలాంటి పరిస్థితే ఉంటే ఇప్పుడు భారీ టాంకులు ఇవ్వాల్సిన అవసరం

"తొలుత వారు మాకు భారీ ఫిరంగులు ఇవ్వాలనుకోలేదు, తరువాత ఇచ్చారు. హిమార్స్ వ్యవస్థలను కూడా ఇవ్వాలనుకోలేదు, తరువాత ఇచ్చారు, టాంకులు కూడా అంతే ఇప్పుడు ఇస్తామని చెప్పారు. అణ్వాయుధాలు తప్ప మేం పొందలేనిది ఏదీ లేదు " అని శాక్ చెప్పాడంటే పశ్చిమ దేశాల పథకం గురించి తెలియదని అను కోలేము. తమ గగన తలంలోకి రష్యా చొరబడ కుండా ఉండేందుకు తమకు విమానాలు కావాలని గతేడాదే జెలెన్స్కీ అమెరికా కాంగ్రెస్‌ను కోరాడు.

ఏముంది ? విమానాలను ఎందుకు కోరుతున్నట్లు ? పోనీ ఇవ్వనున్న టాంకుల సామర్ధ్యం ఏమిటి అన్న చర్చను జరిపేందుకు పశ్చిమ దేశాల మీడియా సిద్ధం కావటం లేదు.టాంకులు ఇవ్వటాన్ని చారిత్రాత్మకం అని జర్మనీ వర్ణించటమే కాదు ఆట తీరునే మార్చివేస్తుందని చెప్పుకుంది. సంక్షోభం మొదలైనప్పటి నుంచి పశ్చిమ దేశాల నేతలు, వారికి వంత పాడే మీడియా విశ్లేషకులు అదే కబుర్లు చెబుతున్నారు, ఇదిగో పుతిన్ పతనం అదిగో రష్యా వెనుకడుగు అని అంటూనే ఉన్నారు. ఇలాంటి టక్కు టమారాలను చాలా చూశాం టాంకుల అందచేత ఒక విధ్వంసకర పథకం, టాంకుల గురించి అతివర్ణన అంటూ రష్యా ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ కొట్టిపారవేశాడు.

రష్యాతో పోరుకు జర్మన్ టాంకులు ఇవ్వటం చారిత్రక తప్పిదం అవుతుందని జర్మన్ పార్లమెంటులోని వామపక్ష పార్టీ ప్రతినిధి సెవిమ్ డగడెలెన్ రాసిన ఒక విశ్లేషణలో పేర్కొన్నారు.ఆమె పార్లమెంటు రక్షణ, విదేశాంగ కమిటీలలో, నాటో పార్లమెంటు సభ్యురాలిగా ఉన్నారు. బెర్లిన్‌ను కేంద్రంగా మార్చి ఐరోపా పరిష్కారం అంటూ రష్యాతో పోరుకు అమెరికా ఎందుకు జర్మన్లను ముందుకు నెడుతున్నట్లు ? దీనికి సంబంధించి అమెరికన్లు చేస్తున్న వాదనలు సాకు మాత్రమే అన్నారు. అమెరికా మిలిటరీ సామర్థ్యం నిర్వహణ సమస్యలవంటి వాటితోపాటు చైనాను ఎదుర్కొనేందుకు అవసరమని చెప్పటం విశ్వసనీయమైంది కాదు. రష్యా ఎదురుదాడికి దిగితే తొలి దెబ్బ తగిలేది జర్మనీకే అని అమెరికా భావిస్తుండవచ్చు. తద్వారా జర్మనీ-రష్యా మధ్య శాశ్వతంగా సహకారం ఉండకూడదన్న అమెరికా దీర్ఘకాలిక వ్యూహాత్మక లక్ష్యంలో భాగం కావచ్చు. పశ్చిమ దేశాల టాంకులు గనుక రంగంలోకి దిగితే అణ్వాయుధాలను తీస్తే ముందుగా వేసేది జర్మనీ మీదనే. మిత్ర దేశాన్ని ఒక సామంత దేశంగా పరిగణించి దాన్ని బలిచేసే ఎత్తుగడ ఉంది. మరోవైపున చైనాకు వ్యతిరేకంగా జపాన్‌ను కూడా అమెరికా అదే విధంగా ముందుకు నెడుతోంది.

ఈ పూర్వరంగంలో యుద్ధోన్మాదులను నిలువరించేందుకు జర్మనీ తన విదేశాంగ విధానానికి నూతన వ్యూహం అవసరం. ముగ్గురు జర్మన్ పార్లమెంటు సభ్యుల పేర్లు ప్రస్తావించి వారు అమెరికా కార్పొరేట్లు, ఆయుధడీలర్లు, అమెరికాయుద్ధ యంత్రాంగ సేవలో ఉన్నారా అని ప్రశ్నించారు. అదే గనుక నిజమైతే అది వినాశనానికి దారితీస్తుందని వామపక్ష నేత హెచ్చరించారు. ఒకసారి గనుక జర్మనీ టాంకులను అందచేస్తే అది మరిన్ని అస్త్రాల అందచేతకు తలుపులు తెరిచినట్లు అవుతుంది, ఇప్పటికే కొందరు ఫైటర్ జెట్ల గురించి చెబుతున్నారు, తరువాత క్షిపణులు, అవి పనిచేయకపోతే చివరికి మన సైనికులను పంపుతారని అన్నారు. పరిపరి విధాలుగా వెలువడుతున్న ఈ అంశాలు మరింత స్పష్టం కావాల్సి ఉంది. మొత్తం మీద జరుగుతున్న పరిణామాలు ప్రపంచ శాంతికి, ప్రజలకు ముప్పుతెచ్చేవిగా ఉన్నట్లు చెప్పవచ్చు.



మీడియా స్వేచ్ఛకు భంగం

దేశంలో 2014 నుంచి మీడియా క్రమంగా స్వేచ్ఛను కోల్పోతున్నది. ప్రమాదంలో పడుతున్నది. కార్పొరేట్ సంస్థలు ,పెట్టుబడి మీడియాపై పట్టు సాధిస్తున్నాయి. ఆయా సంస్థల్లో పనిచేసే జర్నలిస్టులు, ఉద్యోగులు, సిబ్బంది యాజమాన్యం ఆదేశించినట్టుగా వార్తలు, సమాచారం. సర్వే రిపోర్టులు పంపాల్సి వస్తున్నది. ప్రజానుకూల వార్తలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. వ్యతిరేక వార్తలకు కాలం చెల్లుతున్నది. ప్రజలకు చేరనీయడం లేదు. కొన్ని పెట్టుబడిదారీ గుత్త సంస్థలే ప్రింట్ మీడియాపై ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మీడియాలో పని చేస్తున్న జర్నలిస్టుల స్వేచ్ఛకు తీవ్ర భంగం కలుగుతున్నది. నాలుగు నెలల క్రితం పత్రికా స్వేచ్ఛపై 'రిపోర్టర్స్ వితౌట్ బార్డర్స్' అనే సంస్థ 180 దేశాల్లో సర్వే నిర్వహించింది. అందులో భారతదేశం 142వ ర్యాంకులో ఉండటం గమనార్హం.


బి. బసవపున్నయ్య

దేశంలో మొట్ట మొదటి పత్రిక 1818 మే 23న గవర్నర్ జనరల్ లార్డ్‌హెస్టింగ్స్ ఆధ్వర్యంలో వచ్చింది. ఇంగ్లీషు, బెంగాలిలో ప్రచురణలు ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు భారతదేశంలో పత్రికా వ్యవస్థ బాగా విస్తరించిందనే చెప్పొచ్చు. దేశ వ్యాప్తంగా 2023 జనవరి 16 నాటికి 1,05,443 పత్రికలు ప్రింట్ అవుతున్నాయి. ఇందులో యూపీ 16,000, మహారాష్ట్ర 14,000 పత్రికల ముద్రణతో మొదటి , రెండో స్థానాలలో ఉన్నాయి. హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, మరాఠిలలో ఎక్కువ పత్రికలు పబ్లిష్ అవుతున్నాయి. పత్రికలపై వ్యయం రూ.1500 బిలియన్లకు చేరుకుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పత్రికలు భారీగా పెరిగాయి. ఎలక్ట్రానిక్ మీడియా వచ్చిన తరువాత ప్రింటింగ్ మీడియాలో చిన్న పత్రికల ఉనికి ప్రశ్నార్థకమైంది. దాన్ని కరోనా మరింత దెబ్బతీసింది. దీనికితోడు ఆన్‌లైన్, ఈ-పేపర్ రావడంతో ప్రింటింగ్ మరింత తగ్గింది. అదే సమయంలో జర్నలిస్టులు, సిబ్బంది స్వేచ్ఛపై నియంత్రణలు పెరిగాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ),1950 ద్వారా పత్రికా స్వేచ్ఛ కల్పించబడింది. ప్రతి సంవత్సరం మే మూడున పత్రికా దినోత్సవం సైతం జరుపుతున్నారు. దేశంలో జరుగుతున్న హింసాకాండను, ప్రభుత్వాల దుష్పరిపాలనను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత మీడియాపై ఉంది. కానీ ఆ బాధ్యత నిర్వహణలో అనేక మంది జర్నలిస్టులు, ఉద్యోగులు, ప్రాణాలను సైతం కోల్పోతున్నారు.

రక్షణ చట్టాలు

వర్కింగ్ జర్నలిస్టులు, ఉద్యోగుల -45/1955 యాక్ట్ వచ్చింది. ఆ తరువాత వర్కింగ్ జర్నలిస్టులకు వేతనాలు నిర్ణయించడానికి 1958లో మరో చట్టం కూడా తెచ్చారు. ఆ తరువాత రాష్ట్రాలలో ప్రెస్ కౌన్సిళ్లనూ ఏర్పాటు చేసి ఉద్యోగులకు, సిబ్బందికి తగిన రక్షణలు కల్పించడానికి ప్రభుత్వాలు చట్టాలు రూపొందించాయి. యాడ్స్, బ్రాడ్‌కాస్ట్, కంటెంట్ సెన్సార్‌షిప్ , కాపీరైట్, కార్పొరేట్ చట్టం, ప్రైవసీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంటర్‌నెట్ తదితర సమాచారాన్ని సేకరించడానికి తగిన స్వేచ్ఛను కల్పించడం జరిగింది. అయినా ఈ చట్టాలు అమలు కాకపోవడంతో మీడియాలో పనిచేసే సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. భౌతిక దాడులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఇందుకోసం సమాచార, పౌరసంబంధాల శాఖ పర్యవేక్షణలో నియమించాల్సిన దాడుల నిరోధక కమిటీలను ఏ ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదు.

నిర్బంధాలు

కర్నాటకలో 2015 ఆగస్టు 30న ఎంఎం కాల్బుర్గి, సెప్టెంబరు ఐదు, 2017న గౌరి లంకేష్ హత్యలకు గురయ్యారు. దేశవ్యాప్తంగా ఈ హత్యలపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. వీరితోపాటు 2015 నుంచి 2021 వరకు దాదాపు 22 మంది జర్నలిస్టులను చంపేశారు. దీనికితోడు కొందరిపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి జైళ్ళలో పెట్టింది. కొన్ని మీడియా సంస్థలకు రాజకీయ పార్టీల నేతృత్వం ఉండడం వల్ల వారి అభీష్టానానికి భిన్నంగా రాసినప్పుడు నిర్బంధాలు మరిన్ని పెరుగుతున్నాయి. ఈ మధ్య ఎన్‌డీటీవీని ప్రముఖ కార్పొరేట్ సంస్థ ఆదాని గ్రూపు కొనుగోలుచేసి అంతకు ముందు నుంచి పని చేస్తున్న వారిని తొలగించడం జరిగింది. ఎడిటర్, రిపోర్టర్, కరస్పాండెంట్, ఫొటోగ్రాఫర్‌గా పనిచేసే వారికి స్వేచ్ఛ ఉండాలి. కొన్ని వార్తలను అసైన్ చేస్తున్న సందర్భంలో సమాచార సేకరణలో కూడా అది కచ్చితంగా అవసరం. యుద్ధాలు జరిగినప్పుడే యుద్ధ రంగంలో వార్తలు సేకరించడానికి అనుమతులు ఇచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ప్రభుత్వాలు మీడియా, కానీ నేడు అందులోని జర్నలిస్టులపై నిర్బంధానికి పాల్పడటం మూలానా వాస్తవాలు ప్రజలకు తెలిసే అవకాశం ఉండటం లేదు. 2021లో 488 మంది జైలుకు వెళ్ళగా, 46 మంది హత్యలకు గురయ్యారు. గత 20 సంవత్సరాలలో అనగా 2003 నుంచి 2022 వరకు 1668 మంది హత్యచేయబడ్డారు. అక్రిడిటేషన్ ఉన్నప్పటికి కూడా కొన్ని సందర్భాలలో సభలు, సమావేశాలకు అనుమతులు ఇవ్వకపోవడం , గదుల్లో పెట్టి తాళాలు వేస్తుండటం అన్యాయం. ఇది పౌర స్వేచ్ఛకు, పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమే.

ప్రెస్ కౌన్సిల్ ఏర్పాటు

1966లో పార్లమెంట్ చట్టం ద్వారా పత్రికా స్వేచ్ఛతోపాటు జర్నలిస్టుల స్థాయిని పెంచడానికి ప్రెస్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం గెజిట్ ద్వారా కౌన్సిల్‌ను నియామకం చేస్తుంది. 1978లో ప్రెస్‌కౌన్సిల్ చట్టంలో స్వేచ్ఛకు ప్రాధాన్యత ఇస్తూ నిబంధనలు రూపొందించారు. ప్రెస్ కౌన్సిల్ అటానమస్ (స్వతంత్ర) సంస్థ. కానీ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ ప్రెస్ కౌన్సిల్‌పై కూడా ఆధిపత్యం చెలాయిస్తోంది. నేడు ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియాతోపాటు ఫిల్మ్‌లు, శిక్షణా సంస్థలు, మీడియా ఆఫెక్ట్స్ అథారిటీలు కూడా పనిచేస్తున్నాయి. ఇవన్నీ కేంద్రమంత్రిత్వశాఖ నేతృత్వంలోనే పని చేస్తాయి. కాబట్టి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసిన వారిని దేశద్రోహ చట్టంకింద జైళ్ళలో పెట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇటీవల అవి మరింతగా చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్రాల్లో ప్రెస్ అకాడమీలది కూడా దాదాపు ఇదే పరిస్థితి. జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పడం- విలువలు పెంచడం ప్రధాన ఉద్దేశ్యంగా ఏర్పడిన ఈ సంస్థలన్నీ ఏలినవారి బాకాలుగా మార్చే ప్రయత్నాలను ప్రతిఘటించాలి.

సెల్:9490099108

అమెరికా ఏకధ్రువ ప్రపంచానికి ఎదురవుతున్న సవాళ్లు

అంతర్జాతీయంగా అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అమెరికా ప్రపంచ ఆధిపత్యాన్ని మోస్తున్న భూగర్భ పలకలు కదిలి, తిరిగి పడుతున్నాయి. అమెరికా ఆధిపత్యానికి భిన్నమైన క్రమానికి ప్రపంచం తరలిపోతుంది. అమెరికా ప్రపంచ ఆధిపత్యాన్ని నేటికీ మోస్తున్న ప్రధాన శక్తులు ఇక నిన్ను మోయలేమని మొరాయిస్తున్నాయి.

ఖతార్ ఫిఫా ప్రపంచ ఫుడ్‌బాల్ కప్ పోటీలలో మానవాలి మునిగి ఉగ్రూతలూగుతున్న సమయంలో, అమెరికా ఆధిపత్యాన్ని ఎనిమిది దశాబ్దాలు మోసిన ప్రధాన మధ్యఆసియా భూగర్భ పలకైన సౌదీఅరేబీయా చైనా నేతృత్వ ప్రపంచ క్రమానికి కదిలిపోయింది. సౌదీఆరేబియా ఒపెక్ వాస్తవ నాయకత్వ దేశం. ప్రపంచంలో అతిపెద్ద ఇందన ఉత్పత్తిదేశం. అమెరికా ఆధిపత్యాన్ని మోస్తున్న మరో ఐరోపా ఖండంలోని భూగర్భపలక జర్మనీ. ఐరోపా యూనియన్‌కు కీలక ఇంజన్. ఐరోపాలో జర్మనీ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. ఇది ప్రపంచ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. నిజానికి ఉక్రెయిన్ రష్యా యుద్ధం ఉక్రెయిన్ తరపున అమెరికా నాటో కూటమి చేస్తున్న యుద్ధం. జర్మనీ నాటో కూటమిలో ప్రధాన దేశం. ఈ యుద్ధం జరుగుతున్న క్రమంలోనే జర్మనీ అధ్యక్షుడు ఓలఫ్ షోల్జ్ ఆదేశ బడా కార్పొరేట్ బృందంతో చైనాలో పర్యటించారు. ఈ పర్యటన అమెరికా నాటో కూటమిలో చిచ్చురేపింది. అదీ ఉక్రెయిన్ యుద్ధ సమయంలో, రష్యాతో ప్రపంచంలోనే అత్యంత బలమైన వ్యూహాత్మక బంధంవున్న చైనాలో పర్యటించడం ప్రాధాన్య అంశం. చైనా అధ్యక్షుడు గ్జి జిన్‌పింగ్‌తో షోల్జ్ రోజంతా తీరికలేకుండా చర్చించారు. అమెరికాకు భిన్నంగా "ఒకే చైనా విధానాన్ని జర్మనీ సమర్థించింది."

ఇక సుదీర్ఘకాలం అమెరికాతో అంటకాగిన దేశం ఆస్ట్రేలియా. నేడు ఇండోనేషియా బాళీ జి-20 శిఖరాగ్ర సమావేశంలో చైనా వైపు కదిలిపోయింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్ ద్వైపాక్షిక సమావేశం జరిగింది. నేడు అమెరికాకు విరుద్ధంగా "ఒకేచైనా విధానంపై యతద స్థితిని ప్రకటించింది." ఆల్బనీస్ పూర్తిగా దెబ్బతిన్న చైనా ఆస్ట్రేలియా సంబంధాలను నిర్మాణాత్మకంగా వేగంగా పునరుద్ధరిస్తాం అని ప్రకటించారు. అమెరికా దుశ్చర్యలకు మద్దతుదారుగా, అనేక దశాబ్దాలుగా దానితో అంటకాగుతూ సొంత ప్రజలపై అనేక అకృత్యాలకు పాల్పడింది పిలిప్పీన్. ఆ దేశ అధ్యక్షుడు మార్కోస్ మొట్టమొదటి విదేశీ పర్యటన చైనాలో కొత్త ఏడాదిలో సాగుతుంది. హైక్వాలిటీ బెల్ట్ అండ్ రోడ్(బిఆర్ఐ)లో అనేక ప్రాజెక్టులపై పిలిప్పీన్ చైనా ఒప్పందాలు చేసుకుంటోంది. ఇరువురి వాణిజ్యం 38.35బి.డాలర్లు. గత అమెరికా సుదీర్ఘ దుర్నీతికి భిన్నంగా పిలిప్పీన్ చైనాలు వైరుధ్యాలు మాని, ఇక అన్నింటిలో సహకారానికి పెద్దపీట వేస్తున్నాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయల్ మాక్రాన్ 2023 మొదట్లోనే చైనాలో పర్యటించనున్నట్లు, బ్రిటిష్ పత్రిక గార్డియన్ ప్రకటించింది. ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించడం కోసం చైనా మధ్యవర్తిత్వ పాత్ర నిర్వహించాలని మాక్రాన్ పేర్కొన్నట్లు గార్డియన్ నివేదించింది. మూడవ పార్టీ(అమెరికా)జోక్యం లేకుండా ద్వైపాక్షిక, చైనా-ఐరోపా యూనియన్ సంబంధాలను మరింత ధృడత్వం చేసుకోనున్నట్లు ప్రకటించింది.

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు సౌదీఅరెబియా రాజు, కుమారుడైన వాస్తవ రాజు ఎం.బి.ఎస్ ఘశ్రీ స్వాగతం పలికారు. దీనికి కొద్ది నెలల క్రితం ఒపెక్ సమావేశంలో సౌదీఅరెబియా రోజుకు రెండు మిలియన్ బారళ్ల క్రూడ్ ఆయిల్ ఉత్పత్తిని తగ్గించింది. ఉక్రెయిన్ యుద్ధక్రమంలో పశ్చిమ దేశాలు, రష్యాపై విధించిన తీవ్ర ఆంక్షలు, 300 బిలియన్ డాలర్ల స్తంభనకు ప్రతిచర్యగా రష్యా యూరోప్‌కు గ్యాస్ సరఫరా పూర్తిగా నిలిపివేసింది. సౌదీఅరెబియా రష్యాల చర్యలతో అప్పటికే మండుతున్న ఇందన ధరలు ఆకాశానికి ఎగిసాయి. కోవిడ్ కష్టాలతో ప్రపంచం బొప్పికట్టివుంది. మానవాళి ఆహార సరఫరాలో ఉక్రెయిన్ కూడా ఒక ముఖ్య దేశం. ఆయుద్ధం ఆహార సరఫరాను విచ్ఛిన్నం చేసింది. ప్రపంచం ఆహార ధరలు అంటుకున్నాయి. ఇలా ప్రపంచ ఆహార ఇంధన ధరల మంటలతో, అమెరికా అధిపత్య ప్రపంచం మాకొద్దని, నాటోనుంచి వైదొలగాలని, రష్యాతో సంబంధాలు పునరుద్ధరించాలని యూరప్ ఖండంలోని ప్రతిదేశంలో లక్షలాది ప్రజలు వీధుల్లోకొచ్చారు. ఐరోపాలో అమెరికాను మోస్తున్న పాలకుల పీఠాలు కదిలిపోతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు బైడెన్ సౌదిఅరెబియాలో



పర్యటించారు. జీసిసి శిఖరాగ్ర సమావేశాల్లో తగ్గించిన ఇంధన ఉత్పత్తి పెంచమని వేడుకుంటే సౌదీ మొండిచేయి చూపించింది. ప్రపంచ అధిపతిగా వెలుగొందుతున్న అమెరికాకు నిన్నటి వరకు మోసిన దేశంలోనే పెద్ద పరాభవం జరిగింది. దీనికి పూర్తి భిన్నంగా చైనా అధ్యక్షుడికి అంబరాన్నంటే అట్టహాసంతో సౌదీ స్వాగతం పలికింది. ఈ అనూహ్య మార్పులు అమెరికా ఏకధ్రువ ప్రపంచాన్ని సవాల్ చేస్తున్నాయి.

మధ్య ఆసియా దేశాలన్నీ ఆధునిక పారిశ్రామిక చరిత్ర కాలమంతా ఇంగ్లాండ్ తర్వాత అమెరికాలతో అంటకాగాయి. అరబ్ శిఖరాగ్రాలపై ఆధిపత్యమంతా వీరిదే. కానీ ఇప్పుడు తొట్టతొలి చైనా అరబ్, జి.సి.సి. శిఖరాగ్ర సమావేశాలకు హాజరైన మొట్ట మొదటి చైనా అధ్యక్షుడుగా జిన్‌పింగ్ చరిత్ర సృష్టించాడు.

ఇంధనం, ఆర్థికం పెట్టుబడులు, ఆధునికత, నూతన సాంకేతికత, ఏరోస్పేస్, భాష సంస్కృతులైన ఐదు అంశాలపై పరస్పరం సహకరించు కోవాలని ఈ శిఖరాగ్ర సమావేశాలలో జిన్‌పింగ్ ప్రతిపాదించారు. అభివృద్ధి సుసంపన్నతతో పాటు ప్రాంతీయ అంతర్జాతీయ "అత్యంత కీలక అంశాలపై" చైనా అరబ్ సమాజం ఐక్యంగా సమ్మతితో పనిచేయాలని నిర్ణయించాయి. చైనా ప్రజా రిపబ్లిక్ ఏర్పడ్డ తర్వాత ఇది అతిపెద్ద దౌత్య సంఘటనా, అనూహ్యమైన అభివృద్ధి. అత్యున్నత దౌత్య మర్యాదలతో జిన్‌పింగ్ సుడిగాలి లాంటి అనేక ద్వైపాక్షిక సమావేశాలు ఈ బహుళధృవ శిఖరాగ్రంను అనుసరించే జరిగాయి. అరబ్ జీసిసి ఆర్థికవాణిజ్య లావాదేవీలన్నీ ఇక అమెరికా డాలర్‌లో కాకుడా, చైనా మారకద్రవ్యం రెన్‌మిన్‌బి(ఆర్.ఎం.బి)లో జరపాలని నిర్ణయం. చైనా-అరబ్ సంబంధాలలో ఇది ఒక యుగ పరివర్తనకు గీటురాయని అరబ్ పత్రికలు వర్ణించాయి. ఈ పరిణామాలను అమెరికా అత్యంత ఆందోళనాకరంగా పరిశీలించింది. అమెరికా ఏకధ్రువ ప్రపంచం క్రింది మధ్యప్రాచ్య భూగర్భపలక తలక్రిందులై మరో క్రమానికి మారుతుందంటున్నారు విశ్లేషకులు. అరబ్ చైనా శిఖరాగ్ర సమావేశ సంభాషణ దాని చరిత్రలో అత్యంత కీలకమైనది. 12 అరబ్ దేశాలు వేర్వేరుగా చైనాతో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాలు చేసు కున్నాయి. 20 అరబ్ దేశాలు చైనాతో బెల్ట్ అండ్ రోడ్ సహకారంపై సంతకాలు చేసాయి. 17 అరబ్ దేశాలు గ్లోబల్ డెవలపింగ్ ఇన్సియేటివ్ (జిడిఐ)కు మద్దతిస్తున్నాయి. 15 అరబ్ దేశాలు ఆసియా మౌలిక సదుపాయాల పెట్టుబడి బ్యాంకు(ఏఐఐబి)కు మద్దతివ్వగా, 14 దేశాలు చైనా లిగ్యూ ఆఫ్ అరబ్ స్టేట్స్ కోపరేషన్

అభివృద్ధి సుసంపన్నతతో పాటు ప్రాంతీయ అంతర్జాతీయ "అత్యంత కీలక అంశాలపై" చైనా అరబ్ సమాజం ఐక్యంగా సమ్మతితో పనిచేయాలని నిర్ణయించాయి. అరబ్ జిసిసి ఆర్థికవాణిజ్య లావాదేవీలన్నీ ఇక అమెరికా డాలర్‌లో కాకుడా, చైనా మారకద్రవ్యం రెన్‌మిన్‌బి(ఆర్.ఎం.బి)లో జరపాలని నిర్ణయం. చైనా-అరబ్ సంబంధాలలో ఇది ఒక యుగ పరివర్తనకు గీటురాయని అరబ్ పత్రికలు వర్ణించాయి. ఈ పరిణామాలను అమెరికా అత్యంత ఆందోళనాకరంగా పరిశీలించింది. అమెరికా ఏకధృవ ప్రపంచం క్రింది మధ్యప్రాచ్య భూగర్భపలక తలక్రిందులై మరో క్రమానికి మారుతుందంటున్నారు విశ్లేషకులు.

ఇన్సియేటివ్ ఆన్ డాటా సెక్యూరిటీలో పాల్గొననున్నాయి. 2021లో జీసిసి ఇరువైపుల వాణిజ్యం 230 బిలియన్ డాలర్లకు చేరగా, జీసిసి నుండి చైనా 200 మిలియన్ టన్నుల క్రూడాయిల్ దిగుమతి చేసుకుంది. హైటెక్ రంగాలైన 5-జి, న్యూఎనర్జీ, స్పేస్, డిజిటల్ ఎకానమీలపై సహకరించుకోవాలని నిర్ణయించాయి. చైనా-అరబ్ క్లీన్ ఎనర్జీ సెంటర్, చైనా అరబ్ గ్లోబల్ నావిగేషన్ సిస్టమ్, చైనా-ఈజిప్ట్ రిన్యూబుల్ ఎనర్జీ లాబోరేటరీ, చైనా అరబ్ శాటిలైట్ సాంకేతిక కేంద్రం ట్యూనిషియాలో నెలకొల్పుతున్నారు. సౌదీ చైనా హువాయితో క్లౌడ్ కంప్యూటింగ్ హైటెక్ బిల్డింగ్ కాంప్లెక్స్‌కై ఎంవోయు చేసుకున్నాయి. ఈఏడు జరిగే చైనా బిఆర్ఐ ప్రపంచ వేదిక నిర్వహణలో అరబ్ దేశాలు సహకరించాలని నిర్ణయం. అరబ్ సమస్యలపై చైనా విధానం విజయవంతమైందని ఈజిప్ట్ ప్రభుత్వ పత్రిక పేర్కొంది. ఆఫ్రికా ఖండంలో నాలుగు దశాబ్దాలుగా చైనా అనేక బహుళ ప్రజోపయోగ ప్రాజెక్టులతో చెరగని ముద్రవేసింది. చైనా లాటిన్ అమెరికాలో అనేక ప్రాజెక్టులు నిర్మిస్తోంది. ఉన్న వామక్ష ప్రభుత్వాలకు దన్నుగా బ్రెజిల్‌లో లూలా విజయం గొప్ప ప్రేరణ. ఇలా ప్రాంతీయ అంతర్గత అంతర్జాతీయ భూభౌగోళిక రాజకీయ మార్పులు శరవేగంతో జరుగుతున్నాయి. ఇవన్నీ అమెరికా ప్రపంచ క్రమానికి కాలం మూడుతుందనే హెచ్చరిక కాదా?

- సైనాల గోవర్ధన్

అత్యంత ప్రతిష్టాత్మకమైన టోర్నమెంట్‌లలో ఒకటి కాబట్టి ప్రతి ఒక్కరూ పోటీపడి గెలవడానికి చాలా కష్టపడి శిక్షణ పొందుతారు. ప్రతి క్షణం ఇక్కడ భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే ఆటగాళ్ళు భిన్నంగా ఉంటారు. ప్రతి ఒక్కరూ దాని కోసం శిక్షణ పొందారు. ఏ ప్రత్యర్థిని తేలికగా తీసుకోలేము, మన అత్యుత్తమ ప్రదర్శన చూపాల్సిందే.

బాధ్యత కలిగిన వ్యక్తులుగా...



అతి వేగంగా కాలం మారిపోతోంది. సామాన్య జీవితాలు సైతం వేగం పుంజుకుంటున్నాయి. ఆధునిక జీవనశైలి, సరికొత్త వ్యవహార శైలి, సెల్ ఫోన్లు, లాప్టాప్‌లు, ఐపాడ్లు వగైరాలతో పిల్లలు ప్రాపంచిక విజ్ఞానంలో ముందుకు దూసుకుపోతున్నారు. ఇటువంటి సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లల పెంపకం తీరును మార్చాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అయితే పిల్లలను చదువులోనే కాక, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. ఆధునిక విజ్ఞానంతో పాటు సంస్కారాన్ని కూడా నేర్పడం వల్ల వారిని తమకు, తమ కుటుంబానికే కాక సమాజానికి కూడా ఉపయోగపడగల బాధ్యత కలిగిన వ్యక్తులుగా మార్చడానికి వీలుంటుంది. మానసిక నిపుణుల ప్రకారం ఇందుకు కొన్ని మార్గదర్శక సూత్రాలను తప్పనిసరిగా అనుసరించాల్సి ఉంటుంది. వారి పెంపకం మీద మరింతగా దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుంది. చదువులతోపాటు పిల్లలకు సంస్కారాన్ని నేర్పడానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి.

- పిల్లల కోసం రోజులో కొంత సమయాన్ని కేటాయించడం, ఇందుకు ప్రత్యేకంగా ప్లాన్ వేసుకోవడం సాధ్యం కాని విషయం. ఇటువంటివి సహజంగా జరిగి పోవాల్సి ఉంటుంది. అందువల్ల ఇంట్లో లేదా కుటుంబాల్లో ఏది చేసినా అందరూ కలిసే చేయటం వల్ల ఆశించిన ప్రయోజనం కలుగుతుంది. టీవీ చూడటం దగ్గర నుంచి రాత్రి నిద్రపోయే వరకు కుటుంబం అంతా కలిసికట్టుగా ఉండటం చాలా అవసరం. కబుర్లు చెప్పుకున్నా, భోజనం చేసినా, సినిమాకు పోయినా, బంధువుల ఇంటికో, స్నేహితుల ఇంటికో వెళ్లినా అంతా కలిసే చేయటం వల్ల పిల్లలలో ఒక విధమైన సామాజిక స్పృహ ఏర్పడుతుంది. సామాజిక పరిస్థితుల పట్ల వారికి అవగాహన ఏర్పడటానికి అవకాశం కలుగుతుంది.
- ఇతరుల గురించి చెడుగా మాట్లాడటం పిల్లల ముందు చేయకపోవడం మంచిది. వారిలో అందరి పట్ల సమభావం పెరగటానికి ఇది అవరోధంగా మారుతుంది. ముఖ్యంగా మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించడం వల్ల పిల్లలలో మహిళల విషయంలో సద్భావం ఏర్పడుతుంది. ఏ విషయం అయినా వారికి ప్రత్యేకంగా చెబుతున్నట్టు కాకుండా సందర్భ వశాత్తు చెబుతున్నట్టుగా చెప్పాలి. తరచూ సూక్తులు, హితోక్తులు చెప్పడం వల్ల వారిలో వాటి పట్ల ఆసక్తి పెరుగుతుంది. చిన్న వయసు నుంచే వారిలో వారు బడుగు వర్గాల పట్ల ఔదార్యంతో, ఆదర భావంతో వ్యవహరించే వీలుంటుంది. వారిలో ఒకపక్క పోటీ తత్వాన్ని పెంచుతూనే ఇతరుల పట్ల సానుభూతితో, సహనంతో వ్యవహరించడం నేర్పాలి.
- ఇంట్లో ఏవైనా శుభకార్యాలు జరిగిన కుటుంబం యావత్తు అందులో పాల్గొనేలా చూడాలి. వాటి అర్థాన్ని, ప్రయోజనాన్ని వారికి కొద్దికొద్దిగా తెలియజేస్తూ ఉండాలి. ఇంట్లో ఏ కార్యక్రమం తలపెట్టినా అందులో అందరి పాత్ర ఉండే విధంగా వ్యవహరించాలి. ఎవరికైనా సహాయం చేస్తున్నప్పుడు అది తప్పనిసరిగా పిల్లల దృష్టిలో పడేలా చేయడం మంచిది. సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నా, చివరికి పక్కింటి వారికి సహాయం చేస్తున్నా దాన్ని పిల్లలకు తెలిసేలా చేయాలి.
- వారి సమక్షంలో వాదించుకోవడం, దుర్భాషలాడటం వంటివి చేయడం మంచిది కాదు. అటువంటివి చేయడం వల్ల వారిలో ఆత్మ న్యూనతా భావం పెరుగుతుంది.

మన దేశ స్క్వాష్ ఛాంపియన్ అనాహత్ సింగ్ 2022లో జరిగిన ఈవెంట్‌లో విజయాన్ని సాధించింది. అండర్ 15 బ్రిటిష్ జూనియర్ ఓపెన్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకోవడంతో ఆమె అసాధారణ ప్రదర్శన ఈ సంవత్సరం కూడా కొనసాగుతోంది. ఈ టైటిల్‌ను రెండుసార్లు గెలుచుకుంది. జోష్నా చిన్నప్ప తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారతీయురాలు ఈమెనే.



అత్యంత చిన్నవయసులోనే...



బ్రిటీష్ జూనియర్ ఓపెన్ యునైటెడ్ కింగ్‌డమ్‌లో ప్రతి ఏటా జనవరిలో జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ ఆటగాళ్ళు ప్రతిష్టాత్మకమైన ఈ టైటిల్ కోసం పోటీపడతారు. క్వార్టర్స్‌లో మన దేశానికి చెందిన 14 ఏండ్ల అనాహత్ 3-0తో మలేషియాకు చెందిన హర్లీన్ టాన్‌పై విజయం సాధించింది. ఆమె తన ఈజిప్టు ప్రత్యర్థి మలక్ సమీర్‌ను 3-0తో ఓడించి ఫైనల్స్‌కు చేరుకుంది. ఫైనల్స్‌లో మొదటి సెట్ దగ్గరగా ఉన్నప్పటికీ అనాహత్ చివరికి ఈజిప్ట్‌కు చెందిన సొహైలా హజెమ్‌పై 3-1 స్కోరుతో విజయం సాధించింది.

జీవితం తొలి దశలో

20008 జనవరి 13న ఢిల్లీలో పుట్టింది అనాహత్. గత ఏడాది కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొన్న భారత బృందంలోని అతి పిన్న వయస్కురాలు అనాహత్. డిసెంబర్ 2022 నాటికి ఆమె బాలికల అండర్ 15 విభాగంలో ఆసియాలో అగ్రశ్రేణి క్రీడాకారిణి. అనాహత్ ఓ తన ఆరేండ్ల వయసులో బ్యాడ్మింటన్ ఆడటం ప్రారంభించింది. అప్పటికే స్క్వాష్ క్రీడాకారిడి అయిన తన అక్క అమీరాతో పాటు కలిసి ఆడుతుండేది. స్థానికంగా ఆమె కొన్ని స్క్వాష్ టోర్నమెంట్లలో ఆడింది, అక్కడ మంచి ప్రదర్శన ఇచ్చింది. తర్వాత కాలంలో ఆమె ఆటపై అభిమానాన్ని పెంచుకుంది. ఎనిమిదేండ్ల వయసులో స్క్వాష్‌కు మారింది.

పేరు ప్రఖ్యాతులు

2019 జనవరిలో జరిగిన బ్రిటీష్ జూనియర్ ఓపెన్ స్క్వాష్‌లో బాలికల అండర్ U11 టైటిల్‌ను గెలుచుకుంది. ఆ తర్వాత అదే సంవత్సరం జూలైలో డచ్ జూనియర్ ఓపెన్ స్క్వాష్‌లో బాలికల U13 టైటిల్‌ను గెలుచుకున్న ఆమె అత్యంత పేరు ప్రఖ్యాతులను సంపాదించుకుంది. 2021, సెప్టెంబర్ 4-7 సమయంలో జరిగిన HCL SRFI ఇండియన్ టూర్ - నోయిడాలో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోవడం ద్వారా ఆమె 2021-22 PSA వరల్డ్ టూర్‌లో కూడా భాగమైంది.

ప్రత్యేక శిక్షణ లేదు




ఈ ఏడాది జనవరిలో మలేషియాకు చెందిన హర్లీన్ టాన్‌పై విజయం సాధించిన ఆమె ఓ వెబ్ పత్రికతో చేసిన ప్రత్యేకమైన చాట్‌లో కష్టపడి సాధించిన విజయం గురించి మాట్లాడుతూ "నేను బ్రిటిష్ జూనియర్ ఓపెన్ కోసం ప్రత్యేక శిక్షణ తీసుకోలేదు. నవంబర్ ప్రారంభంలో కొరియాలో ఆసియా సీనియర్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లు, డిసెంబరులో చెన్నైలో సీనియర్ నేషనల్స్‌తో సహా అనేక ముఖ్యమైన టోర్నమెంట్‌లు గత సంవత్సరం నిర్వహించబడ్డాయి. నేను వాటి కోసం శిక్షణ పొందాను. అదే నన్ను స్కాటిష్ జూనియర్, బ్రిటిష్ జూనియర్ స్థాయిలకు తీసుకువెళ్లింది.

ప్రతి క్షణం భిన్నమే

ఈ యువ ఛాంపియన్ గతంలో బ్రిటీష్ జూనియర్ ఓపెన్ (BJO) టైటిల్ కోసం కొన్ని సంవత్సరాల కిందట పోటీపడి గెలిచింది. "నేను రెండుసార్లు (BJO) ఫైనల్స్‌కు చేరుకున్నాను, 2019లో గెలిచాను. కాబట్టి పోటీ గురించి బాగా తెలుసు. ఇది జూనియర్ సర్క్యూట్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన టోర్నమెంట్‌లలో ఒకటి కాబట్టి ప్రతి ఒక్కరూ పోటీపడి గెలవడానికి చాలా కష్టపడి శిక్షణ పొందుతారు. ప్రతి క్షణం ఇక్కడ భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే ఆటగాళ్ళు భిన్నంగా ఉంటారు. ప్రతి ఒక్కరూ దాని కోసం శిక్షణ పొందారు. ఏ ప్రత్యర్థిని తేలికగా తీసుకోలేము, మన అత్యుత్తమ ప్రదర్శన చూపాల్సిందే" అంటుంది. తఅనాహత్ ఇప్పుడు తను రాబోయే టోర్నమెంట్‌ల గురించి ఉత్సాహంగా ఉంది. ఆమెకు లైనప్‌లో చాలా మంది ఉన్నారు. "నేను ఎదురు చూస్తున్న తదుపరి టోర్నమెంట్ ఆసియా జూనియర్ టీమ్ ఛాంపియన్‌షిప్. ఇది 2023 ఫిబ్రవరి 8 నుండి 12 వరకు చెన్నైలో జరుగుతుంది" అని ఆమె తన మాటలు ముగించింది.

బరువు తగ్గాలంటే ఏం తినాలి..?

నాజూకైన శరీరం ఉండాలని అందరికీ ఉంటుంది. కానీ నేటి యువతలో చాలా మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. అయితే ఊబకాయానికి, అధిక బరువుకు అనేక కారణాలు ఉంటాయి. థైరాయిడ్, జన్యుపరంగా వచ్చే లోపాలు ఊబకాయానికి కారణాలు కావచ్చు. ఊబకాయం నుంచి బయటపడి నాజూకుగా ఉండాలంటే మొదటిగా చేయాల్సింది ఫుడ్ కంట్రోల్. టైమ్‌తో సంబంధం లేకుండా ఏదిపడితే అది, ఎక్కడపడితే అక్కడ తినడం ఆరోగ్యానికి ప్రమాదం. బయట తయారు చేసే ఆహారాలలో అధిక శాతం కల్తీవే ఉంటున్నాయి. సన్నగా ఉన్నవారు కూడా ఉన్నట్టుండి తమకే తెలియకుండా లావయ్యేందుకు ఇవే కారణమవుతున్నాయి. ఇక అధిక బరువును తగ్గించుకునేందుకు ప్రయత్నించే వారిలో చాలా అనుమానాలుంటాయి. ఆహార మార్పుల్లో ఎలాంటివి తినాలి..? ఎలాంటివి తినకూడదు..? అన్నది పెద్దప్రశ్న అయితే మరి కొందరు ఒకపూట భోజనం తినకుండా ఉంటే బరువు తగ్గుతామనే అపోహలో ఉంటారు. ఇలా రకరకాల ప్రశ్నలు, అపోహలు, ఆలోచనలు మెదడులో మెదులుతుంటాయి. మరి బరువు తగ్గాలనుకునేవారు ఎటువంటి ఆహారాలను తినాలో ఇప్పుడు తెలుసుకుందాం..



- కూరగాయ ముక్కలను పచ్చిగా తినేకంటే.. దోరగా వేయించి తినడం ఎంతో మేలు. వేయించడం వల్ల వాటిలో తక్కువ క్యాలరీలు ఉండటంతో పాటు కొద్దిగా తిన్నా కడుపు నిండిన భావన ఉంటుంది. అలాగే ఉడికించిన కూరగాయలను తినడం ద్వారా కూడా వెయిట్ లాస్ అవ్వొచ్చు.
- చాలా మందికి బ్రేక్ ఫాస్ట్ సమయంలో ఏంతినాలన్న ప్రశ్న వస్తుంది. ఆ సమయంలో టిఫిన్లు వద్దనుకుంటే మొలకెత్తిన విత్తనాలు తినడం, రాగి జావ తాగడం మంచిది. టిఫినే చేయాలనుకునేవారు మూడు ఇడ్లీ లేదా రెండు దోసెలు టమాటా చట్నీతో తీసుకోవడం మంచిది. అవి కూడా ఇంట్లో చేసినవే తీసుకోవాలి.
- బ్రేక్ ఫాస్ట్‌కి లంచ్‌కి మధ్యలో ఏదైనా జ్యూస్ తీసుకోవచ్చు. కేలరీలు తక్కువగా ఉండే జ్యూస్ తాగడం ఉత్తమం. పుచ్చకాయ, బత్తాయి జ్యూస్‌లు లేదా కొబ్బరి నీరు తాగడం వల్ల ఒంటిలో ఉండే నీరు బయటికి పోతుంది. అలాగే ఒంటిలో వేడిని కూడా తగ్గిస్తాయి. జ్యూస్‌లు తాగే వీలులేని వారు నిమ్మకాయ నీరు తాగవచ్చు.
- లంచ్‌లో రైస్ ఎంత తీసుకుంటామో కూర కూడా అంతే మోతాదులో తీసుకోవాలి. అన్నం ఎక్కువ, కూర తక్కువగా తినడం వల్లే చాలామందికి ఊబకాయం పెరుగుతుంది. ఆకుకూరలు ఎక్కువగా తినాలి. వారానికి కనీసం మూడుసార్లైనా ఆకుకూరలు పుష్కలంగా తింటే మంచిది.
- ఐరన్ తగ్గినా కూడా శరీరం బరువు పెరగడం, అధికంగా చెమట పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాంటి వారు నల్లబెల్లంతో చేసిన పల్లీల పట్టి లేదా జీడిపప్పు పట్టీ సాయంత్రం సమయంలో తినడం మంచిది. నల్లబెల్లంతో చేసిన సగ్గుబియ్యం కూడా తాగవచ్చు. నల్లబెల్లం వంటకాలు తినడం వల్ల శరీరంలో ఐరన్ పెరిగి ఉత్సాహంగా ఉంటారు.

ప్రయివేటు సంస్థలు ప్రజలను ఆదుకోవు

ప్రభుత్వరంగంలోనే విద్యావైద్యం ఉండాలి

- రాజకీయ ప్రయోజనాల ఆధారంగానే బడ్జెట్ కేటాయింపులు
- ప్రాజెక్టులు, డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించాలి
- సొంత జాగా ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.8 లక్షలివ్వాలి
- కౌలు రైతులకూ రైతుబంధు వర్తింపచేయాలి
- గురుకులాలతో అందరికీ నాణ్యమైన విద్య అందదు
- చట్టసభల పనిదినాలు కుదించడం సబబు కాదు
- ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయకుంటే ప్రత్యక్ష కార్యాచరణ
- నవతెలంగాణతో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ములాఖాత్



ఆపద వచ్చినపుడు ప్రయివేటు సంస్థలు ప్రజలను ఆదుకోబోవని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి చెప్పారు. విద్యావైద్యం ప్రభుత్వ రంగంలోనే ఉండాలని డిమాండ్ చేశారు. అప్పుడే అందరికీ నాణ్యమైన, సమానమైన విద్యతోపాటు వైద్య సేవలు అందుతాయని చెప్పారు. రానున్న బడ్జెట్‌లో విద్యావైద్య రంగానికి అధిక ప్రాధాన్యత నివ్వాలని డిమాండ్ చేశారు. విద్యకు 24 శాతం, వైద్యరంగానికి 12 శాతం నిధులు కేటాయించాలని కోరారు. ఈనెల మూడో తేదీ నుంచి అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతున్న సందర్భంగా నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు...

విద్యావైద్య రంగాలకు అధిక నిధులు కేటాయించాలంటూ సంతకాల సేకరణ చేస్తున్నారు. స్పందన ఎలా ఉంది...?

అధ్యాపకులు, విద్యార్థులు పెద్దఎత్తున స్వాగతం పలుకుతున్నారు. ఉత్సాహంగా పాల్గొని సంతకాలు చేస్తున్నారు. మంచి స్పందన వస్తున్నది. విద్యావైద్య రంగాలకు ప్రభుత్వం నామమాత్రంగా నిధులు కేటాయిస్తున్నది. నిధులు పెంచాలంటూ ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వరంగంలో విద్యావైద్యం ఉంటేనే అందరికీ నాణ్యమైన, సమానమైన వసతులు అందుతాయి. కరోనా లాక్‌డౌన్ సమయంలో ప్రయివేటు ఆస్పత్రులు మూతపడ్డాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రజలకు వైద్య సేవలందాయి. ఆశా వర్కర్ నుంచి సూపర్ స్పెషాలిటీ డాక్టర్ల వరకు ప్రాణాలకు తెగించి కరోనా కట్టడి కోసం కృషి చేశారు. ఈ సమయంలో ఏ ఒక్క కార్పొరేట్, ప్రయివేటు ఆస్పత్రి ప్రజలకు వైద్య సేవలు అందించలేదు. భరోసా కల్పించేందుకు ముందుకు రాలేదు. కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులు అధిక బిల్లులు వేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశాయి. చనిపోయిన వారి శవాలను కూడా డబ్బులు కట్టనిదే ఇవ్వలేదు. కరోనా సమయంలో ప్రయివేటు విద్యాసంస్థలు ఆన్‌లైన్ చదువుల పేరుతో పూర్తి ఫీజులు వసూలు చేశాయి. బస్సు ఛార్జీలను కూడా కట్టాలని కోరాయి. ఆపద వచ్చినపుడు ప్రయివేటు సంస్థలు ప్రజలను ఆదుకోవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి విద్యావైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలంటూ కోరేందుకే తెలంగాణ పౌర స్పందన వేదిక (టీపీఎస్వీ)ను ఏర్పాటు చేశాం.

రాష్ట్ర ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్. ఇప్పటి వరకు కేటాయింపుల తీరుతెన్నులపై ఏమంటారు?

ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లు ప్రజల తాత్కాలిక అంశాలను తీర్చేందుకే ఉపయోగపడ్డాయి ఏ బడ్జెట్‌లోనైనా రాజకీయ ప్రయోజనం పొందాలనే లక్ష్యం కనిపించింది. సాగునీటి ప్రాజెక్టులకు అధిక నిధులు కేటాయించింది. దాని వల్ల కొంత ప్రయోజనం చేకూరింది. నీళ్లు వచ్చాయి. కానీ శ్రీశైలం సొరంగ మార్గం పనులు పూర్తి చేసి ఉంటే నల్లగొండ జిల్లాలో సాగునీరందించడానికి అవకాశముండేది. డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయలేదు. ఇప్పటికైనా సమీక్షించి ఆ ప్రాజెక్టుల పనులను పూర్తి చేయాలి. రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించింది. అందులో 35 వేల ఇండ్లను పూర్తి చేసింది. ఇంకా 65 వేల ఇండ్లను పేదలకు పంపిణీ చేయాలి. నా నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లు కనిపిస్తున్నాయి. వాటిని పూర్తి చేసి అర్హులైన వారికి ఇవ్వాలి. సొంత జాగా ఉన్న వారి ఇంటి నిర్మాణం కోసం రూ.ఎనిమిది లక్షలు చెల్లించాలి. కౌలు రైతులకూ రైతుబంధు పథకాన్ని వర్తింపచేయాలి. సేద్యం చేయని భూమికి రైతుబంధు ఇవ్వడం సరైంది కాదు. కలెక్టర్ పిల్లలు, బంట్రోతు కొడుకు ఒకే బడిలో చదివే విధానం తీసుకొస్తామంటూ 2014, జులై 26న సీఎం కేసీఆర్ ప్రకటించారు. అప్పుడు సంతోషపడ్డాను. ఆచరణలో వచ్చేసరికి కులాలవారీగా గురుకులాలు ఏర్పాటు చేశారు. వాటిలో 4.50 లక్షల మందికే నాణ్యమైన విద్య అందుతున్నది. ఒకటి నుంచి పదో తరగతి వరకు 60 లక్షల మంది విద్యార్థులున్నారు. అందువల్ల ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, గిరిజన ఆశ్రమ పాఠశాలలను అభివృద్ధి చేయాలి. బడ్జెట్‌లో విద్యకు అధికంగా నిధులు కేటాయించాలి.

విద్యావైద్యం, ఉపాధి, మౌలిక వసతుల కల్పనకు నిధుల కేటాయింపు, వాటి ఖర్చు ఎలా ఉందంటారు?

విద్యావైద్య రంగాలకు కేటాయింపులు, ఖర్చుకు దగ్గరి సంబంధం ఉంటుంది. 90 శాతం వరకు ఖర్చవుతుంది. ఎందుకంటే ఆయా రంగాలకు కేటాయింపుల్లో ఎక్కువ శాతం జీతభత్యాలు, పెన్షన్లు ఇవ్వడానికే కేటాయిస్తారు. అందుకే బడ్జెట్‌లో విద్యకు 24 శాతం, వైద్యరంగానికి 12 శాతం నిధులు కేటాయించాలి. వైద్యరంగంలో పీహెచ్‌సీలను మెరుగుపర్చాలి. పట్టణీకరణ, నగరీకరణ పెరుగుతున్న నేపథ్యంలో యూపీహెచ్‌సీలను ఏర్పాటు చేయాలి. కానీ ప్రభుత్వం బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాలను అందుబాటులోకి తెస్తున్నది. అవి ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకే పనిచేస్తున్నాయి. ఇన్‌పేషెంట్ (ఐపీ)కి అవకాశం లేదు. పీహెచ్‌సీలు కూడా 24 గంటలు పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. జనాభాకనుగుణంగా యూపీహెచ్‌సీలను పెంచాలి. బీసీ కార్పొరేషన్, ఎంబీసీ కార్పొరేషన్, మైనార్టీ సంక్షేమ సంస్థలకు బడ్జెట్ కేటాయింపులు ఉంటున్నాయి. కానీ నిధులు విడుదల కావడం లేదు. ఇది సరైన విధానం కాదు. సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధులన్నీ ఖర్చు చేయాలి.

శాసనమండలి సమావేశాల తీరుతెన్నులు ఎలా ఉన్నాయి. సభ్యులు అడిగే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానాలు చెప్తున్నదా?

సభా నిర్వహణ సమయం తగ్గుతున్నది. రోజులు కుదించబడుతున్నాయి. మొదటి దశలో ఏడాదికి 90 రోజులు సభ జరిగేదని రికార్డుల్లో ఉన్నది. పదేండ్ల కింద 50 నుంచి 60 రోజులు సభ జరిగేది. నేను ఎన్నికైన నాలుగేండ్ల నుంచి పనిదినాలు ఏడాదికి 15 నుంచి 20 రోజులే ఉంటున్నాయి. గతేడాది సెప్టెంబర్‌లో మూడు రోజులే సమావేశాలను నిర్వహించారు. ప్రజా సమస్యలను ప్రస్తావించే ప్రశ్నోత్తరాలు, ప్రత్యేక ప్రస్తావనలను తొలగించారు. సభ నిర్వహణ సమయం, పనిదినాలు పెరగాలి. సభ్యుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రజాసమస్యలను ప్రస్తావించే సమయాన్ని కేటాయించాలి. ప్రభుత్వానికి ఇబ్బంది లేకుంటే సంతృప్తికరమైన సమాధానం ఇస్తుంది. రాజకీయంగా ఇబ్బంది ఉంటే దాటవేత ధోరణిని అవలంభిస్తుంది. ద్రవ్య వినిమయ బిల్లు ప్రవేశపెట్టినపుడు సభ్యులకు మాట్లాడే అవకాశాన్ని కల్పించడం లేదు. ఇది సరైంది కాదు.

ఆర్థిక సర్వే, కాగ్ నివేదికలు ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపుతున్నాయి. వాటిపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఎలా ఉందంటారు?

వాస్తవంగా కాగ్ నివేదిక, ఆర్థిక సర్వే, ఆడిట్ నివేదికలను టేబుల్ పేపర్లుగా మాకు అందిస్తారు. రెండేండ్ల క్రితం నుంచి వెచ్చించిన ఖర్చుల వివరాలు అందులో ఉంటాయి. తప్పనిసరి అయిన వాటిని మాత్రమే ఆడిట్ అభ్యంతరాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు కనిపిస్తుంది. మిగతా వాటిని దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నది.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. కానీ ఉపాధ్యాయ ఖాళీల భర్తీ గురించి ఎలాంటి ప్రకటన లేదు. దీనిపై ఏమంటారు?

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని అనేక సందర్భాల్లో ప్రభుత్వం దృష్టికి తెచ్చాను. నల్లగొండ నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్రను చేపట్టాను. ఇప్పుడు బదిలీలు, పదోన్నతులు చేపడుతున్నందుకు సంతృప్తిగా ఉన్నది. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తికాగానే ఉపాధ్యాయ ఖాళీల వివరాలను తేల్చి నియామకాల కోసం ప్రకటన చేస్తారని భావిస్తున్నాం. ఆలస్యమయ్యే పరిస్థితి ఉంటే తప్పనిసరిగా ఉపాధ్యాయ నియామకాల కోసం ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకుంటాను. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగానే ఉపాధ్యాయుల నియామకం సరైంది కాదు. దాని వల్ల ప్రాథమిక పాఠశాలలు ఉనికిని కోల్పోయే ప్రమాదముంది. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక గది, తరగతికి ఒక టీచర్ ఉండేలా నియామకాలు చేపట్టాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలి.

సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సర్కారు బడుల్లో 'మన ఊరు-మన బడి' పథకం కింద సకల సౌకర్యాలు కల్పించనున్నట్టు సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.7,289 కోట్లతో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 12 రకాల మౌలిక వసతులను సమకూర్చాయని పేర్కొన్నారు. మన ఊరు-మనబడి పథకంలో భాగంగా మొదటి విడతలో పనులు పూర్తయిన పాఠశాలలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. బుధవారం సిరిసిల్ల నియోజకవర్గంలోని గంభీరావుపేటలో పాఠశాలను మంత్రులు కేటీ రామారావు, పి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభిస్తారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు కల్పించేందుకే ఈ పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. పాఠశాలల్లో భవనాలకు మరమ్మతులు చేపట్టడం, రంగులు వేయడం, కాంపౌండ్ వాల్స్ నిర్మించడం, విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం ఫర్నీచర్ అమర్చడం, డిజిటల్ తరగతులు, సోలార్ ప్యానళ్లు, అధునాతన వసతుల పాఠశాలలుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నదని తెలిపారు. బడి పిల్లల భవితకు బంగారు బాటలు నిర్మించేందుకు విద్యా శాఖ చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలంటూ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు, విద్యాశాఖ ఉన్నతాధికారులకు మార్గనిర్దేశనం చేశారని వివరించారు. 'మన ఊరు-మన బడి' పథకం కింద పాఠశాలల్లో పరిశుభ్రమైన తాగునీరు, టాయిలెట్ల నిర్మాణం, అదనపు తరగతి గదులు, మంచి లైటింగ్ సదుపాయం, భోజన వసతి ఏర్పాట్లు, గ్రీన్ బోర్డులు, డిజిటల్ తరగతులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలనీ, పనులు సత్వరం పూర్తి చేయాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. విద్యారంగం బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని తెలిపారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సర్కారు స్కూళ్లను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎప్పటికప్పుడు రోజు వారీ సమీక్షలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పనులు పూర్తయిన పాఠశాలలను స్థానిక ప్రజా ప్రతినిధులు బుధవారం నుంచి ప్రారంభోత్సవాలు చేస్తారని వివరించారు.

నేడు కేంద్ర బడ్జెట్

- లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ : నేడు (బుధవారం) పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తొలుత లోక్‌సభలో బడ్జెట్‌ను సమర్పిస్తారు. అనంతరం రాజ్యసభలో టేబుల్ చేస్తారు. పన్ను చెల్లింపుదారులు, సామాన్యులు తమకు అనుకూలంగా ఏం ఉంటుంది? తమపై భారాన్ని పెంచే వార్తలు ఏం రాబోతున్నాయి? అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చివరి పూర్తి స్థాయి బడ్జెట్ ఇదే కావడంతో అందరికీ తాయిలాలు అందుతాయని చాలా మంది ఆశిస్తున్నారు.

అవినీతే అతి పెద్ద శత్రువు : ద్రౌపది ముర్ము

(మొదటిపేజీ తరువాయి)

దేశాన్ని పూర్వ వైభవం, ఆధునిక కాలపు సువర్ణాధ్యాయాల అనుసంధానంతో నిర్మించాలని ఆకాంక్షించారు. నేడు ప్రతి భారత పౌరుడు ఆత్మ విశ్వాసం అత్యున్నత స్థాయిలో ఉందన్నారు. నేడు ప్రపంచం మనల్ని చూస్తున్న తీరు అద్భుతమని తెలిపారు. గతంలో మనం ప్రపంచంపై ఆధారపడే వారమనీ, ఇప్పుడు ప్రపంచమే మనపై ఆధారపడు తోందని చెప్పారు. ప్రపంచ సమస్యలకు పరిష్కారం చూపగలుగుతున్నామని చెప్పారు. పేదరికంలేని దేశాన్ని నిర్మించాలన్నారు. మధ్య తరగతి ప్రజలు కూడా సంపన్నులు కావాలన్నారు. సమాజానికి, దేశానికి దిశా నిర్దేశం చేయడానికి యువత, నారీశక్తి ముందు వరుసలో ఉండాలని తెలిపారు. కాలానికి రెండు అడుగులు ముందు నిలిచే యువత గల దేశంగా భారత దేశం ఎదగాలన్నారు.

అవినీతిపై నిరంతర పోరాటం

ప్రజాస్వామ్యానికి, సాంఘిక న్యాయానికి అతి పెద్ద శత్రువు అవినీతి అని తన ప్రభుత్వానికి స్పష్టమైన అభిప్రాయం ఉందన్నారు. అందుకే గత కొన్నేండ్ల నుంచి అవినీతిపై నిరంతర పోరాటం జరుగుతోందన్నారు. అదే సమయంలో నిజాయితీపరులకు గౌరవం దక్కే విధంగా జాగ్రత్తలు తీసుకున్నట్టు తెలిపారు. ఆర్థిక నేరాలకు పాల్పడి, పరారయ్యే నేరగాళ్ళ ఆస్తులను జప్తు చేసేందుకు ఫ్యూజిటివ్ ఎకనమిక్ అఫెండర్స్ యాక్ట్‌ను తన ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. తన ప్రభుత్వంలో జవాబుదారీతనం పెరిగిందని తెలిపారు. అవినీతి రహిత దేశంగా మారే దిశగా భారత్ పయనిస్తోందన్నారు. పన్ను చెల్లింపుదారులు తాము చెల్లించిన పన్ను రిఫండ్ కోసం గతంలో సుదీర్ఘ సమయం ఎదురు చూడవలసి వచ్చేదని తెలిపారు. నేడు ఐటీఆర్ ను దాఖలు చేసిన కొద్ది రోజుల్లోనే రిఫండ్ పొందగలుగుతున్నారన్నారు. నేడు పారదర్శకతతోపాటు జీఎస్‌టి ద్వారా పన్ను చెల్లింపుదారుల గౌరవ, మర్యాదలకు భరోసా లభిస్తోందని తెలిపారు.

శాశ్వత సంస్కరణలు

ఒకే దేశం-ఒకే రేషన్ కార్డ్, జన్ ధన్-ఆధార్-మొబైల్ నంబర్ల అనుసంధానం వల్ల నకిలీ లబ్దిదారులను తొలగించగలిగినట్టు తెలిపారు. అతి పెద్ద శాశ్వత సంస్కరణను అమలు చేశామని చెప్పారు. కొన్నేండ్ల నుంచి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్, డిజిటల్ ఇండియాతో శాశ్వత, పారదర్శక వ్యవస్థను సిద్ధం చేసిందన్నారు.

నిర్ణయాత్మక ప్రభుత్వం వల్ల కలిగే ఫలితాలు

ప్రపంచంలో రాజకీయ అస్థిరత ఎక్కడ ఉన్నా, ఆ దేశాలు పెద్ద ఎత్తున సంక్షోభంలో చిక్కుకుంటాయని ద్రౌపది ముర్ము తెలిపారు. తన ప్రభుత్వం దేశ ప్రయోజనాల దృష్ట్యా తీసుకున్న నిర్ణయాల వల్ల దేశం ఇతర దేశాలతో పోల్చినపుడు మెరుగైన స్థితిలో ఉందని తెలిపారు.

పేదలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం: ఎమ్మెల్యే మంచిరెడ్డి

నవతెలంగాణ-తుర్కయాంజల్



పేదలకు బీఆరెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని మునగనూర్ గ్రామం 15వ వార్డులో నివాసం ఉంటున్న వెంకటేష్ తండ్రి బాబుకు రూ.1.25 లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నక్క ప్రవంతిరమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ నక్క రాధిక శ్రీనివాస్ గౌడ్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వేముల అమరేందర్ రెడ్డి, 15వ వార్డు పార్టీ అధ్యక్షుడు దోమలపల్లి శివకుమార్, వెంకటేష్, శ్రీరామ్‌రెడ్డి, యాదగిరి గౌడ్, నవీన్, డి.ప్రవీణ్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'అనాథ పిల్లలను ఆదుకోవడంలో సర్కారు విఫలం'

నవతెలంగాణ-బోడుప్పల్



తెలంగాణ రాష్ట్రంలోని అనాథ పిల్లలను అందుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో వైఫల్యం అయ్యిందని కూతాడి నరసింహ్మా అన్నారు. ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అధ్వర్యంలో సోమవారం ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన అనాథల సమర భేరి సభకు మద్దతు తెలిపిన కూతాడి నరసింహ్మా మాట్లాడుతూ అనాథ పిల్లలకు రావాల్సిన హక్కులను కాలరాసేలా కేసీఆర్ సర్కారు పనిచేస్తుందని విమర్శించారు. మంద కృష్ణమాదిగ చేపట్టే కార్యక్రమానికి పూర్తిస్థాయిలో మద్దతు ఉంటుందని తెలిపారు.

'అవిశ్వాసం' వార్తల్లో వాస్తవం లేదు

- మూడేండ్లలో తిరుగులేని అభివృద్ధి సాధించాం
- మరింత అభివృద్ధికి ప్రణాళికతో ముందుకు సాగుతాం
- బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, మేయర్ సామల బుచ్చిరెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్

గడిచిన మూడేండ్ల కాలంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి తమ పార్టీ పాలకవర్గ సభ్యులు ఎనలేని కృషి చేశారని భవిష్యత్తులోనూ మరింత ఉత్సాహంగా ప్రజలకు సేవ చేసేందుకు కృషి చేస్తారని బీఆర్ఎస్ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పాటై మూడేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవిగౌడ్, బీఆర్ఎస్ కార్పొరేటర్లలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఈ మూడేండ్ల పాలనలో చేసిన అభివృద్ధిపై సమీక్షించుకొని భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తామని సంజీవరెడ్డి తెలిపారు. అవిశ్వాసం వార్తల్లో వాస్తవం లేదు. బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశముందనే ఊహాగానాలు పూర్తిగా అవాస్తవాలని మంద సంజీవరెడ్డి తెలిపారు. తమ పార్టీకి చెందిన మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు అందరూ సయోధ్యతో ఉన్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ స్పష్టమైన మెజారిటీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరని ఆయన తెలిపారు.

ఈ మూడేండ్ల పాలనలో అనేక విషయాల్లో సంతృప్తిగా ఉన్నామని భవిష్యత్తులోనూ బృహత్తర ప్రణాళికలతో ముందుకు సాగుతామని మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. మూడేండ్ల కాలంలో రూ.206.13 కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. త్వరలోనే బోడుప్పల్ అంబేద్కర్ సర్కిల్ నుండి చిలుక నగర్ రోడ్డును, వీరారెడ్డి నగర్ నుండి మల్లాపూర్ రోడ్డు వెడల్పు పనులు, బోడుప్పల్ బంగారు మైసమ్మ దేవాలయం నుండి చెంగిచెర్ల మార్గాన్ని విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు.

అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందించడంలో పాలక వర్గం పూర్తి స్థాయిలో పనిచేసిందని మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవిగౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణా, సహకార బ్యాంకు డైరెక్టర్ జడిగే రమేష్ యాదవ్, కార్పొరేటర్లు బింగి జంగయ్య యాదవ్, కొత్త చందర్‌గౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, కాటపల్లి లత రాంచంద్రారెడ్డి, సీసా వెంకటేష్ గౌడ్, మోదుగు లావణ్య శేఖర్‌రెడ్డి, కొత్త శ్రీ విద్యా చక్రపాణి గౌడ్, దానగళ్ల అనిత యాదగిరి, పులకండ్ల హేమలత జంగారెడ్డి, భూక్య సుమన్ నాయక్, దొంతబోయిన మహేశ్వరి కృప సాగర్, రాసాల వెంకటేష్ యాదవ్, గుర్రాల రమా వెంకటేష్ యాదవ్, జక్కల పద్మా రాములు, బందారపు అంజలి శ్రీధర్ గౌడ్, చీరాల నరసింహ్మా తదితరులు పాల్గొన్నారు.



పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాసంఘాల డిమాండ్



నవతెలంగాణ-హయత్ నగర్

పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కీసరి నర్సిరెడ్డి అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిలుగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భోపాల్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్, కేవీపీఎస్ నాయకులు సామేలు, వృత్తిదారుల సంఘ రాష్ట్ర నాయకులు పగడాల యాదయ్యలు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుండి కార్మికులు బతుకుదెరువు కోసం వచ్చి కడు భారంగా ఇక్కడ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వారికి ఇక్కడ బతకడమే కష్టంగా మారిందన్నారు. పేదలందరికీ ఇండ్లు కట్టిస్తామని, ఇండ్లు నిర్మించుకునే వారికి ఐదు లక్షలు ఇస్తామని గొప్పలు చెప్పి, నేడు ఇల్లు లేని పేదల బాధలను పట్టించుకోవడం లేదన్నారు. హైదరాబాదులో సుమారుగా 10 లక్షల కుటుంబాలు అద్దె ఇంట్లో ఉంటూ కాలమెల్లదీస్తున్నాయన్నారు. పేదలందరికీ ఇండ్లు స్థలాలు ఇండ్లు ఇవ్వాలని, లేనిచో ప్రభుత్వ భూములు ఆక్రమించుకొని ఇండ్లు కట్టుకుంటామని హెచ్చరించారు. నేడు రాష్ట్రంలో పెద్దోళ్లకు ప్రభుత్వ భూములను అప్పనంగా అప్పజెప్తున్నారని, పెద్దలు అపార్ట్మెంట్లు కట్టుకొని పెద్ద ఎత్తున స్థలాన్ని ఆక్రమించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. పేదలు 60 గజాల భూమి కోసం పోరాడుతుంటే వారిపై తప్పుడు కేసులు పెట్టి జైలుపాలు చేస్తున్నారన్నారు. రియల్ ఎస్టేట్ వారు భూములు ఆక్రమించుకొని యథేచ్ఛగా విక్రయిస్తుంటే పట్టించుకున్న పాపాన పోవట్లేదని, పేదవాళ్లు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్నా పీకేసి, వారిపై కేసులు పెట్టి చిత్ర హింసలు పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.మనోహర్, భీమనపల్లి కనకయ్య, దుర్గారావు, ఆలేటి ఎల్లయ్య, సీఐటీయూ నాయకులు మల్లెపాక వీరయ్య, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు సిహెచ్ వెంకన్న, వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేష్, రంగారెడ్డి జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శి సి మల్లేష్, రంగారెడ్డి జిల్లా గిరిజన సంఘం ఉపాధ్యక్షులు ఎం.గోపి నాయక్, పాల్గొన్నారు.

కుంట్లూరులో జరుగుతున్న స్థలాల పోరాటానికి సంపూర్ణ మద్దతు

తట్టి అన్నారం గ్రామంలో మహిళా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9న అర్హులైన ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాకు ప్రిపరేషన్ మీటింగ్ జరుగుతుండగా మూకుమ్మడిగా వందలాది మందితో ఎల్బీనగర్ డీసీపీ పరిధిలో ఉన్న పోలీసు బలగాలు, మీటింగును చుట్టుముట్టి, ప్రజలను భయభ్రాంతుల గురిచేసి అక్కడున్న సీపీఎం జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ్మా, తట్టి అన్నారం గ్రామ మాజీ ఎంపీటీసీ నల్ల ప్రభాకర్, బీఎస్పీ నాయకులు సుక్క రవికుమార్, గునుగంటి సౌజన్యలను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భోపాల్ అన్నారు. కనీసం మీటింగులు పెట్టుకొనే స్వేచ్ఛ లేకుండా, ప్రజా సమస్యల మీద మీటింగ్ పెట్టుకుంటే ఒక్కసారిగా పోలీసు బలగాలతో మీటింగ్‌ను ముట్టడి చేసి అరెస్టు చేయడం సరైనది కాదని నరసింహ, ప్రభాకర్ అన్నారు.



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

మేయర్ పారిజాత నర్సింహారెడ్డి ● బడంగ్‌పేట్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-బడంగ్ పేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడతామని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నార్సింహ్మారెడ్డి అన్నారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ అధ్యక్షులు పెద్దబావి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి బడంగ్‌పేట్ చౌరస్తాలో మేయర్ పారిజాత నార్సింహ్మారెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు చేపట్టిన భారత్ జోడో యాత్ర విజయవంతం కావటం హర్ష నియమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేస్తూ యాత్ర సాగిందన్నారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్లు వి.ప్రభాకర్‌రెడ్డి, మనోహర్ పి.సుదర్శన్‌రెడ్డి, బాలు నాయక్, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు జంగయ్య, గోవర్ధన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు అమృత నాయుడు తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ దళిత వ్యతిరేకి

- నా జీవితమంతా పోరాటమే
- పదవుల కోసం ఏనాడు బాధపడలే
- డిప్యూటీ మేయర్ ఇబ్రం శేఖర్



నవతెలంగాణ-బడంగ్ పేట్

దళిత వ్యతిరేక పార్టీ బీజేపీ అని, తన జీవితమంతా దళిత, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేయటం తప్ప పదవుల కోసం ఏనాడు బాధ పడలేదని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రం శేఖర్ అన్నారు. మంగళవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ కార్పొరేటర్లు మేయర్, డిప్యూటీ మేయర్లపై అవిశ్వాస తీర్మానం పెడతామని చెప్పటం అస్యాస్పదంగా ఉందన్నారు. డిప్యూటీ మేయర్ అధికారాలేంటోనన్న విషయం కూడా తెలుసుకోకుండా వారు మాట్లాడటం అర్థరహితమన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా, బీఎస్పీ నాయకుడిగా తనను మంత్రి సబితా ఇంద్రారెడ్డి గుర్తించి డిప్యూటీ మేయర్ పదవికి ఎంపిక చేశారన్నారు. తనను ఏనాడు బీజేపీ కార్పొరేటర్లు గౌరవించలేదని, సమస్యలను పరిష్కారం చేయాలని అడగలేదని, మేయర్‌తోనే లోపాయికారిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి ముఖ్యమా, రాజకీయం ముఖ్యమా తెలియక మాట్లాడుతున్నారని, అవిశ్వాసం పేరుతో, దళితుడిననే అవిశ్వాసం పేరుతో తనను భయపెడుతున్నారని ఆరోపించారు. ఇటీవల బీజేపీ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో దళిత కార్పొరేటర్ ఇంద్రసేనకు మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదన్నారు. తనకు వచ్చిన గౌరవ వేతనంతో ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలనే లక్ష్యంతో వాలంటీర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబురావు, నర్సింగ్‌రావు, బొర్ర రజినీకాంత్, శ్రీను, ఎల్లేష తదితరులు ఉన్నారు.

కృషి, పట్టుదలతోనే ఏదైనా సాధ్యం : చైర్మెన్ నందులాల్ నాయక్

నవ తెలంగాణ- సరూర్ నగర్



కృషి, పట్టుదలతోనే విజయాలు సాధించవచ్చని నందు ఆర్మీ అకాడమీలో చైర్మన్ నందు లాల్ నాయక్ అన్నారు. ఆర్మీ అకాడమీలో కోచింగ్ తీసుకొని ఇటీవల వెలువడిన ఫలితాలలో అగ్ని వీరులు ఉద్యోగాలు సాధించిన భానోత్‌కుమార్ హరీష్‌లను, ఎస్ఎస్‌సీ సీపీఓలో రమేష్, మధు సెలెక్ట్ కావడంతో మంగళవారం సరూర్నగర్‌లో వారిని సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఎస్సై, కానిస్టేబుల్ ఈవెంట్స్ ఫలితాల్లో అత్యుత్తమ రిజల్ట్స్ సాధించామన్నారు. గ్రూప్-డిలో ప్రతి ఒక్క విద్యార్థి క్వాలిఫై అయ్యారని, నందు ఆర్మీలో ప్రాక్టీస్ చేసిన ప్రతి ఒక్క విద్యార్థి ఏదో ఒక జాబ్ కొడతానని నమ్మకంతో ఇక్కడ విద్యార్థుల్ని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. సెలెక్ట్ అయినవారు దేశానికి సేవ చేసే మంచి అవకాశంగా భావించాలన్నారు. ఏపీ ఎస్సై, కానిస్టేబుల్ విద్యార్థులకు ప్రత్యేక బ్యాచ్ స్టార్ట్ చేశామన్నారు.

పట్టుదలతో ఉద్యోగం సాధించాలి

ఎల్బీనగర్ ఏసీపీ శ్రీధర్ రెడ్డి

నవ తెలంగాణ -సరూర్ నగర్



ప్రస్తుత పోటీని నమ్మర్ధవంతంగా ఎదుర్కొని ఉద్యోగాలు సాధించాలని ఎల్బీనగర్ ఏసీపీ శ్రీధర్ రెడ్డి అన్నారు. మంగళవారం నరూర్నగర్‌లో కాంపిటీషన్ ఎగ్జామ్స్ ప్రిపేర్ అయ్యే విద్యార్థుల కోసం వీఎంఆర్ లాజిక్స్ వారు రూపొందించిన రీజనింగ్ క్లాస్ నోట్స్, అర్థమెటిక్ క్లాస్ నోట్స్, న్యూ ఎడిషన్ బుక్స్‌ను ఏసీపీ ముఖ్యఅతిథిగా హాజరై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఈ మధ్యకాలంలోనే వేల ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ల విడుదల చేసిందన్నారు. ప్రతి విద్యార్థి సమయాన్ని వృథా చేసుకోకుండా పుస్తకంతో ఎక్కువగా గడపాలన్నారు. కొన్ని రోజులపాటు సెల్ ఫోన్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని, తద్వారా సమయాన్ని ఎక్కువగా చదువుకునేందుకు వినియోగించుకోవచ్చని అన్నారు. కృషి, పట్టుదల ఉంటే గమ్యాన్ని చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వీఎఫ్‌జీ చైర్మెన్ గౌరు శ్రీనివాస్, ఏఎస్‌పీ విజయ్‌కుమార్, వీఎఫ్‌జీ డైరెక్టర్ మనోహర్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ ఉప్పల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై సవతి తల్లి ప్రేమ తగదు

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్



నవతెలంగాణ-బోడుప్పల్

రాష్ట్రంలో విద్యా రంగానికి నిధులు కేటాయించడంలో సర్కారు సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. మంగళవారం ఉప్పల్ డిపో వద్ద గల సంఘం కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యారంగం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పిన కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతి బడ్జెట్లోనూ విద్యకు నిధులు తగ్గిస్తున్నారే తప్ప పెంచడం లేదన్నారు. మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, ఢిల్లీ రాష్ట్రాల్లో విద్యకు 25% నిధులు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం కనీసం సగం నిధులు కూడా కేటాయించడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లోనైనా 30%నిధులు కేటాయించి ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేయాలని పుట్ట లక్ష్మణ్ కోరారు. ఈ సమావేశంలో మేడ్చల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎండీ అన్వర్, హరీష్, రాము, గణేష్, సందీప్, శివ, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు పేదలకు జీవన వెలుగు :ముల్లి పావని

నవ తెలంగాణ-ఘట్కేసర్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కంటి వెలుగు పేదలకు జీవన వెలుగు లాంటిదని ఘట్కేసర్ మున్సిపల్ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగును 9వ రోజు ఆమె పరిశీలించరు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంధత్వంతో ఏ ఒకరూ బాధపడొద్దనే ఆలోచనతో ముఖ్యమంత్రి ఈగొప్ప కార్యక్రమం చేపట్టారని తెలిపారు. మొదటి విడుతలో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో 1.54లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించి 50లక్షల మందికి కళ్లద్దాలు అందజేసినట్లు తెలిపారు. రెండో విడుతలో జూన్ 30వ తేదీవరకు నిర్వహించే కంటి వెలుగు శిబిరాలలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు ఉచితంగా అందజేస్తారన్నారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగానే కంటి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బొక్క సంగీత ప్రభాకర్ రెడ్డి, చందుపట్ల వెంకట్‌రెడ్డి, బీసీ సెల్ జనరల్ సెక్రెటరీ దూసరి బాలరాజుగౌడ్, మాజీ ఎంపీటీసీ జంపాల రమేష్, 3వ వార్డు యువజన సంఘం అధ్యక్షుడు వకిటి ప్రవీణ్‌రెడ్డి, నాయకులు లింగస్వామి, జంగయ్య ముదిరాజ్, డాక్టర్ ఫనిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూయార్క్ సిటీ మేయర్‌తో హైదరాబాద్ మేయర్ భేటీ

నవతెలంగాణ-సిటీబ్యూరో



అమెరికా పర్యటనలో ఉన్న హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గుడ్‌విల్‌లో భాగంగా యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా న్యూయార్క్ సిటీ మేయర్ ఎరిక్ ఆడమ్స్‌తో మంగళవారం భేటీ అయ్యారు. జనవరి 30న జాతిపిత మహాత్మా గాంధీ 75వ వర్ధంతి సందర్భంగా న్యూయార్క్ సిటీ మేయర్ ఎరిక్ ఆడమ్స్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిలు న్యూయార్క్ సిటీ హాల్‌లో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా న్యూయార్క్ సిటీ మేయర్ ఎరిక్ ఆడమ్స్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరం పురాతన కాలం నుంచి నేటికీ ప్రసిద్ధి చెందడంపై హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరం రోజురోజుకు గ్లోబల్ సిటీగా రూపాంతరం చెందుతూ అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందుతుందన్నారు. అనంతరం హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ హైదరాబాద్ నగరం సిస్టర్ సిటీ రిలేషన్ షిప్ ద్వారా భౌతికంగా అభివృద్ధి చెందిన సిటీలతో పరస్పర సహకారం, బిజినెస్‌లో అవకాశాలను పెంపొందించేందుకు కృషి చేస్తుందన్నారు. ఇంతకుముందు కాలిఫోర్నియా సిటీ హైదరాబాద్ నగరంతో సిస్టర్ సిటీ రిలేషన్ షిప్ ఎంఓయూ ఒప్పందం చేసుకుని ఇరు నగరాలకు సంబంధించిన సంస్కృతి, అకాడమీ పరంగా, పరస్పర అవకాశాలపై సహాయం తీసుకుంటున్నట్టు తెలిపారు. న్యూయార్క్ నగర మేయర్ ఎరిక్ ఆడమ్స్ ఏప్రిల్ 30లోపు హైదరాబాద్‌కు విచ్చేసి నగరాన్ని వీక్షించాలని, అభివృద్ధి చెందిన ప్రదేశాలను, సిస్టర్ సిటీ రిలేషన్ షిప్‌లో భాగంగా చేసుకున్న ఎంఓయూ ప్రకారం టెక్నాలజీ, ఇతర పరస్పర మార్పిడి ఒప్పందం చేసుకోవాలని గద్వాల్ విజయలక్ష్మి న్యూయార్క్ మేయర్‌ను కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే



నవ తెలంగాణ-ఉప్పల్

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకెళ్తామని ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉప్పల్ డివిజన్ పరిధిలోని ఉప్పల్ హిల్స్ కురుమనగర్‌లో స్థానిక కార్పొరేటర్ మందమల్ల రజిత పరమేశ్వరుడితో కలిసి పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఉప్పల్ హిల్స్ కురుమ నగర్‌ను అగ్రగామిగా నిలుపుతామన్నారు. ఉప్పల్‌హిల్స్ కురుమ నగర్‌లో సీసీ రోడ్లతోపాటు కమ్యూనిటీ హాల్ డ్రయినేజీ వ్యవస్థను ఆదునీకరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. రాజకీయాలకు తావు లేకుండా అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ కుర్మానగర్ అధ్యక్షుడు అబ్బయ్య, మురళి నరసింహ గౌడ్ సోమయ్య, మంగ సుధాకర్, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం ఎక్కడ?

ఆల్ ఇండియా కాంగ్రెస్ నేత మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ -ఎల్బీనగర్



కొత్త పేట్‌లోని గడ్డి అన్నారం పండ్ల మార్కెట్‌ను తొలగించి తొమ్మిది మాసాలు గడుస్తున్నా ఇంతవరకు హాస్పిటల్ నిర్మాణం జరగలేదని ఆల్ ఇండియా కాంగ్రెస్ నాయకులు మహేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం దిల్‌సుఖ్ నగర్‌లోని గడ్డి అన్నారం పండ్ల మార్కెట్‌ను కాంగ్రెస్ నాయకులతో కలిసి అయన సందర్శించారు. ఈ సందర్భంగా మహేష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు నగరంలో మూడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మిస్తామని చెప్పారని ఆయన గుర్తు చేశారు. కానీ ఇంత వరకు ఎక్కడా హాస్పిటల్స్ నిర్మాణం మొదలు పెట్టలేదన్నారు. ముఖ్యమంత్రి సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లకు శంకుస్థాపన చేసి తొమ్మిది మాసాలు గడుస్తున్నా, హాస్పిటల్ నిర్మాణం కోసం తట్టెడు మట్టి తీసిన పాపాన పోలేదన్నారు.తొందరపడి పండ్ల మార్కెట్‌ను తరలించి వ్యాపారస్తులకు, రైతులకు తీవ్ర నష్టం కలిగించారని ఆయన అన్నారు. ఆగమేఘాల మీద మార్కెట్‌ను ఖాళీ చేశారని అయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 11వేల వైద్య సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయలేని పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర బడ్జెట్లో ఆరోగ్యం కోసం ఎనిమిది శాతం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కానీ నేడు 4.4 శాతం నిధులు మాత్రమే కేటాయిస్తుందని చెప్పారు. వెంటనే గడ్డి అన్నారంలో హాస్పిటల్ నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, టీపీసీసీ కార్యదర్శి నిరంజన్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్ల నరసింహారెడ్డి, ఎల్బీనగర్ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డి, జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సుజాత నర్సింహారెడ్డి, స్వర్ణ మాధవి, మధుసూదన్ రెడ్డి, గజ్జి భాస్కర్, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
7
మల్కాజిగిరి
బుధవారం 01 ఫిబ్రవరి 2023

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

నవతెలంగాణ-జవహర్‌నగర్

ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైంది. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కె. చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాప్రాల్ లోని ఎంప్లాయిస్ కాలనీలో సంతోష్‌కుమార్ కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. ఆయన 17 ఏండ్ల కుమార్తె ఆకాన్షా శ్రీవాత్సవ సైనిక్‌పురిలోని టాపర్స్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. మంగళవారం ఉదయం కళాశాలకు వెళ్లిన ఆమె ఇంత వరకు తిరిగి రాలేదు. ఆమె ఆచూకి కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. ఈ మేరకు కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌గా అమోయ్ కుమార్

- రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయిన ప్రస్తుత కలెక్టర్ హరీశ్



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నూతన కలెక్టర్‌గా డి.అమోయ్‌కుమార్ నియమితులయ్యారు. మంగళవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 15 మంది కలెక్టర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న అమోయ్ కుమార్‌ను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా విధులు నిర్వహించిన హరీశ్‌ను రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు.

జనన, మరణ విభాగం అస్తవ్యస్థం

- ఏడాది కాలంగా ఎస్ఓ పోస్టు ఖాళీ
- 8మంది ఏఎస్ఓలకు ఒక్కరే..
- పట్టించుకోని జీహెచ్ఎంసీ ఉన్నాతాధికారులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

భూమ్మీద పుట్టిన ప్రతి బిడ్డకూ జనన ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి. దానిని విధిగా నమోదు చేయడం ప్రభుత్వ బాధ్యత. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని(హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి) ప్రాంతాల్లో ఈ బాధ్యతను జీహెచ్ఎంసీ నిర్వహిస్తోంది. ఈ విభాగంలో సరిపోను సిబ్బందిలేకపోవడంతో అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా ఏడాది కాలంగా స్టాటిటికల్ ఆఫీసర్(ఎస్ఓ) పోస్టు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలూ లేకపోలేదు.

ఆన్‌లైన్ నమోదు అంతంత మాత్రమే

నగరంలో జనన మరణ గణాంకాలను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు గ్రేటర్ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రులన్నింటినీ జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌కు అనుసంధానం కల్పించాలని నిర్ణయించారు. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 1463 ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులు ఉండగా వీటిలో కేవలం 300 ఆస్పత్రులు మాత్రమే జీహెచ్ఎంసీ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌కు నేరుగా అనుసంధానమయ్యాయని అధికారులు చెబుతున్నారు. నగరంలోని అధిక శాతం ఆస్పత్రులు ఆన్‌లైన్‌లో చేరకపోవడంతో అక్కడ జరిగే జనన, మరణాలకు సంబంధించిన వివరాలు జీహెచ్ఎంసీ కార్యాలయాలకు చేరడంలో తీవ్ర జాప్యం కావడం, ఒక్కోసారి అసలు ఈ వివరాలు అందకపోవడంతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను పొందడంలో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో ఉన్న 30 జీహెచ్ఎంసీ సర్కిళ్లలో 63 జనన, మరణ రిజిస్ట్రేషన్ యూనిట్లు ఉన్నాయి. ఈ రిజిస్ట్రేషన్ యూనిట్లలో సిబ్బందిని పెంచడం, అన్ని ఆస్పత్రులను ఆన్‌లైన్‌లో చేర్పించడం ద్వారా మరింత వేగంగా బర్త్, డెత్ సర్టిఫికేట్లను జారీ చేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. కాని ఈ ప్రక్రియ నామ మాత్రంగానే ఉంది. ముఖ్యంగా ప్రయివేటు ఆస్పత్రులకు సంబంధించిన వివరాలు సకాలంలో అందడంలేదనే విమర్శలూ ఉన్నాయి.

పర్యవేక్షణ లోపం..నకిలీలకు ఊతం

జీహెచ్ఎంసీ పరిధిలో ప్రతీ సంవత్సరం సుమారుగా 1.85లక్షల జననాలు జరుగుతుండగా 45 వేల మరణాలు సంభవిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. గతంలో జీహెచ్ఎంసీకి చెందిన సిటిజన్ సర్వీస్ సెంటర్లలో జనన, మరణ ధ్రువపత్రాలు జారీచేయడంలో పాదర్శకతతోపాటు అధికారుల పర్యవేక్షణ ఉండేది. ఈ బాధ్యత మీ-సేవా కేంద్రాలకు అప్పగించినప్పటి నుంచి సర్టిఫికెట్ల కోసం విచ్చలవిడిగా వసూలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతుంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నకిలీ సర్టిఫకెట్ల దందా నడుస్తుందని, అందుకు అనేకసార్లు పోలీసులకు పట్టుబడడమే నిదర్శనం.

ఎస్ఓ పోస్టు ఖాళీ

జీహెచ్ఎంసీ జనన, మరణ ధ్రువపత్రాల జారీ విభాగంలో రెండు స్టాటిటికల్ ఆఫీసర్(ఎస్ఓ) పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతం ఒక్కరూ లేరు. ఏడాది కాలంగా ఎస్ఓ ఖాళీగా ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదు. 8మంది ఏఎస్ఓలకుగాను ఒక్కరు మాత్రమే ఉన్నారు. దీంతో రోజువారీగా వెరిఫికేషన్, సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుల పరిశీలన వంటి పనులు సకాలంలో పూర్తికావడంలేదనే ఆరోపణలు ఉన్నాయి.

కాలువ శుభ్రం చేస్తూ కార్మికుడు మృతి



నవతెలంగాణ-కంటోన్మెంట్

మురుగు కాల్వ శుభ్రం చేస్తూ మూర్ఛ వచ్చి ఓ కార్మికుడు మృతి చెందిన విషాద ఘటన హైదరాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లి చిన్న తోకట్ట బాట షోరూం వద్ద ఎల్లేష్(30) కాంట్రాక్టు కార్మికునిగా పనిచేస్తున్నాడు. మంగళవారం తోటి కార్మికులతో కలిసి అతను కాలువను శుభ్రం చేస్తున్నాడు. అయితే అతనికి ఆస్మికంగా మూర్ఛ రావడంతో గిలగిలా కొట్టుకుంటూ పడిపోయి మృతి చెందాడు. సమాచారం అందుకున్న బోయిన్‌పల్లి పోలీసులు, కంటోన్మెంట్ బోర్డ్ అధికా రులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలియజేశారు.

దళితబంధు ద్వారా జీవనోపాధి



- ఎమ్మెల్యే హన్మంతరావు
- లబ్దిదారులతో ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

దళితబంధు పథకం ద్వారా దళితులకు చక్కటి జీవనోపాధి లభిస్తోందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. నియోజకవర్గంలోని 100 మంది దళిత బంధు లబ్దిదారులతో మంగళవారం ఎమ్మెల్యే తన నివాసంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. లబ్దిదారుల ను ఆప్యాయంగా పలకరించి వారి వ్యాపారం ఎలా నడుస్తుంది.. వారి బాగోగులు తెలుసు కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా దళిత బంధు పథకాన్ని ప్రవేశ పెట్టారని, ఈ పథకంతో దళితుల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయన్నారు. దీనిని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం దళిత బంధు లబ్దిదారులందరూ ఎమ్మెల్యేను శాలువతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈడీ బాలాజీ, కార్పొరేటర్ జితేంద్ర నాథ్, నాయకులు రాము యాదవ్, మీడియా కన్వీనర్ గుండా నిరంజన్,ఉపేందర్ రెడ్డి,ఎస్ ఆర్ ప్రసాద్,సంతోష్ రాందాస్,మోహన్ రెడ్డి, ఉపేందర్,పార్థు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం



- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-బేగంపేట్

జీరా కాంపౌండ్‌లోని ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. మంగళవారం రాంగోపాల్ పేట డివిజన్‌లో పర్యటించి పలు అభివద్ధి పనులను ప్రారంభించారు. అలాగే కాలనీలో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా జీరా లోని వతన్ హెూటల్ వద్ద రూ. 12.89 లక్షల వ్యయంతో చేపట్టనున్న వీడీసీసీ రోడ్డు పనులను, జీరా ప్లే గ్రౌండ్ వద్ద రూ. 12.57 లక్షలతో చేపట్టనున్న వీడీసీసీ రోడ్డు, హైదర్ బస్తీలోని మహవీర్ కాంప్లెక్స్ వద్ద రూ. 27.83 లక్షల వ్యయంతో చేపట్టనున్న వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం పక్కనే ఉన్న పార్క్ లో అధికారులతో కలిసి మంత్రి పర్యటించి పార్క్‌లో వాకింగ్ ట్రాక్ నిర్మించాలని, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా మొక్కలను నాటడం వంటి పనులు చేపట్టి పూర్తిస్థాయిలో అభివద్ధి చేయాలన్నారు. కాలనీ ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పార్క్‌లోని శ్రీ రేణుక ఎల్లమ దేవాలయం పునర్నిర్మాణం, అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని ప్రకటించారు. శిధిలావస్థలో ఉన్న నిర్మాణాన్ని తొలగించి కమ్యునిటీ హాల్‌ను నిర్మించేందుకు ప్రతిపాదనలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జీరా కాంపౌండ్ లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. శిధిలావస్థలో ఉన్న టాయిలెట్స్‌ను పునర్నిర్మించాలని, రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరగా, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తమ స్థలాలను రెగ్యులరైజ్ చేయాలని కోరగా సమస్యను పరిష్కరిస్తామని, ప్రభుత్వం అవసరమైన చర్యలను చేపట్టిందని వివరించారు. ఈ స్థలాన్ని రెవెన్యు శాఖకు బదిలీ చేసేందుకు కొన్ని న్యాయపరమైన అవాంతరాలు, అడ్డంకులు ఉన్నాయని చెప్పారు. ఆ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం కషి చేస్తుందని, వీలైనంత త్వరలో సమస్యను పరిష్కరించేలా చూస్తామని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుచిత్ర, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, డీసీ ముకుంద రెడ్డి, ఈఈ సుదర్శన్, వాటర్ వర్క్స్ జీఎం రమణారెడ్డి, హార్టికల్చర్ అధికారి రాఘవేందర్, శానిటేషన్ డీఈ శ్రీనివాస్, నాయకులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, బస్తీవాసులు చంద్రశేఖర్, రామకష్ణ, నర్సింగ్ రావు, అభిషేక్, శ్రీను తదితరులు ఉన్నారు.

దమ్మాయిగూడ మున్సిపాల్టీలో

అసమ్మతి కౌన్సిలర్ల రహస్య మంతనాలు



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

దమ్మాయిగూడ మున్సిపల్ చైర్ పర్సన్ వసూపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్‌పై అవిశ్వాసం పెట్టేందుకు అసమ్మతి కౌన్సిలర్ లు రహస్య మంతనాలు కొనసాగించారని తెలుస్తోంది. మంగళవారం నాగారం మున్సిపాలిటీ రాంపల్లి గ్రామంలోని అండర్ ది ట్రీస్ గార్డెన్ లో వైస్ చైర్మెన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి తో పాటు మరో 10 మంది కౌన్సిలర్లు చైర్ పర్సన్‌పై అవిశ్వాస బేరసారాలు చేశారనే వార్త మున్సిపల్ వ్యాప్తంగా వ్యాపించింది. మంత్రి మల్లారెడ్డి నియోజకవర్గంలోని దమ్మాయిగూడ మున్సిపాల్టీలో చైర్ పర్సన్ వసూపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ తో 17మంది కౌన్సిలర్ల మధ్య గ్యాప్ మొదటినుంచి వస్తుంది. ఈ తరుణంలో అవిశ్వాసానికి కౌన్సిలర్లు తెరలేపారు. రాంపల్లిలోని అండర్ ది ట్రీస్ గార్డెన్స్‌లో రహస్య భేటి అయ్యారు. మున్సిపల్ అభివృద్ధికి చైర్ పర్సన్ సహకరించడం లేదనే ప్రధాన అంశంపై చర్చించి అవిశ్వాసం పెట్టాలని తీర్మానం చేసుకున్నారు.

చైర్మెన్ బరిలో ఆ నలుగురులోనే..?

అసమ్మతి కౌన్సిలర్లు రహస్య చర్చలు చేయడంతో చైర్ పర్సన్ బరిలో ఎవరు ఉంటారని చర్చించుకుంటున్నారు. ప్రస్తుత చైర్మెన్ వసూపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ కాకుండా మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, పాండల అనురాధ యాదగిరి గౌడ్, మాదిరెడ్డి నర్సింహ్మా రెడ్డిలు చైర్మెన్ బరిలో ఉంటారని కౌన్సిలర్లు చర్చించుకుంటున్నారు. ఎవరు డబ్బులను ఎక్కువగా ఇస్తే వారికే తమ మద్దతు ఉంటుందని కౌన్సిలర్లు బహిరంగానే వాపోయారు. దమ్మాయిగూడ మున్సిపల్ లో 15 మంది అధికార పార్టీకి చెందిన వారే కావడంతో అవిశ్వాసంపై మంత్రి మల్లారెడ్డి ఎం తేల్చుతారో అని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది.

విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన



నవతెలంగాణ-కంటోన్మెంట్

పాఠశాల విద్యార్థులకు పాఠశాల దశ నుంచే ట్రాఫిక్ నియమా నిబంధనలు తెలిపేందుకు గాను పాత బోయిన్‌పల్లిలోని హైటెక్ మోడ్రన్ హైస్కూల్‌లో ట్రాఫిక్ పోలీసులు మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ అసిస్టెంట్ కమిషనర్ జి.శంకర్ రాజు, అసిస్ట్. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అబ్దుల్ మజీద్ ఖాన్ ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు పాఠశాల దశ నుంచే ట్రాఫిక్ రూల్స్, రోడ్డు భద్రత పై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పి.మంజుల, కోఆర్డినేటర్ డి.ఎస్. రాఘవేంద్రలు, రాజు, అసి, 124 మంది విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ మేయర్, కార్పొరేటర్‌ను కలిసిన అసోసియేషన్ సభ్యులు



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ వెంకట్ రెడ్డి నగర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం మాజీ మేయర్ రామ్మోహన్‌ను, స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి కాలనీలో పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న పనులను పూర్తి చేయాలని కోరారు.కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నర్సింహ, మురళి, వెంటేశ్, శంకర్, సదానంద్, ప్రభు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే చర్లపల్లి డివిజన్ పరిధిలోని రైల్ విహార్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మాజీ మేయర్ రామ్మోహన్‌ను, స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌ను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీలో మినీ ఫంక్షన్ హాల్, బోర్ రిపేర్ తదితర పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శర్మ, త్యాగరాజన్, ముత్తు మారన్,హరికష్ణ అంజనేయులు, మల్లిఖార్జున్,సిద్దయ్య , డివిజన్ నాయకులు ప్రభు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాల కూల్చివేత

నవతెలంగాణ-జవహర్ నగర్



ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను సహించ చబోమని, కబ్జాదారులపై చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ హెచ్చరిం చారు. జవహర్ నగర్ కార్పొరేషన్‌లోని చెన్నాపూర్‌లో సర్వే నెం. 357, 358లలో అక్రమంగా నిర్మాణం చేసిన కట్టడాలను రెవెన్యూ సిబ్బందితో కలిసి వారు మంగళవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ కార్పొరేషన్ లోని భూములు పూర్తిగా ప్రభుత్వానివని, ఇటుకపెల్ల పెడితే ఊరుకోబమని అన్నారు. కబ్జాదారుల ఆగడాలు ఇకపై సాగవని, క్రిమి నల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెదడుకు ఆక్సీజన్ సరఫరా ఆగిపోతే..?

- 5-10 నిమిషాల కంటే ఎక్కువ సమయం పడితే దెబ్బతిన్న మెదడు తిరిగి పనిచేస్తుందా ?
- ప్రతి ఒక్కరు ఈ విషయాలపై అవగాహన పెంచుకోవాలి : డాక్టర్ సి.హెచ్.గోపాల్



నవతెలంగాణ-బేగంపేట్

మెదడుకు ఆక్సీజన్ సరఫరా ఆగిపోతే ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుంది..? తిరిగి కొద్ది నిమిషాల్లో మెదడుకు ఆక్సీజన్, రక్తం సరఫరాను పునరుద్ధరిస్తే బ్రెయిన్‌లో దెబ్బతిన్న భాగం తిరిగి పనిచేస్తుందా..? ఈ పరిస్థితులు ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయనే విషయాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సికింద్రాబాద్ కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ సి.హెచ్.గోపాల్ అన్నారు. ఈ విషయాలపై ఆయన మాటల్లోనే

'ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతీ ఒక్కరు స్ట్రెస్‌తో పనిచేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ముఖ్యంగా కరోనరి హార్టరీ డిసీజ్‌లతో హార్ట్ ఎటాక్ కండీషన్‌లో ఉన్న ఫలంగా ఎవరైనా కుప్పకూలిపోతే వెంటనే సీపీఆర్, నోటి ద్వారా కత్రిమ శ్వాసను అందించాలి. ఇలా అందించడం 5-10 నిమిషాలు పట్టిందా లేదా 30 నిమిషాలు ఆపై గంట సమయం పట్టిందా అనేది చాలా కీలకం. అప్పటివరకు మిగతా అవయవాలు స్టన్‌గా ఉంటాయి. మెదడుకు 5-10 నిమిషాల కంటే ఎక్కువ సేపు ఆక్సీజన్ అందకపోతే సెన్సిటివ్‌గా ఉండే న్యూరాన్స్ డెడ్ కండీషన్‌కు చేరుకుంటాయి. మరలా రక్త సరఫరా, ఆక్సీజన్ సరఫరా అందేలా చూసినా డెడ్ అయిన న్యూరాన్స్ పనిచేసే స్థితికి చేరుకునే పరిస్థితి ఉండదు. మిగతా అవయవాలు లివర్, కిడ్నీలు, లంగ్స్ తట్టుకోగలుగుతాయి. ఇలాంటి కండీషన్‌లో రోగిని వెంటిలేటర్ మీద ఉంచి కతిమ ఆక్సీజన్‌ను అందజేస్తారు. హార్ట్ పంప్ చేస్తూ, అన్ని అవయవాలు తిరిగి పనిచేస్తున్నా మెదడు పనిచేయడం మానేస్తుంది. ఈ క్లినికల్ కండీషన్‌లో కండ్లు తెరుస్తున్నాడా, కాళ్ల చేతులు కదిలిస్తున్నాడా లేదా అనే దానిమీద రీకవరి ఆధారపడి ఉంటుంది. ఫిట్స్, జర్కులు వచ్చినట్టయితే చాలా వరకు మెదడు దెబ్బతిన్నట్టే. ఇలాంటి పరిస్థితుల్లో తిరిగి రీకవరి అవుతారా అనేది బ్రెయిన్‌కు ఎంతసేపు ఆక్సీజన్ అందలేదు అనే దానిపై ఆధారపడి ఉంటుంది. 5-10 నిమిషాలు అయితే బ్రెయిన్‌కు తిరిగి రీవకరి అయ్యే అవకాశముంటుంది. అంతకంటే ఎక్కువ సమయం ఉంటే మెదడు దెబ్బతింటుంది. దెబ్బతిన్న మెదడును తిరిగి రీకవరి చేయడం కష్టం.

ఇలాంటి కండీషన్‌లో ఎంఆర్ఐ తీయడం ద్వారా మెదడు దెబ్బతిన్న భాగాన్ని గుర్తించవచ్చు. రోగిని వెంటిలేటర్ మీద ఉంచి ఎందుకు హార్ట్ ఎటాక్ వచ్చిందనే విషయాన్ని తెలుసుకొని చికిత్స అందిస్తారు. దెబ్బతిన్న మెదడు భాగాన్ని తిరిగి పనిచేసేలా ప్రత్యేకమైన చికిత్సలంటూ ఏమి లేవు. దెబ్బతినకుండా ఉన్న మెదడు భాగాన్ని కాపాడుకునేందుకు హైపో థెరమియా అనే పద్ధతిలో శరీరాన్ని మామూలు ఉష్ణోగ్రతకంటే తక్కువ టెంపరేచర్ (కూల్) ఎన్విరాన్‌మెంట్‌లో ఉంచితే డ్యామేజ్ కాకుండా ఉన్న న్యూరాన్స్‌ను కాపాడవచ్చు. ఇలాంటి ప్రత్యేక పరిస్థితిని క్రియేట్ చేసి రోగిని వెంటిలెటర్ మీదే ఉంచుతారు. మెదడుకు రక్తసరఫరా ఆగిపోయి. ఆక్సీజన్ అందకపోయే పరిస్థితిని హైపాక్సిక్ ఇస్కిమిక్ ఎన్‌సెఫలోపతి అంటాం. బ్రెయిన్ డెడ్ కండీషన్‌లో చేసేది ఏమి ఉండదు. కొంత మెదడు ఫంక్షన్ మిగిలి ఉంటే బెడ్‌మీదే ట్రెకియాస్టమి వంటి పరిస్థితులు క్రియేట్ చేసి రోగిని మోనిటరింగ్ చేస్తారు. రీకవరి అయ్యే అవకాశాలు చాలా తక్కువ. ఇలాంటి పరిస్థితులకు దారితీయకుండా ఉండాలంటే మనతోటి వారు ఎవరైనా కార్డియాక్ ఆరెస్ట్ అయితే వెంటనే సీపీఆర్ చేసి వారికి ఆగిపోయిన గుండెను పనిచేసేలా చేయడం వల్ల రక్తసరఫరా, ఆక్సిజన్ సరఫరా అవయవాలకు తిరిగి చేర్చడం వల్ల ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడవచ్చు' అని డాక్టర్ సి.హెచ్. గోపాల్ తెలిపారు.



బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ నెల 3న జరిగే అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కె.అశోక్ రెడ్డి మాట్లాడుతూ ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014-15లో విద్యారంగానికి బడ్జెట్‌లో 10శాతం నిధులు కేటాయిస్తే.. 2021-22 నాటికి ఆరు శాతానికి కుదించారని వాపోయారు. మహారాష్ట్ర కేరళ, తమిళనాడు, ఢిల్లీ రాష్ట్రాల్లో విద్యకు 25శాతం నిధులు కేటాయిస్తే.. తెలంగాణలో సగం కేటాయించినటువంటి పరిస్థితి ఉందన్నారు. అదేవిధంగా పాఠశాలలు కళాశాలల్లో, యూనివర్సిటీలో కనీస సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వం మొండి వైఖరితో ఉండడం దారుమణన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ మెస్ చార్జీలు పెంచాలన్నారు. నాలుగైదు ఏండ్లుగా ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ రూ. 4800 కోట్లు పెండింగ్‌లో ఉందని, ఈ బడ్జెట్ సమావేశాలలో పూర్తిగా రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బడ్జెట్ సమావేశాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్, నాగేందర్, శివ, వసు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 8
హైదరాబాద్
బుధవారం 01 ఫిబ్రవరి 2023

అవాస్తవ ప్రకటనలను తీవ్రంగా ఖండిస్తున్నాం

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఆది హిందూ భవనంలో వివాహ పరిచయ వేదికను నిర్వహించుకునేందుకు అనుమతి వచ్చిందని మాల సంఘాల నాయకులు అవాస్తమైన ప్రకటనలు చేస్తున్నారనీ, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ ప్రధాన కార్యదర్శి ఎం.అజయ్ గౌతమ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ జన వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ స్థాపించిన ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ ఆధ్వర్యంలో ఆది హిందూ భవన్‌లో నిర్వహిస్తున్న 'భాగ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాల' ఆవరణలో విద్యా సంబంధమైన కార్యక్రమాలకు మాత్రమే అనుమతించాలనీ, లీగ్ నియమ నిబంధనలు పేర్కొంటున్నాయనీ, ఈ నిబంధనలను తూచ తప్పకుండా అనుసరిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో విద్యాయేతర కార్యక్రమాలకు విద్యా సంస్థలు, పాఠశాలలను, పరిసరాలను వినియోగించుకోవడానికి అనుమతించరాదని పేర్కొన్నట్టు ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-అంబర్‌పేట

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం అంబర్‌పేట డివిజన్ ఓవైసీ నగర్‌లో పర్యటించిన కార్పొరేటర్ ఓవైసీ నగర్‌లో డ్రయినేజీ సమస్యని పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ మజీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రమేష్,దుర్గ, సివరేజీ ఇన్‌చార్జి నరసింహ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దయాకర్ యాదవ్, అతిక్, సంతోష్ చారి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా సర్కార్ బడులు

- తొలివిడతలో 239 పాఠశాలలు ఎంపిక
- అభివృద్ధి, మరమ్మతులకు రూ.44 కోట్లు కేటాయింపు
- 8 రకాల పనులతో మౌలిక వసతుల కల్పన
- జిల్లాలో ప్రారంభానికి సిద్ధమైన ఏడు పాఠశాలలు
- లక్ష్యానికి దూరంగా మనబస్తీ-మనబడి పనులు





నవతెలంగాణ-సిటీబ్యూరో

శిథిల భవనాలు, అరకొర వసతులున్న గదులు, పెచ్చులూడుతున్న పైకప్పులు, నిర్వహణ లేక కంపుకొడుతున్న టాయిలెట్లు, చెత్తాచెదారంతో నిండిపోయిన ప్రాంగణాలు, దుర్గంధం వంటి సమస్యలకు కేరాఫ్ అడ్రస్‌గా సర్కారు బడులు ఉండేవి. ఇలాంటి పరిస్థితుల్లో అనేక ఇబ్బందులు పడుతూ విద్యార్థులు చదువులు కొనసాగించేవారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా నగరంలోని సర్కారు బడుల్లో 8 రకాల మౌలిక వసతులతో అభివృద్ధి పనులు చేస్తున్నారు. గతంతో పోల్చి చూస్తే అడ్మిషన్లు సైతం పెరుగుతున్నాయి. కానీ మన ఊరు-మన బడి పనులు మాత్రం ఆశించిన స్థాయిలో జరగడం లేదు.

హైదరాబాద్ జిల్లాలోని 16 మండలాల్లో 693 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో 96,039 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో సగానికిపైగా పాఠశాలల్లో కనీస వసతుల్లేక నిత్యం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో సర్కారు 'మన ఊరు-మన బడి' 'మన బస్తీ-మన బడి' అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా హైదరాబాద్ జిల్లాలో గుర్తించిన 239 పాఠశాలల్లో వివిధ కారణాల వల్ల (అద్దె భవనాలు 25), ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్న పాఠశాలలు) మొత్తం 156 పాఠశాలల్లో పని ప్రారంభించారు. వాటిలో ప్రభుత్వ మోడల్ హైస్కూల్ అలియా, మోహుబియా వంటి స్కూళ్లను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి అభివృద్ధి చేశారు. అనంతరం మిగతా స్కూళ్లలో పనులు ప్రారంభమైనా.. ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించడం, అనుమతులు ఇవ్వడంలో అలసత్వానికి తోడు కొన్నిచోట్ల చేసిన పనులకు నిధులు రావడం లేదని కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ఆసక్తి చూపించలేదు. మంత్రులు, ఉన్నతాధికారుల ఒత్తిడి కారణంగా ఆదర్శ పాఠశాలల పేరిట మండలానికో రెండు పాఠశాలల చొప్పున ఎంపిక చేసి మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ లెక్కన 32 బడుల్లో పనులు చేయాల్సి ఉండగా.. కేవలం తిరుమలగిరి, ఖైరతాబాద్, ముషీరాబాద్, బండ్లగూడ, బహుదూరపురా మండలాలోని ఏడు పాఠశాలలు అభివృద్ధి చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు.

నేడు ప్రారంభం..

తిరుమలగిరి మండలంలోని పికెట్ జీపీఎస్, బొల్లారం జీపీఎస్ స్కూళ్ల అభివృద్ధి కోసం రూ.47,54,174 ఖర్చు చేశారు. ఈ నిధులతో తాగునీటి అవసరాలు తీర్చడం, ప్రహరీ గోడ, పెద్ద, చిన్న మరమ్మతులు, విద్యుత్ మరమ్మతులు, పర్నీచర్, డ్యూయల్ డెస్క్ వంటివి ఏర్పాటు చేశారు. బహదూర్‌పురా మొఘల్‌పురా మండి మీరాలం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.4,75,948 కేటాయించారు. ఈ నిధులను తాగునీటి సౌకర్యం కల్పించడానికి, విద్యుద్దీకరణ పనులు, పలు మరమ్మతుల కోసం ఖర్చు చేశారు. బండ్లగూడలోని బేల చందులాల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.5.67 లక్షలు కేటాయించగా.. ఈ నిధులతో పాఠశాలను ఆధునిక హంగులతో తీర్చిదిద్దారు. ఇందులో తరగతి గదులు, పిల్లలు కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేశారు. ముషీరాబాద్ మైలార్‌గూడలోని ప్రభుత్వ స్కూల్‌కు రూ.18,92,688 నిధులు విడుదల చేశారు. ఆ నిధులను ప్రహరీగోడ నిర్మాణం, విద్యుత్ మరమ్మతులు, ఫర్నీచర్, పలు మరమ్మతులకు ఖర్చు చేశారు. ఖైరతాబాద్‌లోని రాజ్‌భవన్ స్కూల్‌కు మన బస్తీ-మన బడి పథకం కింద రూ.1.65 లక్షలు కేటాయించారు. నిధులను మరుగుదొడ్ల అభివృద్ధికి ఖర్చు చేశారు.బహుదూర్‌పురా ఫాతీమానగర్ వాటేపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.3,16,332 కేటాయించగా.. ఆ నిధులను తాగునీటి సౌకర్యం, విద్యుద్దీకరణ పనులు, మేజర్, మైనర్ రిపేర్లకు వంద శాతం ఖర్చు చేశారు. ఇందులో జీపీఎస్ లక్ష్మీనగర్ పికెట్, జీపీఎస్ మైలార్‌గూడ, జీపీఎస్ రాజ్‌భవన్ పాఠశాలలను నేడు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ప్రారంభించనున్నారు. బహుదూరపూర, బండ్లగూడ, మండలాల్లోని స్కూళ్లను ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు ప్రారంభించనున్నారు.



క్రిస్టియన్, మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-అంబర్‌పేట

క్రిస్టియన్ మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మంగళవారం నారాయణగూడలోని చర్చిలో జరిగిన యునైటెడ్ క్రిస్టియన్స్ పాస్టర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐక్యతతోనే అభివృద్ధి సాధించగలం అనే విషయాన్ని గుర్తించి రాష్ట్రంలోని క్రిస్టియన్, మైనార్టీలు అంతా ఒకటి కావాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని జిల్లాలు, మండలాల వారీగా కమిటీలను ఏర్పాటు చేసుకుంటూ సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందనీ, ఈ కమిటీల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన వారికి అందించవచ్చని అని తెలిపారు సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో అమలు అవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశంలో ఎక్కడా అమలు కావడం లేదని స్పష్టం చేశారు. క్రిస్టియన్‌ల ఆత్మ గౌరవాన్ని మరింత పెంపొందించే విధంగా ఉప్పల్ భగాయత్‌లో 2 ఎకరాల భూమి, రూ.10 కోట్లతో క్రిస్టియన్ భవనం నిర్మాణం కోసం ప్రభుత్వం ఇచ్చిందని పేర్కొన్నారు. పేదింటి ఆడపడుచు పెండ్లి కోసం షాదీ ముబారక్ కింద రూ.లక్షా 116 రూపాయల ఆర్థిక సహాయం, విదేశాల్లో ఉన్నత విద్య కోసం రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలతో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని వివరించారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. మైనార్టీ కార్పోరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు సబ్సిడీపై రుణాలను అందిస్తున్నట్టు తెలిపారు. ఇవే కాకుండా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్మస్‌ను కూడా ఎంతో ఘనంగా నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. పేదలు సైతం పండుగను సంతోషంగా, గొప్పగా జరుపుకోవాలనే ఉద్దేశంతో నూతన వస్త్రాలతో కూడిన గిఫ్ట్ ప్యాక్ లను దేశంలో ఎక్కడా లేని విధంగా అందజేస్తున్నట్టు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్మస్ విందు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. చర్చిల అభివృద్ధి, మరమ్మతులకు కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు అందిస్తున్నట్టు చెప్పారు. గ్రేవ్ యార్డ్‌ల కోసం స్థలాలను కూడా కేటాయిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే 10 ప్రాంతాల్లో 42 ఎకరాల భూమిని గుర్తించినట్టు తెలిపారు. త్వరలోనే పంపిణీ చేయనున్నట్టు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతుందని చెప్పారు. దేశంలో అనేక చోట్ల కులాలు, మతాల పేరుతో రాజకీయాలు జరుగుతున్నాయనీ, తెలంగాణలో అలాంటి వాటికి చోటుండదని స్పష్టం చేశారు. శాంతిభద్రతల నిర్వహణలో తెలంగాణ దేశంలోనే మొదటిస్థానంలో ఉంటుందన్నారు. ఈ ప్రభుత్వం అండగా ఉంటుందనీ, ఐక్యతతో ఉండి అభివృద్ధిని సాధించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ముఠా గోపాల్, ప్రతినిధులు జోయెల్, రిచర్డ్, సురేష్ మనోహరన్, ఆశీర్వాదం, పురుషోత్తం, అనిల్ కుమార్, హేమలత, స్రవంతి, క్రిస్టియన్ మైనార్టీ కార్పోరేషన్ సామ్యేల్, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో నాయీ బ్రాహ్మణులకు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నాయీ బ్రాహ్మణులను నిర్లక్ష్యం చేయకుండా రానున్న బడ్జెట్‌లో ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని నాయీ బ్రాహ్మణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు టి.వెంకటేష్, సతీష్ డిమాండ్ చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి 9 ఏండ్లు గడుస్తున్నా నాయీ బ్రాహ్మణులకు ఏ సంక్షేమ పథకాలూ అందలేదన్నారు. వేల ఏండ్లుగా కుల వృత్తిని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న నాయీ బ్రాహ్మణుల వృత్తిలోకి ఇతర కులాలు వచ్చి కార్పొరేట్ సెలూన్లు ఏర్పాటు చేసి కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని మంగలి వృత్తిపై పేటెంట్ హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో గీత, చేనేత కార్మికులను గుర్తించినట్టు నాయీ బ్రాహ్మణులను కూడా కార్మికులుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జంపాల రాంబాబు గడ్డం స్వామి రఘు సతీష్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ వ్యాల్యుయేషన్‌లో ఓకే సారి ఆన్ లైన్ విధానం వద్దు

- విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి
- ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి అశోక్ రెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట

ఇంటర్మీడియట్ పేపర్లను ఒకేసారి అన్ని పేపర్లను ఆన్ లైన్ ద్వారా వాల్యుయేషన్ చేయాలని బోర్డు నిర్ణయాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి అశోక్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 35 లక్షల పేపర్లను లాంగ్వేజేస్, గ్రూపు సబెక్టులు కూడా ఈ పద్ధతిలో మూల్యాంకనం చేయడం వల్ల పొరపాట్లు జరిగే అవకాశం లేకపోలేదన్నారు. గతంలో గ్లోబరీనా సంస్థ టెండర్ తీసుకున్న సందర్భంలో మ్యానవల్ పద్ధతిలో పేపర్ వ్యాల్యుయేషన్ చేస్తేనే ఫలితాలు గందరగోళం ఏర్పడి విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నట్టు గుర్తు చేశారు. ఇలాంటి నేపథ్యంలో సరైన ట్రెనింగ్ లేకుండా ఇన్ని పేపర్లను దిద్దడానికి కంప్యూటర్స్, అవకాశాలపై అవగాహన కల్గించకుండా వ్యాల్యుయేషన్ చేయడం అంటే విద్యార్థులు నష్టపోయ్యే అవకాశం ఉందన్నారు. విద్యాశాఖ మంత్రి కేవలం లాంగ్వేజేస్ అని ప్రకటించారనీ, బోర్డు కమిషనర్ అన్ని పేపర్లు అని ప్రకటిస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో విద్యార్థులను గందరగోళం చేయకుండా ఈ సారి అనుభవం కోసం లాంగ్వేజేస్ కే పరిమితం చేసి భవిష్యత్‌లో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. అంతిమంగా విద్యార్థులకు నష్టం లేని చర్యలు తీసుకోవాలని లేని యెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

సెక్షన్ 12(1) సీ'ని వెంటనే అమలు చేయాలి

- సోషలిస్ట్ పార్టీ ఇండియా ప్రధాన కార్యదర్శి సందీప్ పాండే
- ధర్నా చౌక్ వద్ద డెమోక్రటిక్ సంఘం, సోషలిస్ట్ పార్టీ నాయకుల ధర్నా



నవతెలంగాణ-అడిక్‌మెట్

తెలంగాణలో విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 12(1)(సి)ని వెంటనే అమలు చేయాలి అని సోషలిస్ట్ పార్టీ ఇండియా ప్రధాన కార్యదర్శి, సామాజిక కార్యకర్త, ఉద్యమ కారుడు రామన్ మెగసేస్ అవార్డు గ్రహీత సందీప్ పాండే డిమాండ్ చేశారు. డెమోక్రటిక్ సంఘం, సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో సందీప్ పాండే, డెమొక్రటిక్ సంఘం అధ్యక్షులు సన్యాసి బ్రహ్మచారి చైతన్య హాజరై మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (1)(సీ) ప్రకారం 6 నుంచి 14 ఏండ్ల మధ్య వయసు గల పిల్లలకు ప్రాథమిక విద్యా హక్కు ఉందన్నారు. ఈ హక్కు మద్దతుగా ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం 2009లో పార్లమెంట్‌లో ఆమోదం పొందింది అని తెలిపారు. సెక్షన్ 12(1)(సి) ప్రకారం రాష్ట్రంలో గుర్తింపు పొందిన ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలు బలహీనమైన, వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలకు ప్రవేశస్థాయి తరగతులు చేర్చుకోవడం ప్రాథమిక చదువు పూర్తి అయ్యేవరకు ఉచిత విద్యను అందించడం తప్పనిసరి అన్నారు. కనీసం 25 శాతం వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ ప్రకారం ఆర్టిఏ చట్టంలోని సెక్షన్ ద్వారా అందరికీ సమ్మిళిత ప్రాథమిక విద్యను అందించడం ద్వారా మాత్రమే సమానత్వం సామాజిక న్యాయం ప్రజాస్వామ్యం విలువలు సాధించవచ్చు అని తెలిపారు. ఈ చట్టం 2010 నుంచి అమలులోకి వచ్చినప్పటికీ ఈ చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం అసమర్థత వలన అమలు చేయకపోవడంతో బడుగు బలహీనమైన వెనుకబడిన సమూహాలకు చెందిన దాదాపు పది లక్షలకు పైగా పిల్లలు ప్రాథమిక హక్కులను ఉల్లంగించబడుతున్నాయన్నారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14.21 ఉల్లంఘనకు దారితీస్తుందని తెలిపారు. డెమొక్రటిక్ సంఘం అధ్యక్షులు సన్యాసి బ్రహ్మచారి చైతన్య మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న అతిపెద్ద అన్యాయం ఏంటంటే పిల్లలకు నాణ్యమైన విద్యను పొందడం అందించడంలో ప్రభుత్వాలు విఫలం అవడం అని తెలిపారు. విద్యా హక్కులను సెక్షన్ 121(1) సీని ప్రతి బిడ్డకు సమాన అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. దేశంలో మనకు నిజమైన సమానత్వం ఉంటుందని నిర్ధారిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా హక్కు చట్టం సెక్షన్ 12(1)(సి)ని వెంటనే అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేత



నవతెలంగాణ-ఓయూ

డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ మంగళవారం మెట్టుగూడ, బౌద్ధనగర్ డివిజనల పరిధుల్లో ఇంటింటికీ తురుగుతూ లబ్దిదారుల ఇండ్ల వద్దనే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ సికింద్రాబాద్‌ను అభివృద్ధి పనుల్లో అగ్రస్థానంలో నిలుపుతున్నామని తెలిపారు. మెట్టుగూడ డివిజన్ పరిధిలో విజయపురి కాలనీలో తాజాగా రూ.30 లక్షలు, రహదారుల పునర్నిర్మాణానికి రూ.కోటి మేరకు నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. మెట్టుగూడ డివిజన్ పరిధిలో విజయపురి కాలనీ, మెట్టుగూడ, గోవిందాపురం, ఆలుగడ్డ బావి, చింతబావి, బౌద్ధనగర్ డివిజన్ పరిధిలో మహమ్మద్ గుడా, సంజీవ్ పురం, పుల్లయ్య బావి, అల్లాడి రాజ్‌కుమార్, అంబర్‌నగర్, పార్సీ గుట్ట, రాజీవ్ నగర్, అశోక్ నగర్, తదితర ప్రాంతాల్లో పద్మారావు గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా 29 చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెట్టుగూడ కార్పొరేటర్ రాసురి సునీత, బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ, బీఆర్ఎస్ యువ నాయకులు కిషోర్ కుమార్ గౌడ్, రామేశ్వర్ గౌడ్, నాయకులు కంది నారాయణ పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే పీహెచ్డీ కోర్సుల్లో ప్రవేశానికి అర్హత పరీక్షలు

నవతెలంగాణ-ఓయూ

ఓయూలో నిబంధనల ప్రకారమే పీహెచ్డీ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించామని అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు ఇంటర్వ్యూ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని కొద్ది మంది అనవసర రాద్ధాంతం చేస్తున్నారనీ, యూజీసీ నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నామనీ, ఇకపై ఏటా పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్టు అధికారులు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారం అర్హత సాధించని విద్యార్థులకు ప్రవేశాలు కల్పించలేమని స్పష్టం చేశారు. అలా చేస్తే ఇప్పటికే ఎంతో మంది విద్యార్థులు పూర్తి చేసిన పీహెచ్‌డీ డిగ్రీలకు విలువ తగ్గుతుందని తెలిపారు. యూజీసీ నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ ప్రకారమే ప్రవేశాలు కల్పించాల్సి ఉంటుందనీ, సీట్ల పెంపు సాధ్యం కాదని చెప్పారు. నిబంధనల ప్రకారం ఆయా విభాగల వారీగా రిజర్వేషన్లను పాటిస్తున్నామనీ, కొద్ది మందికి రిజర్వేషన్లలో నష్టం జరుగతుందనీ, కొద్ది మంది చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. కేటగిరి 1లో యూజీసీ నెట్/జేఆర్ఎఫ్ ఉన్న వారికి ప్రవేశాలు కల్పిస్తున్నామనీ, కేటగిరి 2 కింద నిబంధనల ప్రకారం అర్హత పరీక్ష నిర్వహించామని చెప్పారు. యూజీసీ నిబంధనల ప్రకారం అర్హత పరీక్షలో 50 శాతం మార్కులు సాధించిన వారు మాత్రమే ఉత్తీర్ణులు అనీ, అంతకన్నా తగ్గించటం కుదరదని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీల వారికి 5శాతం అర్హత మార్కుల్లో మినహాయింపు ఇచ్చామని తెలిపారు. న్యాక్ హెూదా కలిగిన ఓయూకు త్వరలోనే మరోసారి రేటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుందనీ, ఈ దశలో ఎలాంటి మినహాయింపులకు తావు లేదని చెప్పారు. ప్రస్తుతం అర్హత సాధించని విద్యార్థులు వచ్చే విద్యాసంవత్సరానికి విడుదలయ్యే ప్రవేశపరీక్షకు సిద్ధం కావాలని సూచించారు.

గోపాలమిత్ర రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-ముషీరాబాద్

బాగ్‌లింగంపల్లిలోని బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర కార్యాలయంలో బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబుయాదవ్, ప్రధాన కార్యదర్శి పి.నారాయణ ఆధ్వర్యంలో గోపాల మిత్రుల నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాంబాబు యాదవ్, నారాయణ మాట్లాడుతూ గోపాల మిత్రులు గ్రామాల్లో నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ రైతు ముంగిట్లో కృత్రిమ గర్భాధారణ సేవలు అందిస్తూ, గొర్రెలకు నట్టల నివారణ, పీపీఆర్ వ్యాక్సినేషన్ వంటి కార్యక్రమాల్లో పాల్గొంటూ, లంపి స్కిన్ లాంటి వైరస్ బారిన పడిన మూగజీవాలకు ప్రథమ చికిత్స సేవలను అందిస్తూ ప్రభుత్వానికి, రైతులకు వారధిగా ఉంటు పాడి రైతులకు విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. సీఎం కేసీఆర్ పాడి రైతుల సంక్షేమానికి ప్రవేశపెడుతున్న పథకాలను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచనల మేరకు రైతుల వద్దకు చేరుస్తున్నారన్నారు. గోపాల మిత్రుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షులుగా చెరుకు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.బందచ్య, కోశాధికారిగా గంప శివకుమార్, గౌరవాధ్యక్షులుగా రాంబాబు, ఉపాధ్యక్షులుగా కృష్ణయ్య శ్రీనివాస్, శీను, సహాయ కార్యదర్శులుగా ముజీబ్, ముత్తయ్య, సురేష్, ప్రచార కార్యదర్శిగా కె.యాదయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు కృష్ణ తెలంగాణలోని జిల్లాల గోపాలమిత్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలి

- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

నాయీ బ్రాహ్మణులు రాజకీయ, ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. గోల్నాక డివిజన్ పరిధిలోని మహారాణా ఫంక్షన్ హాల్‌లో నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యేతోపాటు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డివి నరేందర్, లింగం, జశ్వంత్, అంబర్ పేట గౌరవ అధ్యక్షులు కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కులవృత్తులను కాపాడుతూ వారి సంక్షేమానికి భవనాలు నిర్మిస్తూ నాయీ బ్రాహ్మణులకు కటింగ్ షాపులకు ఉచితంగా విద్యుత్‌ను అందజేస్తున్నట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో బీసీల సాధికారత, వారి విద్య కోసం ప్రభుత్వపరంగా వ్యక్తిగతంగా పూర్తి సహాయక సహకరాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు సురేష్, శ్రీనివాసు, సత్యనారాయణ, బాలకృష్ణ, భిక్షపతి, తిరుపతి, ప్రసాద్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

బాబా షైలాని నగర్‌లో ప్రజా సంఘాల ఇంటింటి సర్వే



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండ డివిజన్ బాబా షైలాని నగర్‌లో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు, సొంత జాగా ఉండి ఇల్లు లేని వాళ్ల ఎంతమంది ఉన్నారు అని ప్రజాసంఘాల నాయకులు ఇంటింటి సర్వే నిర్వహించారు. వందలాదిమంది ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్ల తమ బాధలు చెప్పుకుంటున్నారనీ, ఎన్ని సార్లు ఎన్ని ఆఫీసుల్లో ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకు కాలేదని చెబుతున్నారు. ఇంటి అద్దె చెల్లించలేక 20, 30 ఏండ్ల నుంచి బస్తీల్లో నివాసం ఉంటున్నామని బస్తీ ప్రజలు నాయకులకు తెలిపారు. ప్రజా సంఘాల నాయకులు టి.సాయి శేషగిరిరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దాదాపు 70 వేల ఇండ్లు పూర్తి అయినా, ఈ ప్రభుత్వానికి ఇవ్వటానికి చేతులు రావటం లేదనీ, 7 లక్షల మందికి ఎప్పుడు కట్టి ఎక్కడ ఇస్తారని ప్రశ్నించారు. ఇంటి స్థలమే పేద ప్రజలకు అందని ద్రాక్ష పండులాగా తయారైందనీ, ఈ విషయంలో ప్రజా సంఘాలన్నీ కలిసి పోరాట బాట పడుతున్నాయనీ, అర్హులందరికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చేవరకు పోరాటం చేసి సాధిస్తామనీ, సాధించేవరకు విరమించబోమని తెలిపారు. ఈనెల 4వ తేదీన ఎస్‌పీఆర్ హిల్స్ లోని రెండు బొమ్మల దగ్గర, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఇండ్ల సమస్యలు, వాటి పరిష్కారం కోసం నిరాహార దీక్ష ఉంటుందనీ, ఇల్లు లేని నిరుపేదలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని నాయకులు కోరారు. సీఐటీయూ, డీవైఎఫ్ఐ ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రావర్తి అశోక్, జె.స్వామి, ఎ.ఆర్.నరసింహ, దేవదాస్, లక్ష్మణ్, అబ్రహం, సోమలా నాయక్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

అమేజాన్ ఫ్రెష్ పై కిరాణా సరుకులపై అద్భుతమైన ఆఫర్స్

నవతెలంగాణ - హైదరాబాద్

మీరు ప్రేమించిన వారు, స్నేహితులు, కుటుంబం కోసం వండి ప్రేమ సీజన్‌ను తీసుకురండి. తాజా పండ్లు, కూరగాయలు, నిత్యావసరాలను ఉపయోగించి కొత్త వంటలు ప్రయత్నించండి. అమేజాన్ ఫ్రెష్ పై జిలెట్ అందిస్తున్న సూపర్ వేల్యూ డేస్ సమయంలో మీ నెలవారీ అవసరాల జాబితా నుండి టిక్ చేయండి. 7 ఫిబ్రవరి వరకు షాపింగ్ చేయండి. అమేజాన్ ఫ్రెష్ నుండి జిలెట్, దావత్, టాటా, ఫార్చ్యూన్, గోద్రేజ్, డాబర్ వంటి ప్రసిద్ధి చెందిన బ్రాండ్స్ సహా కస్టమర్స్ కిరాణా, కుటుంబ అవసరాలు, ప్యాకేజ్డ్ ఆహారాలు, స్నాక్స్ అండ్ పానియాలు, నిత్యావసరాలలో 45శాతం వరకు డిస్కౌంట్ పొందవచ్చని ఆ సంస్థ తెలిపింది. కస్టమర్స్ రూ.2,500 కనీస లావాదేవీతో 1 నుండి 3 ఫిబ్రవరి వరకు కోటక్ బ్యాంక్ క్రెడిట్ అండ్ డెబిట్ కార్డ్స్ పై, 4 నుండి 7 ఫిబ్రవరి 2023 వరకు ఐసీఐసీఐ క్రెడిట్ అండ్ డెబిట్ కార్డ్ పై తక్షణమే 10శాతం డిస్కౌంట్ పొందండని, రూ.300 వరకు డిస్కౌంట్స్ పొందవచ్చని ఆ సంస్థ పేర్కొంది.



నేతాజీనగర్ బస్తీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వినతిపత్రం అందజేసి సమస్యను వివరించిన గన్ ఫాండ్రి డివిజన్ మాజీ కార్పొరేటర్ మమత సంతోష్ గుప్తా. బీఆర్ఎస్ నాయకుడు సంతోష్ గుప్తా బస్తీ ప్రజలు. దీనిపై స్పందించిన మంత్రి అధికారులకు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారని తెలిపారు. నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఏసీడీ చార్జీలను ఉపసంహరించుకోవాలి

- సీపీఐ ఎంఎల్ ప్రజాపంథ నాయకులు
- టీఎస్ ఎస్పీడీసీఎల్ డివిజన్ కార్యాలయం ఎదుట నిరసన



నవతెలంగాణ-ముషీరాబాద్

విద్యుత్ వినియోగదారులపై ప్రభుత్వం విధిస్తున్న ఏసీడీ (అడ్వాన్స్ కంజంప్షన్ డిపాజిట్) చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ ఎంఎల్ ప్రజా పంథ రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కార్యదర్శి ఎం.హనుమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం వీఎస్‌టీ చౌరస్తాలోని డివిజనల్ కార్యాలయం వద్ద సీపీఐ ఎంఎల్ ప్రజా పంథ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎం.హనుమేష్ మాట్లాడుతూ ఏసీడీ చార్జీల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు మరింత కష్టాల్లోకి కూరుకుపోయి విద్యుత్ వినియోగానికి దూరమవుతారని పేర్కొన్నారు. 27 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు కూడా 24 గంటల విద్యుత్తును అందిస్తున్నామని ప్రగల్భాలు పలుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు కోతలు ప్రారంభించిందని తెలిపారు. డెవలప్‌మెంట్ చార్జీల పేరుతో విపరీత ఆధనపు బారాలను మోపి, నేటికీ ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు ఎలాంటి చెల్లింపులు చేయలేదన్నారు. గతేడాది 500 యూనిట్లపైన తర్వాత మూడు యూనిట్లపైన విద్యుత్తును ఉపయోగించే వారిపై ఏసీడీ చార్జీలను మోపిందన్నారు. ఈ ఏడాది 3 యూనిట్లు కంటే తక్కువగా వినియోగించే వినియోగదారులపై ఏసీడీ చార్జీలను మోపుతుందని చెప్పారు. విద్యుత్ సంస్థ నాలుగేండ్లుగా రూ.33 వేల కోట్ల అప్పులతో ఉందని వివరించారు. ప్రభుత్వ నష్టాలు అన్నిటినీ ప్రజలపై మోపడానికి ప్రభుత్వం సిద్ధమైందని తెలిపారు. ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ స్వతంత్రంగా ఆలోచించకుండా ప్రభుత్వ విధానాలకు వత్తాసు పలుకుతుందన్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా ఈ విధానాన్ని మార్చుకుని ఏసీడీ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, నగర అధ్యక్షులు ఎస్.ఎల్.పద్మ, పీఓడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు స్వరూప, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ ప్రదీప్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆజాద్, నాయకులు అనిల్, రవికుమార్, బీఎస్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డిని కలిసిన ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఫెడరేషన్ సభ్యులు



నవతెలంగాణ-మేడ్చల్

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డిని మంగళవారం వారి నివాసంలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామ కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఈనెల రెండో వారంలో నిర్వహించే సభకు మంత్రి మల్లారెడ్డిని ఆహ్వానించినట్లు తెలిపారు. కలసిన వారిలో బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి విష్ణుచారి, నాయకులు రవిశంకర్, బాలస్వామి, వెంకటేష్, కైసర్, వినోద్ విద్యాసాగర్, హజ్జి వివేకానంద్, రామకృష్ణ ఉన్నారు.

శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామి జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని భౌరంపేట్ గ్రామం శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామి జాతర సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్లికార్జున స్వామి వారి జాతరలో పాల్గొనడం పట్ల సంతోషంగా ఉందని పేర్కొన్నారు. స్వామి వారి దీవెనలు ప్రజలందరిపై తప్పక ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు,



సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణ లక్ష్యంగా పనిచేయాలి

- ట్రైనీ ఐపీఎస్‌లకు సూచించిన రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేయాలని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తెలిపారు. క్షేత్ర స్థాయి విధుల పరిశీలనలో భాగంగా పోలీస్ స్టేషన్లను సందర్శిస్తున్న 19 మంది ట్రైనీ ఐపీఎస్ అధికారులతో డి.ఎస్.చౌహాన్ నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్‌లో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థలో విధులు నిర్వర్తించడం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, ప్రజా క్షేమం కోసం, సమాజంలో నేర నియంత్రణ కోసం శ్రద్ధగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. శిక్షణలో ఉన్న అధికారులు పోలీసు స్టేషన్లలో ఉన్న వివిధ రకాల



బాధ్యతలను, సిబ్బంది ప్రజలతో వ్యవహరించే విధానాన్ని స్వయంగా పరిశీలించి తెలుసుకోవాలని సూచించారు. స్టేషన్లలో అధికారుల నుంచి కానిస్టేబుల్ స్థాయి వరకు అందరితో స్వయంగా మాట్లాడి విధులను పరిశీలించాలని తెలిపారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో నేరాల శాతం క్రమంగా తగ్గుముఖం పడుతోందన్నారు. నేరాలు జరిగిన సమయంలో వాటి దర్యాప్తులో సీసీ కెమెరాలు కీలకంగా మారాయన్నారు. ఈ క్రమంలో దర్యాప్తు వేగంగా పూర్తవుతుందన్నారు. మహిళా రక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షీ టీమ్స్ వ్యవస్థను అధ్యయనం చేయాలన్నారు. కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశామని, నెంబర్‌ప్లేట్స్ లేని వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రత్యేక తనిఖీలను పరిశీలించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీలు పి.ఇందిర, నర్మద, ఐటీ సెల్ సీఐ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం మల్లారెడ్డి మెడికల్ కాలేజ్ వద్ద ఏర్పాటుచేసిన తెలంగాణ కమ్యూనిటీ పారామెడిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 15వ వార్షిక మహాసభలో మంగళవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతి నిధులు, డివిజన్ అధ్యక్షులు, సీని యర్ నాయకులు, అసోసి యేషన్ సభ్యులు పాల్గొన్నారు.

డివిజన్ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం



ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌తో కలిసి ఫతేనగర్‌లోని రూ.65లక్షల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఇందులో ప్రధానంగా శ్మశానవాటిక కాంపౌండ్ వాల్ నిర్మాణం కొరకు మరియు భరత్ నగర్ పార్క్ గ్రౌండ్‌లో కాంపౌండ్ వాల్ నిర్మాణం నిమిత్తం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గంలోని శ్మశాన వాటికలు, పార్కులు, రోడ్లు డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలకు ఎక్కడా లోటు లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నామని, ఏదైనా సమస్య తలెత్తినా వెంటనే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలో ఎంతో కాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న బేగంపేట శ్మశాన వాటిక నిర్మాణ పనులు కూడా దాదాపు 90 పూర్తయ్యాయని, అతి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హైదరాబాద్ మహానగరంలో అత్యాధునిక సదుపాయాలతో గల శ్మశానవాటిక ఇదే కావడం గమనార్హమని తెలిపారు. అలాగే ఫతేనగర్‌లో కూడా అత్యాధునిక సదుపాయాలతో శ్మశానవాటిక నిర్మాణం పూర్తి చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలకు, సంక్షేమ పథకాలకు నిధులు కొరత లేకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ చూసు కుంటున్నారని, అందుకే తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కంచి బిక్షపతి, సురేందర్ నాయుడు, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడ్ మార్నింగ్ ఆల్విన్ కాలనీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి



యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్ గుడ్‌మార్నింగ్ ఆల్విన్ కాలనీ కార్యక్రమంలో భాగంగా, ఉదయం 124 డివిజన్ ఎల్లమ్మబండ పరిధి లోని సుభాష్ చంద్రబోస్‌నగర్ కాలనీలో, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను కాలనీవా సులను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా యువనేత మాట్లాడుతూ కాలనీలో అభివృద్ధి పనులన్నీ దాదాపు 99శాతం పూర్తయ్యాయని, ప్రమాదకరంగా ఉన్న రెండు విద్యుత్ స్తంభాలు మార్చవలసిన విషయాన్ని, కాలనీలో ఒక ముప్పై ఫీట్లు డ్రైనేజీ లైన్ పెద్ద లైన్‌కు కలపవలసిందిగా గుడ్ మార్నింగ్ ఆల్విన్ కాలనీ కార్యక్రమం ద్వారా తమ దృష్టికి రావడం జరిగిందని, ఈ సమస్యలను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మరియు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌ల దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని అన్నారు. సుభాష్‌చంద్రబోస్ కాలనీని ఆదర్శవంతగా అభివృద్ధి చేసినందుకు, కాలనీవాసులందరు హర్షం వ్యక్తం చేసి, ఎమ్మెల్యే మరియు కార్పొరేటర్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్, మైనారిటీ మహిళా అధ్యక్షురాలు షేక్ బీబీ, రాములుగౌడ్, వాసుదేవరావు, రాజుపాటేల్, వాలి నాగేశ్వరరావు, రవీందర్, కూర్మయ్య, ప్రీతి, నాగార్జున, లలితకుమారి, రాము, మోహన్, వేణు, రాజు, భాస్కర్, స్వరూప, ఎల్లేష్, హుస్సేన్ పాల్గొన్నారు.

దక్కన్ ప్రాంతంలో విస్తరిస్తున్న ఫోక్స్ వేగన్

నవతెలంగాణ - హైదరాబాద్

ఫోక్స్‌వేగన్ ప్యాసెంజర్ కార్స్ ఇండియా, దక్కన్ ప్రాంతంలో తమ కార్యకలాపాలను మరింత విస్తరిస్తూ నూతన సేల్స్, సర్వీస్ టచ్‌పాయింట్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ప్రారంభించింది. రాజేష్ పాములపర్తి నేతృత్వంలోని ఈ నూతన సేల్స్ అండ్ సర్వీస్ టచ్‌పాయింట్ ఎనికేపాడువద్ద ఎన్‌హెచ్5 రోడ్‌లో ప్రారంభించారు. ఫోక్స్‌వేగన్ ప్యాసెంజర్ కార్స్ ఇండియా బ్రాండ్ డైరెక్టర్ శ్రీ అశీష్ గుప్తా మాట్లాడుతూ.. "శక్తివంతమైన నిర్మాణం, భద్రత కోసం జర్మనీ తయారీ కార్ల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను ఆంధ్రప్రదేశ్‌లో మేము చూస్తున్నాము. రాష్ట్రంలో పారిశ్రామికీకరణ, వ్యాపార లావాదేవీలు పెరుగుతుండటం దీనికి కారణం. అందువల్ల, మేము మా కార్యకలాపాలు విస్తరించడంతో పాటుగా ఈ ప్రాంతంలో మా వినియోగదారుల అవసరాలను సైతం తీర్చనున్నాము. రాష్ట్రంలో 8 సేల్స్, 6 సర్వీస్ టచ్‌పాయింట్ల ద్వారా, ప్రపంచశ్రేణి ఉత్పత్తులు, సేవలను అందించడానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం నల్లగుట్టలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున దేవస్థానమును మంగళవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వచ్చే నెల 5వ తేదీన నిర్వహించనున్న ద్వాదశ జ్యోతిర్లింగ శివ పూజ మహోత్సవ గోడ పత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆలయాల అభివృద్ధిలో ఎల్లవేళలా సహకారం అందిస్తానని అన్నారు. నల్లగుట్ట భ్రమరాంబ మల్లికార్జున దేవస్థానం వద్ద త్వరలోనే రోడ్డు అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ దూదిమెట్ల సోమేష్ యాదవ్ మరియు ప్రజా ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, శివ స్వాములు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

యువ నేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు కేపీ విశాల్ గౌడ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో గల సీనియర్ సిటిజన్ భవనంలో మెడివిజన్ ఆసుపత్రి వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని యువ నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కేపీ విశాల్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు ఆసుపత్రి యాజమాన్యాన్ని, సిబ్బందిని అభినందించారు. ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు కోరారు. మెడివిజన్ ఆసుపత్రి యాజమాన్యం ఆర్థిక సహకారంతో సుమారు 150 మందికి బిపి, షుగర్, రక్తపరీక్షలు, జ్వరం, మోకాళ్ల



నొప్పులు తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించడం అభినందనీయమ న్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అధ్యక్షులు సామల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్ది మల్లేశం, కోశాధికారి మురళిగౌడ్, నరహరిగౌడ్, లక్ష్మణాచారి, వీరారెడ్డి, నాగేష్, బండి బిక్షపతి గౌడ్, రామన్, నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


జగదంబ మాత 17వ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం 129 డివిజన్ పరిధిలోని శివాలయ నగర్‌లో జగదాంబ మాత 17వ వార్షికోత్సవంలో మంగళవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు



నవతెలంగాణ-దుండిగల్

మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు మంగళవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని పలువురు నాయకులు ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. స్పందించిన ఎమ్మెల్సీ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా వివిధ శుభకార్యాలకు హాజరు కావాలని పలువురు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు, పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరంజ్యోతి పదవీ విరమణ



వీడ్కోలు సమావేశంలో ఘనంగా యూనియన్, కార్మికుల ఘన సత్కారం

నవతెలంగాణ-బాలానగర్

బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ప్రభుత్వ రంగ సంస్థ (హెచ్‌ఏఎల్) లో గత 41 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ కార్మిక నేతగా అంచెలంచెలుగా ఎదుగుతూ తోటి కార్మికుల హక్కులు, వారి సంక్షేమం కోసం అనేక సేవలు అందించిన ఎం.జె.పరంజ్యోతి మంగళవారం పదవీ విరమణ పొందారు. 1997లో క్యాజువల్ ఎంప్లాయిస్ యూనియన్ స్థాపించి, ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. కార్మికుల హక్కుల కొరకు ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్, హైకోర్ట్, సుప్రీం కోర్ట్‌ను ఆశ్రయించి హక్కుల కొరకు పోరాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో హిందుస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ (హెచ్‌ఏడబ్ల్యూ) అధ్యక్షుడు ఘంటా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలో నిబద్ధతతో విధి నిర్వహణలో చురుకుగా పనిచేస్తూ తోటి కార్మికుల కోసం న్యాయబద్ధంగా ఏదో చేయాలన్నతపనతో హిందుస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ (హెచ్‌ఏడబ్ల్యూ)లో చేరి కార్మికుల పక్షాన నిలిచి ఆయన చేస్తున్న పనితీరును అధినాయకత్వం గుర్తించి సంయుక్త కార్యదర్శిగా నియమించారు. అంతేకాకుండా ప్రస్తుతం హెచ్‌ఏఎల్ క్రిస్టియన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షునిగా కూడా ఆయన వ్యవహరిస్తున్నారు. కార్మికుల న్యాయపరమైన సమస్యలపై యాజమాన్యంపై ఒత్తిడి చేస్తూ చట్టబద్ధమైన చర్చల ద్వారా సమస్యలను పరిష్కరిస్తూ కార్మికుల మన్ననలను పొందారు. నేతగా కాకుండా క్రిస్టియన్ సొసైటీ ప్రధాన కార్యదర్శిగా హెచ్‌ఏఎల్ క్యాంపస్‌లో కమ్యూనిటీ వర్గానికి విశిష్ట సేవలు అందించారని పలువురు కొనియాడారు. పదవీ విరమణతో పూర్తి శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో గడపాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ (హెచ్‌ఏడబ్ల్యూ) అధ్యక్షుడు ఘంటా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వెంకటాద్రి, కోశాధికారి కృష్ణ, జ్ఞానేశ్వర్, ఈశ్వర్, గణేష్, ప్రవీణ్, కృష్ణారావు, సురేష్, జోగారావు, ప్రభాకర్ రెడ్డి, నవీన్, కుమార్, కిరణ్, కృష్ణ బాబు పాల్గొన్నారు.

యువత ఆకాంక్షలను పటిష్ఠం చేస్తున్న కేఈఐ వైర్స్, కేబుల్స్

నవతెలంగాణ - హైదరాబాద్

కేఈఐ లెగసీ వైర్ బ్రాండ్ తన కొత్త వాణిజ్య ప్రకటన ద్వారా దేశంలోని యువతతో మాట్లాడుతోంది. బ్రాండ్ తన కస్టమర్ల పట్ల ప్రదర్శించే నిబద్ధత వలె, అనేక టెన్షన్‌లను ఎదుర్కొన్నప్పటికీ, ప్రతి పాత్ర తన లక్ష్యం కోసం పనిచేయాలని నిర్ణయించుకున్న సందర్భాలపై ఈ చిత్రం ఆలోచనాత్మక వెలుగులను ప్రసరిస్తుంది. కేఈఐ వైర్లు, కేబుల్‌లతో సాఫీగా నడిచే ఉపకరణం/పరికరం ఈ కీలక అంశాలకు మద్దతుగా ఉంటుంది. ఐదు దశాబ్దాలకు పైగా అనుభవంతో కూడిన సంస్థగా కేఈఐ యువ తరంతో అనుసంధానం కావడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది, తమ లక్ష్యాలను కోల్పోవద్దని వారిని కోరుతోంది. ఈ తరం యొక్క పెరుగుతున్న ఆకాంక్షలు, భారీ ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌ల వినియోగంతో, దీర్ఘకాలం ఉండే, భారీ మొత్తంలో లోడ్ తీసుకోగల నమ్మకమైన వైర్‌లతో బ్రాండ్ ట్యాగ్‌లైన్ - హర్ టెన్షన్ సహే, చల్తీ రహే అనే దానితో తన కస్టమర్‌లకు మద్దతు ఇవ్వడానికి బ్రాండ్ కట్టుబడి ఉంది.

టీడీపీకి పూర్వవైభవం తీసుకొద్దాం

జిల్లా కార్యాలయాన్ని సందర్శించిన టీడీపీ అధ్యక్షులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీడీపీకి తిరిగి పూర్వవైభం తీసుకొద్దామని, కొత్త కొత్త పథకాలలో నూతన ఉత్సాహంతో ముందుకు సాగేవిధంగా చర్యలు చేపట్టాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో సీనియర్ నాయకులు, సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు పి.సాయిబాబాతోపాటు జిల్లా నాయకులతో జ్ఞానేశ్వర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. త్వరలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించి, వారిని చైతన్యపరచాలని నిర్ణయించారు. ఆనాడు గ్రామాధికార వ్యవస్థను రద్దుచేసి, మండల వ్యవస్థను నెలకొల్పిన తీరుతోపాటు రెండు రూపాయల కిలో బియ్యం పథకం, మొదలైన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను విధిగా ప్రజల్లోకి తీసుకువెళ్లి వారందరినీ తెలుగుదేశం పార్టీ వైపు మళ్లించడానికి ఈ సమావేశంలో వ్యూహాలు రూపొందించారు. పార్టీ సంస్థాగతంగా పటిష్ఠంగా నిర్మించుకోవడానికి బూత్ కమిటీలు, మండల కమిటీలు, డివిజన్ కమిటీలు, నియోజకవర్గ కమిటీలను పటిష్ఠంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. త్వరలో హైదరాబాద్‌లో లక్షలాది మందితో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయాలని సమావేశంలో చర్చించారు. ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ పునఃర్వైభవం కోసం కార్యకర్తలు పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల కిషోర్, ప్రధాన కార్యదర్శి బాలరాజుగౌడ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దోజు, రవీంద్రచారి, జోగేంద్ర సింగర్ శ్రీనివాస్, యాదగిరి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్ హోల్స్

ప్రమాదాల బారిన వాహనదారులు

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలానగర్, ఫతేనగర్ జంట డివిజన్ల పరిధిలో డ్రైనేజీ మ్యాన్ హోల్స్ దుస్థితి అధ్వానంగా తయారయ్యాయి. మ్యాన్ హోళ్ల పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు, అటు పాదచారులకు ప్రమాదకరంగా మారుతున్నాయి. వాహనాల రాకపోకల సమయంలో కొన్ని చోట్ల మూతలు విరిగిపోవడం వల్ల వాటి స్థానంలో సర్కిల్ సిబ్బంది కొత్త వాటిని ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జంట డివిజన్ల పరిధిలోని రాజుకాలనీ, వినాయకనగర్, గౌతం నగర్, ఓల్డ్ ఎయిర్ పోర్ట్ రోడ్డు, పైప్ లైన్ రోడ్డు, నవజీషన్ నగర్, ఫూల్‌భాగ్ కాలనీ తదితర ప్రాంతాలలో మ్యాన్‌హోళ్ళ మూతలు తెరుచుకుని ప్రమాదకరంగా తయారయ్యాయి. దీంతో బస్తీలలో, కాలనీలలో పిల్లలు ఆడుకుంటూ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఆయా ప్రాంతాలలో దెబ్బతిన్న మ్యాన్ హోళ్ళపై మూతలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. చాలా చోట్ల మ్యాన్ హోల్స్ మూతలు లేకుండా దర్శనమిస్తున్నాయి. మ్యాన్ హోల్స్ మూతలు సరిగా లేకపోవడంవల్ల అవి రహదారి మధ్యలో ఉండటంతో చాలా ఇబ్బందికరంగా ఉంటోందని, ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు ఇబ్బందులు ఎదర్కొంటున్నారన్నారని, ఇకనైనా అధికారులు స్పందించి మ్యాన్ హోల్స్‌పై మూతలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం డివిజన్ల అభివృద్ధిలో రహదారుల నిర్మాణం చేపడుతూ రోడ్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న మ్యాన్ హోళ్ల మూతలు వాహనదారులను భయపెడుతున్నాయి. రోడ్ల ఎత్తుకు సమానంగా మ్యాన్ హోళ్ల మూతలు ఉండాలని ఉన్నతాధికారులు గతంలోనే ఆదేశించినా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. కార్పెటింగ్, రీ కార్పెటింగ్, పీపీఎం పనులంటూ పొరలు పొరలుగా జీహెచ్‌ఎంసీ చేపడుతున్న పనులతో బీటీ రోడ్ల ఎత్తు క్రమేణా పెరుగుతోంది. తద్వారా మ్యాన్ హోల్స్ మూతలు మాత్రం రోడ్డు కంటే తక్కువ ఎత్తులో ఉండం వల్ల అవి గుంతల్లా మారుతున్నాయి. వాహనదారులు వెనక వెళ్లే ద్విచక్ర వాహనదారులు ఆ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారుల మధ్యలో మూతలు లేని మ్యాన్ హోల్స్ స్థానికులకు స్థానికుల ఫిర్యాదు మేరకు సంబంధిత అధికారులు ప్రమాదకరంగా ఉన్నా అధికారులకు తెలియడంలేదు. తాత్కాలిక మరమ్మతులతో చేతులు దులుపుకుని, నివేదికలు తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేసి బిల్లులు తీసుకున్నామనే దోరణిలో వ్యవహరిస్తున్నారు. ఎవరూ వేలెత్తి చూపకుండా పనులు సక్రమంగా చేశామనే ధీమాతో





ఉంటారు. అభివృద్ధి పనులతో అసలుసమస్య పరిష్కరించకుండా అదనపు సమస్యలు సృష్టిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో మొద్దు నిద్ర నటిస్తున్న అధికారులు, సిబ్బంది ఇప్పటికైనా మేల్కొని మృత్యువు పొంచివున్న రహదారులపై నోళ్ళు తెరుచుకున్న మ్యాన్ హోళ్ళపై దృష్టి సారించి ప్రమాదాలను నివారించేందుకు తగు చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.



సిరీస్ సవాల్

- అరుదైన విజయంపై కివీస్ గురి
- సత్తా చూపేందుకు పాండ్యసేన సిద్ధం
- భారత్, కివీస్ మూడో టీ20 నేడు

రాత్రి 7 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

రెండు వారాలు, రెండు వైట్‌బాల్ సిరీస్‌లు, ఆరు మ్యాచులు. ఆరు మ్యాచుల కోసం భారత్, న్యూజిలాండ్ దేశాన్ని చుట్టేశాయి. రెండు జట్లు సబర్మతి తీరంలో నేడు చివరి మజిలీకి సిద్ధమయ్యాయి. భారత గడ్డపై చారిత్రక తొలి సిరీస్ విజయం వేటలో న్యూజిలాండ్ దూకుడు చూపిస్తుండగా.. స్వదేశంలో సిరీస్‌ను పట్టేందుకు టీమ్ ఇండియా రెట్టించిన ఉత్సాహంతో ఉరకలేస్తోంది. చిట్టి సిరీస్ వేటలో భారత్, న్యూజిలాండ్ నిర్ణయాత్మక ధనాధన్ నేడు.

నవతెలంగాణ-అహ్మదాబాద్

2012లో ఏకైక టీ20 మ్యాచ్‌తో సిరీస్ నెగ్గిన న్యూజిలాండ్.. నిజానికి భారత గడ్డపై ఏ ఫార్మాట్‌లోనూ సిరీస్ విజయం సాధించలేదు. గతంలో వరుసగా రెండు సార్లు వన్డే సిరీస్‌లను నిర్ణయాత్మక మ్యాచ్ వరకు తీసుకెళ్లిన కివీస్.. ఆఖరు అడుగులో తడబడింది. తాజాగా, మూడు మ్యాచుల సిరీస్ నిర్ణయాత్మక పోరుకు చేరుకుంది. భారత గడ్డపై సిరీస్ విజయం సాధించే సువర్ణావకాశం మరోసారి న్యూజిలాండ్ ముంగిట నిలిచింది. తెలివైన నాయకుడు మిచెల్ శాంట్నర్ సారథ్యంలో న్యూజిలాండ్ చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతోంది. మరోవైపు హార్దిక్ పాండ్య నాయకత్వంలో భారత్ మరో సిరీస్‌పై గురిపెట్టింది. గత పదేండ్లలో స్వదేశంలో ద్వైపాక్షిక సిరీస్ విజయాల్లో టీమ్ ఇండియాది ఓ ప్రత్యేక చరిత్ర. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మినహా మరో జట్టు భారత్‌లో భారత్‌పై విజయం సాధించలేదు. సిరీస్ వేటలో ఇరు జట్లు దూకుడు చూపించేందుకు సై అంటున్నాయి. భారత్, న్యూజిలాండ్ నిర్ణయాత్మక టీ20 పోరు నేడు.

టాప్ మెరవాలి

బంగ్లాదేశ్‌పై వన్డేలో ఇషాన్ కిషన్ 210 పరుగుల ద్వి శతకం సాధించాడు. ఆ తర్వాత అతడు ఆడిన ఎనిమిది ఇన్నింగ్స్‌లో ద్వి శతక మెరుపులో సగం పరుగులైనా సాధించలేదు. యువ ఓపెనర్‌కు వీలైనన్ని ఎక్కువ అవకాశాలు ఇచ్చేందుకు జట్టు మేనేజ్‌మెంట్ సిద్ధంగా ఉంది. టాప్ ఆర్డర్‌లో లెఫ్ట్ హ్యాండెడ్ బ్యాటర్, వికెట్ కీపర్‌గా అదనపు బాధ్యతలు ఇషాన్ కిషన్‌ను తుది జట్టులో నిలుపుతాయి. కానీ బ్యాట్‌తో నిలకడగా రాణించకపోతే కిషన్ మరోసారి బెంచ్‌కు పరిమితం కాకతప్పదు. సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ నుంచి జట్టు మేనేజ్‌మెంట్ మంచి ఇన్నింగ్స్ ఆశిస్తోంది. ఇక యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ వన్డే ఫామ్‌ను కొనసాగించలేకపోయాడు. రెండు టీ20ల్లోనూ నిరాశపరిచాడు. ఐపీఎల్ సొంత గడ్డ అహ్మదాబాద్‌లో గిల్ మెప్పిస్తాడేమో చూడాలి. రాహుల్ త్రిపాఠి సత్తా ఉన్న బ్యాటర్. కానీ నిలకడ అత్యంత కీలకం. సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య ఫామ్‌లో ఉన్నారు. టాప్ ఆర్డర్‌లో కిషన్, గిల్, త్రిపాఠి తొలి పది ఓవర్లలో తడఖా చూపిస్తే.. చివరి పది ఓవర్ల కథ సూర్య, పాండ్య నడిపించగలరు. పేస్ బౌలింగ్‌కు అనుకూలించే అహ్మదాబాద్‌లో మణికట్టు మాయగాడు చాహల్ స్థానంలో స్పీడ్‌గన్ ఉమ్రాన్ మాలిక్ తుది జట్టులోకి వచ్చే వీలుంది. వికెట్ల పరంగా ఫర్వాలేదనుకున్నా, ఎకానమీ పరంగా మాలిక్ నిరూపించుకోవాల్సి ఉంది. శివం మావి, అర్షదీప్ సింగ్ పేస్ బాధ్యతలు చూసుకోనున్నారు. కుల్దీప్, వాషింగ్టన్‌తో పాటు దీపక్ హుడా స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నాడు.

చరిత్ర సృష్టిస్తారా?

కేన్ విలియమ్సన్, ట్రెంట్ బౌల్ట్, టిమ్ సౌథీ.. ఈ ముగ్గురు లేని న్యూజిలాండ్ జట్టును ఊహించలేం. కానీ కీలక ఆటగాళ్లు లేకుండానే భారత పర్యటనకు వచ్చిన న్యూజిలాండ్ వన్డే సిరీస్‌లో వైట్‌వాష్ పాలైనా.. టీ20 సిరీస్‌లో చరిత్రకు చేరువగా వచ్చింది. మిచెల్ శాంట్నర్ విలక్షణ ఆలోచన, నాయకత్వం కివీస్‌కు కలిసొచ్చింది. ధనాధన్ ఫార్మాట్‌లో బ్యాటర్లు, బౌలర్లు అంచనాల మేరకు రాణిస్తున్నారు. టాప్



ఆర్డర్‌లో డెవాన్ కాన్వే కివీస్‌కు అత్యంత కీలకం. సగటు, స్ట్రయిక్‌రేట్ పరంగా డెవాన్ కాన్వే అత్యంత విలువైన ఆటగాడు. ఫిన్ అలెన్, మార్క్ చాప్‌మన్ నుంచి సహకారం లభిస్తే కివీస్ టాప్ ఆర్డర్ విశ్వరూపం చూపించగలదు. మిడిల్ ఆర్డర్‌లో డార్లీ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్, మైకల్ బ్రాస్‌వెల్ జోరుమీదున్నారు. స్పిన్నర్లు ఇశ్ సోధి, మిచెల్ శాంట్నర్ భారత్‌ను మాయ చేస్తున్నారు. ఇశ్ సోధి గత రెండేండ్లలో టీ20 ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు కూల్చిన బౌలర్‌గా కొనసాగుతున్నాడు. రానున్న వన్డే వరల్డ్‌కప్ ముంగిట పరిస్థితులపై అవగాహన, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవటమే లక్ష్యంగా బరిలో నిలిచిన న్యూజిలాండ్‌కు ఓటమి భయం లేదు. చరిత్ర ముంగిట భయమెరుగని క్రికెట్‌తో న్యూజిలాండ్ రికార్డులు బద్దలు కొడుతుందేమో చూడాలి.

పిచ్, వాతావరణం

అహ్మదాబాద్ నరేంద్ర మోడి స్టేడియం సహజంగానే భారీ స్కోర్ల పిచ్. పొట్టి ఫార్మాట్‌లో ఇక్కడ పరుగుల వరద పారుతుంది. ఇక్కడ జరిగిన చివరి ఐదు మ్యాచుల్లో ఏకంగా మూడు మ్యాచుల్లో రెండు ఇన్నింగ్స్‌ల్లో 160 పైచిలుకు స్కోర్లు నమోదయ్యాయి. చివరి టీ20 మ్యాచ్‌కు వాతావరణం అను కూలించనుంది. బుధ వారం ఇక్కడ ఎటువంటి వర్షం సూచనలు లేవు. టాస్ నెగ్గిన జట్టు బౌలింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తోంది.

తుది జట్లు (అంచనా)

భారత్ : శుభ్‌మన్ గిల్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), రాహుల్ త్రిపాఠి, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య (కెప్టెన్), దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, శివం మావి, కుల్దీప్ యాదవ్, ఉమ్రాన్ మాలిక్, అర్షదీప్ సింగ్.

న్యూజిలాండ్ : ఫిన్ అలెన్, డెవాన్ కాన్వే (వికెట్ కీపర్), మార్క్ చాప్‌మన్, గ్లెన్ ఫిలిప్స్, డార్లీ మిచెల్, మిచెల్ బ్రాస్‌వెల్, మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), ఇశ్ సోధి, లాకీ ఫెర్గుసన్, జాకబ్ డఫ్ఫీ, బ్లెయిర్ టిక్నర్.



అండర్-19 విజేతలకు సత్కారం

ఐసీసీ మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్ విజేతలుగా నిలిచిన భారత క్రికెట్ జట్టును బీసీసీఐ నేడు ఘనంగా సత్కరించనుంది. భారత్, కివీస్ మూడో టీ20కి ముందు అహ్మదాబాద్ స్టేడియంలో అండర్-19 అమ్మాయిలను క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, బీసీసీఐ ఆఫీస్ బేరర్లు సన్మానించనున్నారు. భారత మహిళల జట్టు ఓ ఐసీసీ ట్రోఫీ సాధించటం ఇదే కావటంతో భారత మహిళా క్రికెట్‌లో అండర్-19 టీ20 ప్రపంచకప్ ఓ చరిత్రగా నిలిచిపోనుంది. విశ్వవిజేతలు షెఫాలీ వర్మసేనకు రూ. 5 కోట్ల నగదు బహుమానం సైతం నేడు అందజేయనున్నారు. ఈ మేరకు బీసీసీఐ కార్యదర్శి జై షా ట్వీట్ చేశారు.

కుల్దీప్ కీలకం

ఆసీస్‌తో టెస్టు సిరీస్‌పై సునీల్ జోషి



ముంబయి : ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో చోటే లక్ష్యంగా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో బరిలోకి దిగుతోంది భారత్. నాలుగు టెస్టుల సిరీస్ కోసం మరోవైపు ఆస్ట్రేలియా సైతం గొప్పగా సన్నద్ధమవుతోంది. ఆసీస్‌పై టెస్టు విజయం సాధించేందుకు, చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని బీసీసీఐ మాజీ సెలక్టర్ సునీల్ జోషి అభిప్రాయపడ్డాడు. 'ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లో పిచ్, వేదిక, పరిస్థితులతో సంబంధం లేకుండా కుల్దీప్‌ను తుది జట్టులోకి తీసుకోవాలి. అశ్విన్, జడేజాల తోడుగా కుల్దీప్ మూడో స్పిన్నర్‌గా ఉండాలి. ఇటీవల కాలంలో కుల్దీప్ ఓవర్లో క్యాచౌట్లు అన్నీ 30 గజాల సర్కిల్‌లోపలే ఉన్నాయి. ఓ బౌలర్ గొప్ప క్రమశిక్షణతో, లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేస్తున్నాడని చెప్పేందుకు ఇదో నిదర్శనం. వికెట్ల వేటలో కుల్దీప్ యాదవ్ అత్యంత ప్రభావితంగా మారాడు. ఆస్ట్రేలియాపై భారత్ టెస్టు సిరీస్ నెగ్గాలంటే.. కచ్చితంగా కుల్దీప్ యాదవ్ కీలక పాత్ర పోషించాలి' అని సునీల్ జోషి అన్నాడు. మణికట్టు స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ లయ తప్పాడని, వన్డే వరల్డ్‌కప్ జట్టులో సైతం కుల్దీప్ యాదవ్‌కు చోటు ఇవ్వాల్సిన అవసరం ఉందని సునీల్ జోషి వ్యాఖ్యానించాడు.



పర్యవేక్షణ కమిటీలో బబిత ఫోగట్

న్యూఢిల్లీ : భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక ఆరోపణలు, ఆర్థిక అవకతవకల ఆరోపణలపై విచారణకు కేంద్ర క్రీడాశాఖ నియమించిన పర్యవేక్షణ కమిటీలో మాజీ రెజ్లర్ బబిత ఫోగట్‌ను చేర్చారు. విచారణ కమిటీ ఏర్పాటులో రెజ్లర్లను సంప్రదించలేదని వినేశ్, బజరంగ్, సాక్షి మాలిక్ అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో.. వినేశ్ ఫోగట్ సోదరి, బిజెపి నాయకురాలు బబిత ఫోగట్‌ను కమిటీ సభ్యురాలుగా నియమించారు. దిగ్గజ బాక్సర్ ఎంసీ మేరీకోమ్ నాయకత్వంలోని విచారణ కమిటీ నాలుగు వారాల్లో నివేదిక అందజేయాల్సి ఉంది.



9వ స్థానంలో సింధు

డబ్ల్యూబిఎఫ్ ర్యాంకింగ్స్

దుబాయ్ : భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, తెలుగు తేజం పి.వి సింధు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మరో స్థానం పడిపోయింది. గాయంతో ఆరు మాసాల పాటు ఆటకు దూరమైన సింధు.. ఇటీవల రీ ఎంట్రీ ఇచ్చినా అంచనాలను అందుకోలేదు. ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో (మహిళల సింగిల్స్)లో ఓ స్థానం పడిపోయి 9వ ర్యాంక్‌లో నిలిచింది. వెటరన్ షట్లర్ సైనా నెహ్వాల్ రెండు స్థానాలు ఎగబాకి 26వ ర్యాంక్‌కు చేరుకుంది. పురుషుల సింగిల్స్‌లో యువ షట్లర్ లక్ష్యసేన్ 11వ స్థానంలో నిలిచాడు. మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో లక్ష్యసేన్ ఓ స్థానం మెరుగై టాప్-10కు చేరవయ్యాడు. మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్ 16వ స్థానంలో నిలిచాడు. మెన్స్ డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ ఆరో స్థానంలో కొనసాగుతుంది. మహిళల డబుల్స్‌లో ట్రెసా జాలి, పుల్లెల గాయత్రి జంట 19వ స్థానం సాధించింది.

జ్వెరెవ్‌పై చర్యల్లేవ్

గృహ హింస ఆరోపణలపై ఏటీపీ



లండన్ : జర్మన్ స్టార్ ఆటగాడు, మాజీ వరల్డ్ నం.2 అలెగ్జాండర్ జ్వెరెవ్‌పై గృహ హింస ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని, అతడిపై ఎటువంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోవటం లేదని ఏటీపీ (అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్) మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. జ్వెరెవ్ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేసినట్టు అతడి మాజీ ప్రియురాలు ఒల్గా షరిపోవా ఓ మ్యాగజెన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆరోపించింది. అక్టోబర్ 2021లో ఒల్గా షరిపోవా ఆరోపణలపై ఏటీపీ స్వతంత్ర దర్యాప్తు సంస్థచే విచారణ జరిపింది. షరిపోవా, జ్వెరెవ్ సహా 24 మంది సన్నిహితులను దర్యాప్తు సంస్థ విచారించింది. ప్రధానంగా ఏటీపీ టోర్నీ వేదికలు షాంఘై, మొనాకో, న్యూయార్క్, జెనీవాలో క్రమశిక్షణ ఉల్లంఘనలకు పాల్పడ్డాడా? లేదా? అంశంపై దర్యాప్తు సంస్థ విచారణ చేసింది. ఆరోపణలను బలపరిచేలా ఎటువంటి ఆధారాలు లభించలేదని దర్యాప్తు నివేదికలో పేర్కొన్నారు. ఆరోపణలను ఖండించిన జ్వెరెవ్, విచారణకు పూర్తి సహకారం అందించాడు.

నవచిత్రం



త్రిగున్, శైలేష్ కొలను, మధుబాల, శ్రీకాంత్ సిద్ధమ్ తదితరులు

అలరించే రెండు భిన్న ప్రేమకథలు

1996లో విడుదలైన 'ప్రేమదేశం' సినిమా ఎంతటి సంచలన విజయం సాధించిందో అందరికీ తెలుసు. చాలా కాలం తర్వాత అదే టైటిల్‌తో వస్తున్న చిత్రం 'ప్రేమదేశం'. ఈ చిత్రాన్ని సిరి క్రియేటివ్ వర్క్స్ పతాకంపై శ్రీకాంత్ సిద్ధమ్ దర్శకత్వం వహించగా, శిరీష సిద్ధమ్ నిర్మించారు. రఘు కళ్యాణ్ రెడ్డి, రాము అసోసియేట్ ప్రొడ్యూసర్స్‌గా, కమల్, కిరణ్, రూపా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్‌గా ఉన్న ఈ చిత్రంలో అలనాటి అందాలతార మధుబాల ప్రత్యేక పాత్రలో నటించారు. త్రిగున్, మేఘా ఆకాష్, మాయ, అజయ్ కతుర్వార్, కమల్ నార్ల తేజ, శివ రామచంద్ర నటించిన ఈ చిత్రం ఈనెల 3న గ్రాండ్‌గా విడుదల కానుంది.

ఈ సందర్భంగా చిత్ర యూనిట్ పార్క్ హయత్ హోటల్‌లో గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, డైరెక్టర్ శైలేష్ కొలను, మధుబాల తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. మధుబాల మాట్లాడుతూ,'డైరెక్టర్ శ్రీకాంత్ సిద్ధం చెప్పిన ఈ సినిమా లైన్ నచ్చి చేశాను. ఆ తరువాత టీజర్ రిలీజ్ చేసినప్పుడు నా ఫేస్ చూసుకుని చాలా బాగా చేశారు అనిపించింది. ఇందులో మణిశర్మ ఇచ్చిన అద్భుతమైన మ్యూజిక్, పాటలు చాలా బాగున్నాయి' అని తెలిపారు. 'మా సినిమా ట్రైలర్, టీజర్, పాటలకు ప్రేక్షకులనుండి వచ్చిన రెస్పాన్స్ చూస్తుంటే చాలా సంతోషం కలిగింది. ఈ విషయంలో నేను ముఖ్యంగా మణిశర్మకి థ్యాంక్స్ చెప్పుకోవాలి. 'పదములే లేవు పిల్ల' వంటి తదితర బ్యూటిఫుల్ సాంగ్స్ ఇవ్వడం ఓ ఎత్తు అయితే ఇందులో మధుబాల నటిస్తుండడం మరో ఎత్తు. దాంతో మా సినిమా నెక్స్ లెవెల్‌కి వెళ్ళింది.మా సిస్టర్ శిరీష ఎంతో కష్టపడి ఈ సినిమాకు సహకారం అందించింది' అని దర్శకుడు శ్రీకాంత్ సిద్ధం చెప్పారు.

ప్రొడ్యూసర్ శిరీష సిద్ధం మాట్లాడుతూ,'నేనొక సాఫ్ట్‌వేర్ ఎంప్లాయిని. మా అన్నయ్య శ్రీకాంత్ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. మూవీ కూడా చాలా బాగా వచ్చింది. ఫ్రెష్ కంటెంట్‌తో వస్తున్న ఈ సినిమా చాలా బాగుంటుంది. ఈ మూవీని చూసి బయటకు వచ్చే ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఎమోషన్‌తో బయటకు వస్తారు' అని అన్నారు. 'ఈ సినిమాలో రెండు లవ్ స్టోరీస్ ఉన్నాయి. నాలుగు కోట్ల బడ్జెట్ అని స్టార్ట్ చేసిన సినిమా కాస్త 8 కోట్లు అయ్యింది. అయినా మేము క్వాలిటీలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమా చేశాం' అని అసోసియేట్ ప్రొడ్యూసర్స్ రఘు కళ్యాణ్ రెడ్డి, రాము తెలిపారు.

ఎన్నో రాత్రులొస్తాయిగానీ..



కళ్యాణ్ రామ్, ఆషికా రంగనాథ్

కళ్యాణ్ రామ్ త్రిపాత్రాభినయంలో నటించిన చిత్రం 'అమిగోస్'. రాజేంద్ర రెడ్డి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది. ఇందులో భాగంగా సినిమా ప్రమోషనల్ యాక్టివిటీస్ జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన 'అమిగోస్' మూవీ టీజర్, సాంగ్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మంగళవారం ఈ సినిమా నుంచి సెకండ్ సాంగ్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది.

నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన 'ధర్మ క్షేత్రం' సినిమాలో ఎవర్ గ్రీన్ మెలోడి సాంగ్ 'ఎన్నో రాత్రులొస్తాయిగానీ..' సాంగ్‌కి ఇది రీమిక్స్. 'ధర్మ క్షేత్రం'లో ఈ పాటను ఎస్.పి.బాలసుబ్రమణ్యం పాడారు. యాధృచ్చికంగా ఇప్పుడు అదే పాటకు రీమిక్స్ సాంగ్‌ను ఆయన తనయుడు ఎస్.పి.బి.చరణ్ ఆలపించారు. ఈ క్లాసిక్ సాంగ్‌ను ఎస్.పి.బి.చరణ్‌తో పాటు సమీర భరద్వాజ్ పాడారు. ఇళయ రాజా అందించిన ఈ ట్రాన్సింగ్ ట్యూన్ మనల్ని మరో ప్రపంచంలోకి తీసుకెళ్ళడం ఖాయం.

ఈ వీడియో సాంగ్ కళ్యాణ్ రామ్, ఆషికా రంగనాథ్ మధ్య సాగే బ్యూటీఫుల్ రొమాన్స్‌ను చక్కగా ఎలివేట్ చేస్తుంది. చక్కటి ట్యూన్‌కి తగ్గ సాహిత్యం, విజువల్స్ ఆడియెన్స్ కళ్లకు ట్రీట్‌లాగా ఉంది. శాండిల్ వుడ్ బ్యూటీ ఆషికా రంగనాథ్ ఈ మెలోడి మ్యూజిక్‌లో మరింత అందంగా కనిపిస్తుంటే.. కళ్యాణ్ రామ్ స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకున్నారు. బెస్ట్ సాంగ్స్ ప్లే లిస్ట్‌లో ఈ రీమిక్స్ సాంగ్ స్థానం దక్కించుకుంటుందనటంలో ఏ మాత్రం సందేహం లేదు అని చిత్ర బృందం దీమా వ్యక్తం చేసింది.

జిబ్రాన్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి 10న భారీ ఎత్తున విడుదల చేస్తున్నారు.



మోహన్ చెరుకూరి, మూర్తి కెఎస్, చిరంజీవి, మృణాల్ ఠాకూర్, నాని, శౌర్యువ్


ఘనంగా నాని కొత్త సినిమా ప్రారంభం

నాని 30వ చిత్రానికి నూతన దర్శకుడు శౌర్యువ్ దర్శకత్వం వహించనున్నారు. మోహన్ చెరుకూరి (సివిఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, మూర్తి కెఎస్ ఈ చిత్రాన్ని వైర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై భారీ ఎత్తున, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో నిర్మించనున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఈ సినిమా గ్రాండ్‌గా ప్రారంభమైంది.

నానిపై చిత్రీకరించిన ముహూర్తం షాట్‌కు చిరంజీవి క్లాప్ కొట్టగా, అశ్వినీదత్ కెమెరా స్విచాన్ చేశారు. బుచ్చిబాబు, కిషోర్ తిరుమల, హను రాఘవపూడి, వశిష్ఠ, వివేక్ ఆత్రేయ కలిసి తొలి షాట్‌కి దర్శకత్వం వహించారు. అంతకుముందు విజయేంద్ర ప్రసాద్ ప్రొసీడింగ్స్ ప్రారంభించడానికి మేకర్స్‌కి స్క్రిప్ట్‌ను అందజేశారు.

పలాస కరుణ్ కుమార్, గిరీష్ అయ్యర్, దేవకట్టా, చోటా కె నాయుడు, సురేష్ బాబు, దిల్ రాజు, 14 రీల్స్ గోపి- రామ్ ఆచంట, ఎకె అనిల్ సుంకర, మైత్రి రవి, డివివి దానయ్య, స్రవంతి రవి కిషోర్, కెఎస్ రామారావు, సాహు గారపాటి, ఏషియన్ సునీల్, అభిషేక్ అగర్వాల్, నిహారిక కొణిదెల, కళ్యాణ్ దాసరి తదితరులు ఈ ప్రారంభోత్సవ వేడుకకు అతిథులుగా హాజరయ్యారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ నేడు (బుధవారం) హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. మృణాల్ ఠాకూర్ ఈ చిత్రంలో నానికి జోడిగా నటించనున్నారు. ఈ చిత్రంలో కొంతమంది ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు.

ఈ చిత్రానికి దర్శకుడు: శౌర్యువ్, డీవోపీ: సాను జాన్ వర్గీస్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, ప్రొడక్షన్ డిజైనర్: జోతిష్ శంకర్, ఎడిటర్: ప్రవీణ్ ఆంటోని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : ఈవీవీ సతీష్, క్రియేటివ్ ప్రొడ్యూసర్ : భాను ధీరజ్ రాయుడు.



బెవిలిన్ భరాజ్

రాణిస్తాననే నమ్మకం ఉంది

ముంబైకి చెందిన ప్రముఖ ఫ్యాషన్ మోడల్ బెవిలిన్ భరాజ్ తెలుగు సినిమా రంగంలో హీరోయిన్‌గా తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు సినీ రంగానికి కేంద్రబిందువైన హైదరాబాద్‌కి వచ్చారు.

ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, 'మాది ముంబైలో వ్యాపార కుటుంబం. సోలార్ ఎనర్జీ బిజినెస్‌లో 'రే ఫోర్స్ గ్రీన్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్' కంపెనీని నిర్వహిస్తున్నాం. నేను ఈ సంస్థలో డైరెక్టర్‌గా పని చేస్తున్నాను. ఫ్యాషన్ మోడలింగ్‌లో అడుగుపెట్టి మంచి విజయం సాధించాను. ఇంటర్నేషనల్ స్థాయిలో పాపులారిటీ సంపాదించాను. ఈ రంగంలో నాకు మంచి పేరు, స్టార్ డమ్ ఉంది. ఇప్పుడు సినిమాల్లో నటించడానికి కూడా మా పేరెంట్స్ ఎంతో ప్రోత్సహిస్తున్నారు. నేను నటనలో, డాన్సులో, ఫైట్స్‌లో శిక్షణ పొందాను. సినిమాలు అంటే చాలా ఇష్టం. తెలుగు సినిమాలు రెగ్యులర్‌గా చూస్తూ ఉంటాను. 'బాహుబలి, పుష్ప, ఆర్ఆర్ఆర్' వంటి సినిమాలు తెలుగు సినిమాని జాతీయ స్థాయికి చేర్చాయి. తెలుగు సినిమాలు చేయాలనుకుంటున్నాను. ఇక్కడ పలువురు దర్శక, నిర్మాతలను కలిశాను. హీరోయిన్, నెగిటివ్ షేడ్స్ ఉన్న హీరోయిన్, యాక్షన్ హీరోయిన్... ఇలా ఏ పాత్ర ఇచ్చినా న్యాయం చేస్తాను. బాలీవుడ్‌లో మా బంధువులు, స్నేహితులు చాలామంది పెద్ద స్థాయిలో ఉన్నారు. అయితే వారిలో ఎవరి పేరు ఉపయోగించుకోకుండా స్వశక్తితో నా కెరీర్‌ని నిర్మించుకోవాలి అనుకుంటున్నాను. అందుకే వారి పేర్లు చెప్పడం లేదు. హాలీవుడ్ హీరోయిన్‌లాగా కనిపించడం నాకు బాగా ప్లస్ అవుతుందని భావిస్తున్నాను. త్వరలోనే మంచి సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తాను' అని చెప్పారు.

అల్లంత దూరాన రిలీజ్‌కి రెడీ



హ్రితిక శ్రీనివాస్, విశ్వ కార్తికేయ

గతంలో బాలనటుడిగా, ఆ తర్వాత హీరోగా మెప్పించిన విశ్వ కార్తికేయ తాజాగా నటించిన సినిమా 'అల్లంత దూరాన'. ఇందులో ఆయనకు జోడీగా నటి ఆమని మేనకోడలు హ్రితిక శ్రీనివాస్ నటించింది.

చలపతి పువ్వల దర్శకత్వం వహించారు. ఆర్.ఆర్. క్రియేటివ్ కమర్షియల్ పతాకంపై కోమలి సమర్పణలో నిర్మాత ఎన్.చంద్రమోహన రెడ్డి తెలుగు, తమిళ భాషలలో నిర్మించారు. ఈ సినిమా అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకుని ఈనెల 10న విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సందర్భంగా నిర్మాత ఎన్.చంద్రమోహనరెడ్డి మాట్లాడుతూ, 'తెలుగులో విడుదల తర్వాత మంచి డేట్ చూసుకుని తమిళంలో కూడా ఈ సినిమాను విడుదల చేస్తాం. కథ,కథనాలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ తీసిన సినిమా ఇది. హైదరాబాద్‌తో పాటు కార్వేటినగరం, పుత్తూరు, తిరుపతి, ఆర్.కె.వి.పేట, కేరళ, చెన్నై, పాండిచ్చేరి తదితర లోకేషన్లలో షూటింగ్ చేశాం. తెలుగుతో పాటు కొందరు ప్రముఖ తమిళ నటీనటులు కూడా ఇందులో నటించారు' అని చెప్పారు.

'ఇదొక ఫీల్ గుడ్ లవ్ స్టోరీ. చాలా క్వాలిటీగా చిత్రాన్ని తీశాం. నిర్మాత సంపూర్ణ సహకారంతోనే ఓ మంచి చిత్రాన్ని తీయగలిగాం. రాంబాబు సాహిత్యం, రధన్ సంగీతం అందరినీ హత్తుకునేలా చేస్తాయి. ఇప్పటికే పాటలు అందరినీ అలరింపజేస్తున్నాయి. కళ్యాణ్ ఛాయాగ్రహణం కనువిందు చేస్తుంది' అని దర్శకుడు చలపతి పువ్వల తెలిపారు.

హీరో విశ్వ కార్తికేయ మాట్లాడుతూ, 'ఇలాంటి మంచి చిత్రంలో నటించడం నా కెరీర్‌కు మంచి మలుపు అవుతుందని ఆశిస్తున్నాను. ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నందుకు చాలా హ్యాపీగా ఉంది' అని అన్నారు.

భాగ్యరాజా, అలీ, ఆమని, తమిళ్ జేపీ, తులసి, జార్జమేరియన్, అప్పాజీ, అనంత్ , ఇళవరసన్, డానియెల్, స్వామినాథన్, కృష్ణవేణి, నారాయణరావు, శివ తదితరులు నటించిన ఈ చిత్రానికి పాటలు: రాంబాబు గోశాల, ఎడిటింగ్: శివకిరణ్, డాన్స్: గోపి, ఫైట్స్: నాభ, ఆర్ట్: చంద్రమౌళి, రచన-దర్శకత్వం: చలపతి పువ్వల.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ప్రభుత్వ స్కూళ్లలో కార్పొరేట్ సౌకర్యాలు

- 12 రకాల మౌలిక సదుపాయాల కల్పన
- నేడు 'మన ఊరు-మన బడి' తొలి దశ పాఠశాలలు ప్రారంభం
- మిగతా స్కూళ్లలో పనులు పూర్తయ్యేదెన్నడో..



నవతెలంగాణ- మొఫిసిల్ యంత్రాగం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "మన ఊరు-మన బడి" మొదటి విడత పాఠశాలలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. తొలి దశలో పనులు పూర్తయిన పాఠశాలలు బుధవారం ప్రారంభం కాబోతున్నాయి. తరగతి గదులు, టాయిలెట్స్, తాగునీరు, డ్యూయల్ డెస్కులు, గ్రీన్‌చాక్ బోర్డు, కిచెన్‌షెడ్లు ఏర్పాటుతో పాటు బడికి అందమైన రంగులు వేసి ముస్తాబు చేశారు. దీనికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని గంభీరావుపేటలో పాఠశాలను మంత్రులు కేటీ రామారావు, పి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభిస్తారు. నల్లగొండ జిల్లా మునుగోడులో మంత్రి కేటీఆర్ హాజరు కానున్నారు. కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా అన్ని సౌకర్యాలను ప్రభుత్వ స్కూళ్లల్లో కల్పించినట్టు మంత్రి సబిత తెలిపారు.రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం తీసుకొచ్చిన పథకం మన ఊరు-మన బడి-మన బస్తీ. రాష్ట్రంలోని 26,065 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య, నమోదు, హాజరుతోపాటు పాఠశాల విద్యను ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించేందుకు వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 2021-22 బడ్జెట్‌లో రూ.7,289 కోట్లు కేటాయించింది. తొలి దశలో భాగంగా 9 వేలకు పైగా స్కూళ్లలో 12 రకాల మౌలిక సదుపాయల కల్పనకు రూ.3,497 కోట్లు కేటాయించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ స్కీమ్‌ను 'మన ఊరు-మన బడి' పేరుతో అమలు చేస్తుండగా.. పట్టణ ప్రాంతాల్లో 'మన బస్తీ-మన బడి' పేరుతో పనులు చేపట్టారు. 2022 మార్చిన 8న వనపర్తి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వేదికగా ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ఈ పథకాన్ని ప్రారంభించారు. మూడు దశల్లో మూడేండ్లపాటు విద్యా శాఖ పరిధిలో ఉన్న అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకోగా.. అందులో కొన్ని పాఠశాలల్లో వందశాతం పనులు పూర్తయ్యాయి. మరికొన్ని పాఠశాలల్లో వివిధ దశల్లో ఉన్నాయి. జిల్లాల వారీగా పరిశీలిస్తే..

ఉమ్మడి ఆదిలాబాద్‌లో 120 పాఠశాలలు ఆధునీకరణ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 35శాతం పాఠశాలను తొలిదశ కింద ఆధునీకరించేందుకు నిర్ణయించగా.. మండలానికి రెండు పాఠశాలల చొప్పున మోడల్ స్కూల్స్‌గా పరిగణనలోకి తీసుకొని అభివృద్ధి చేశారు. సుమారు 120 పాఠశాలల్లో ప్రభుత్వం సూచించిన 12అంశాలను మెరుగుపర్చారు.

ఉమ్మడి రంగారెడ్డి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 'మొదటి విడతలో 817 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో రంగారెడ్డి జిల్లాలో 446 ఉండగా, వికారాబాద్‌లో 371 ఉన్నాయి. మోడల్ స్కూళ్ల పేరుతో మొదటగా మండలానికి రెండు స్కూళ్లను ఎంపిక చేయాలని ప్రభుత్వం సూచించడంతో వికారాబాద్ 37 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో ప్రస్తుతం 14 పాఠశాలల నిర్మాణాలు పూర్తయ్యాయి. రంగారెడ్డి జిల్లాలో 54 స్కూళ్లను ఎంపిక చేయగా, ఇందులో ప్రస్తుతం 23 పూర్తయ్యాయి. ఇవి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

నల్లగొండ జిల్లాలో మొదటి విడతలో 517 పాఠశాలలను ఎంపిక చేశారు. మండలానికి రెండు పాఠశాల చొప్పున 62 మోడల్ పాఠశాలలు ఉన్నాయి. ఇప్పటివరకు 19 పాఠశాలలు పూర్తయ్యాయి. ఇందులో 13 పాఠశాలలు ఫిబ్రవరి ఒకటి, రెండో తేదీల్లో ఎమ్మెల్యేల చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. మునుగోడు మండల కేంద్రంలో మంత్రి కేటీఆర్ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించనున్నారు. సూర్యాపేట జిల్లాలో 92 పాఠశాలల ప్రాజెక్టు వర్క్ పూర్తి అయింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో 251 పాఠశాలలు ఎంపిక చేశారు. భువనగిరి పట్టణ కేంద్రంలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించనున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 3136 ప్రభుత్వ పాఠశాలున్నాయి. 82 పాఠశాలలను ఆధునీకరించారు. సిద్దిపేట జిల్లాలో 976 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. 241 పాఠశాలల్లో పనులు మొదలై వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. 35 పాఠశాలల్లో 100 శాతం పనులు పూర్తయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో 1262 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. తొలుత వంద శాతం పనులు పూర్తయిన 13 పాఠశాలల్ని ప్రారంభించనున్నారు. మెదక్ జిల్లాలో 898 ప్రభుత్వ పాఠశాలున్నాయి. 33 పాఠశాలల్లో వంద శాతం పనులు పూర్తయినందున నేడు ప్రారంభించనున్నారు.

హైదరాబాద్ జిల్లాలో మొదటి విడుతలో 239 పాఠశాలలను విద్యాశాఖ గుర్తించింది. గుర్తించిన 239 పాఠశాలలో వివిధ కారణాల వల్ల(అద్దె భవనాలు 25, ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్న పాఠశాలలు) పలు పాఠశాలల్లో పని ప్రారంభించలేకపోయారు. జిల్లాలోని 16 మండలాల్లో కలిపి 156 పాఠశాలల్లో పని ప్రారంభించారు. ఇందులో రెండు స్కూళ్లు మెహబూబియా గర్ల్స్, ప్రభుత్వ మోడల్ హైస్కూల్ ఆలియా బాయ్స్ స్కూళ్లను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి పనులు పూర్తి చేశారు. జీపీఎస్ లక్ష్మీనగర్ పికెట్, జీపీఎస్ మైలార్‌గూడ, జీపీఎస్ రాజ్‌భవన్ పాఠశాలలను మంత్రి శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభించనుండగా.. మరో నాలుగు స్కూళ్లు ఎమ్మెల్యేల చేత ప్రారంభించనున్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 120 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి.

నిజామాబాద్ జిల్లాలో మొత్తం 1200 స్కూళ్లున్నాయి. ఎంపికైన 407 స్కూళ్లను రెండు రకాలుగా విభజించారు. 30 లక్షల లోపు బడ్జెట్ అవసరమయ్యే స్కూళ్లు.. ఆపై బడ్జెట్ ఖర్చు చేయాల్సిన స్కూళ్లుగా విభజించారు. రూ.30 లక్షలలోపు బడ్జెట్‌లో 295 స్కూళ్లు ఉన్నాయి. ఈ 295 స్కూళ్లలోనే మెజార్టీ స్కూళ్లలో పనులు ప్రారంభమయ్యాయి. కొన్ని పూర్తయ్యాయి. మొదటి విడత పనులు ఇంత నెమ్మదిగా జరిగితే.. మిగిలిన స్కూళ్లలో పనులు ఎప్పుడు పూర్తి చేస్తారన్నది ప్రశ్నగా మిగిలింది.

బిజినెస్


టాప్-10 కుబేరుల నుంచి అదానీ ఔట్

- హిండెన్‌బర్గ్ భారీ దెబ్బ



ముంబయి : అదానీ గ్రూపు కంపెనీలు తీవ్ర మోసాలకు పాల్పడుతున్నాయని అమెరికన్ పరిశోధన సంస్థ హిండెన్‌బర్గ్ రిపోర్ట్ దెబ్బకు గౌతం అదానీ ఊహించని నష్టాలు చవి చూశారు. స్టాక్ మార్కెట్లలో వరుస భారీ నష్టాలతో అదానీ టాప్ -10 కుబేరుల జాబితాలో చోటు కోల్పోయారు. కేవలం మూడు రోజుల్లోనే లక్షల కోట్ల రూపాయల విలువను నష్టపోయారు. దీంతో ప్రపంచ కుబేరుల్లో మూడో స్థానం నుంచి ఏకంగా 11వ స్థానానికి దిగజారారని బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ మంగళవారం ఓ రిపోర్టులో తెలిపింది. 2023 జనవరి మాసంలో 36 బిలియన్ డాలర్ల (రూ.2.94 లక్షల కోట్లు) వ్యక్తిగత సంపదను నష్టపోయారు. ప్రస్తుతం ఆయన వ్యక్తిగత సంపద 84.4 బిలియన్ డాలర్ల (రూ.6.90 లక్షల కోట్లు)కు తగ్గిందని అని బ్లూమ్‌బర్గ్ తెలిపింది. మూడు సెషన్లలో అదానీ గ్రూప్ సంస్థలు 25 శాతం మార్కెట్ విలువను కోల్పోయాయని వెల్లడించింది. 2022లో అదానీ అత్యధికంగా రూ.3.2 లక్షల కోట్ల సంపదను కూడబెట్టుకున్నారు. లక్షల కోట్ల సంపద కోల్పోయినప్పటికీ.. ఇప్పటికీ అదానీ భారత ధనవంతుల్లో ఒక్కటో స్థానంలో ఉన్నారు. ముకేష్ అంబానీ రూ.6.7 లక్షల కోట్లతో రెండో స్థానంలో ఉన్నారు. ప్రపంచ కుబేరులతో పోల్చితే రిలయన్స్ అధినేత 13వ స్థానంలో ఉన్నారు. "అదానీ గ్రూపు సంస్థల ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన కుటుంబ సభ్యులు గడిచిన కొన్ని దశాబ్దాలుగా ఆ కంపెనీ షేర్లను మానిప్యులేషన్ చేస్తుంది. ఎకౌంట్స్‌లో మోసాలకు పాల్పడుతుంది. షేర్ల ధరలను కృత్రిమంగా పెంచింది. పన్ను ఎగవేత, మనీలాండరింగ్ మోసాల కోసం అనేక అడ్డదారులు తొక్కింది. అప్పుల కోసం మోసాలకు పాల్పడింది. మూడేళ్ల క్రితం అదానీ సంపద రూ.1.62 లక్షల కోట్లుగా ఉండగా.. ఇటీవల రూ.10 లక్షల కోట్ల చేరువకు వెళ్లింది. జాతీయవాదం పేరుతో దేశాన్ని క్రమపద్దతిలో దోచుకుంటుంది." అని హిండెన్‌బర్గ్ రిపోర్ట్ చేసిన విషయం తెలిసిందే.

ఎఫ్‌పీఓకు ఉద్యోగులు దూరం



అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీఓ)కు రిటైల్ ఇన్వెస్టర్లు దూరంగా ఉన్నారు. హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌తో ఇందులో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. జనవరి 31తో ముగిసిన ఈ ఇష్యూలో రిటైల్ ఇన్వెస్టర్లు, ఉద్యోగుల కోసం 2.29 కోట్ల షేర్లను కేటాయించగా.. 11 శాతం మాత్రమే సబ్‌స్క్రయిబ్ అయ్యాయి. అదానీ గ్రూపు కంపెనీల ఉద్యోగులు కూడా ఈ ఇష్యూకు దూరంగా ఉన్నారని రిపోర్టులు వస్తున్నాయి. ఉద్యోగులు తమకు కేటాయించిన 1.6 లక్షల షేర్లలో 52 శాతం షేర్లకు మాత్రమే బిడ్లు దాఖలు అయ్యాయి. ఈ ఎఫ్‌పిఒతో అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.20,000 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగా.. 4.55 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా.. 4.62 కోట్లకు బిడ్లు దాఖలయ్యాయి. నాన్ ఇన్స్‌ట్యూట్ ఇన్వెస్టర్లు, క్వాలిఫైడ్ ఇన్స్‌ట్యూషనల్ బయ్యర్స్ విభాగంలో ఎక్కువగా దరఖాస్తులు రావడంతో పూర్తిగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది.

ఓఎల్‌ఎక్స్‌లో 1500 మందిపై వేటు



న్యూఢిల్లీ : వాడిన ఉత్పత్తులను విక్రయించే ఆన్‌లైన్ వేదిక ఓఎల్‌ఎక్స్‌లో పని చేస్తున్న 1500 మంది ఉద్యోగులను ఇంటికి పంపించనున్నారు. ఆర్థిక మాంద్యం భయాల నేపథ్యంలో ఆ కంపెనీ తొలగింపులకు పాల్పడుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ సంస్థలో 10వేల మంది పని చేస్తుండగా.. ఇందులో 15 శాతం మందికి ఉద్వాసన పలికేందుకు ఆ సంస్థ సిద్ధం అవుతోంది. ఇందులో భారత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు సైతం ఉన్నారు. ఇంజినీరింగ్, ఆపరేషన్స్ టీమ్‌లో పనిచేసే ఉద్యోగులపైనా తొలగింపులు ఉండొచ్చని రిపోర్టులు వస్తున్నాయి. కాగా.. భారత్‌లో ఎంతమందిని తొలగిస్తున్నారనేది స్పష్టత రావాల్సి ఉంది.

బజాజ్ అలయన్జ్ 'మై హెల్త్ కేర్ ప్లాన్'

BAJAJ Allianz
Bajaj Allianz General Insurance

పూణె : ప్రయివేటు జనరల్ బీమా సంస్థల్లో ఒక్కటైన బజాజ్ అలయన్జ్ జనరల్ ఇన్సూరెన్స్ తాజాగా మాడ్యులర్ ఆరోగ్య బీమా ఉత్పత్తి 'మై హెల్త్ కేర్ ప్లాన్'ను విడుదల చేసినట్లు తెలిపింది. వినియోగదారుల అవసరాలకు తగినట్టుగా కవరేజీని ఎంచుకునే సౌలభ్యం దీనిలో ఉందని ఆ సంస్థ తెలిపింది. పాలసీదారులు సొంత ఆరోగ్య సంరక్షణ ప్లాన్‌ను డిజైన్ చేసుకునే స్వేచ్ఛ కూడా ఉందని పేర్కొంది. దీన్ని అంబ్రెల్లా ప్రొడక్ట్ కింద విడుదల చేసినట్లు వెల్లడించింది. ఈ పథకంలో రూ.5 కోట్ల వరకూ సమ్ ఇన్సూర్ చేసే అవకాశం ఉన్నదని తెలిపింది.

అమేజాన్ ఫ్రెష్‌పై ఆఫర్స్

న్యూఢిల్లీ : అమెజాన్ ప్రైమ్ కస్టమర్స్ రూ.1200పైన ఆర్డర్, సాధారణ వినియోగదారుల కనీస ఆర్డర్ ర.1500 పైన పలు ఆఫర్లను అందిస్తున్నట్లు అమెజాన్ ఫ్రెష్ తెలిపింది. ఈ ఆర్డర్‌పై రూ.200 క్యాష్ బ్యాక్, రూ.249కి పైగా అన్ని ఆర్డర్స్‌పై ప్రైమ్ కస్టమర్స్ ఉచిత డెలివరీ పొందవచ్చని పేర్కొంది. పలు బ్యాంక్ కార్డులపై డిస్కౌంట్లను అందిస్తున్నట్లు తెలిపింది.

నూతన ఇన్నోవా క్రిస్టా బుకింగ్స్ ప్రారంభం



న్యూఢిల్లీ : టయోటా కిర్లోస్కర్ మోటర్ (టికెఎం) తాజాగా తమ నూతన ఇన్నోవా క్రిస్టా కోసం బుకింగ్స్‌ను ప్రారంభించినట్లు మంగళవారం ప్రకటించింది. ఈ నూతన ఇన్నోవా క్రిస్టా ఆధునీకరించబడిన ఫ్రంట్ ఫాసియాతో వస్తుందని పేర్కొంది. ఇది భారతీయ కుటుంబాలు, వ్యాపారవేత్తలు, కార్పోరేట్స్, ఫ్లీట్ యజమానుల అవసరాలను తీర్చనుందని తెలిపింది. తమ డీలర్ లేదా అవుట్‌లెట్, ఆన్‌లైన్‌లో రూ.50వేలు చెల్లించి బుక్ చేసుకోవచ్చని తెలిపింది. ఈ నూతన ఇన్నోవా క్రిస్టా నాలుగు గ్రేడ్లలో ఐదు రంగులో అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది.

వీఐ నుంచి రూ.99 ప్యాక్

VI Together for Tomorrow

హైదరాబాద్ : ప్రయివేటు టెలికం కంపెనీ వొడాఫోన్ ఐడియా (వీఐ) కొత్తగా రూ.99 ప్యాక్‌ను విడుదల చేసింది. వినియోగదారులు డిజిటల్ ఇండియా వృద్ధిలో పాల్గొనేందుకు ఇది తోడ్పడనుందని ఆ కంపెనీ పేర్కొంది. దీంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సర్కిల్‌లోని వినియోగదారులు ఫుల్ టాక్‌టైమ్, 200 ఎంబీ డాటాను 28 రోజుల గడువుతో అందిస్తున్నట్లు పేర్కొంది. అట్టడుగు వర్గాల ప్రజలకు సైతం చేరువకావాలనే ఉద్దేశంతో దీన్ని ఆవిష్కరించినట్టుపేర్కొంది.

కోల్ ఇండియా లాభాల్లో 70% వృద్ధి

కోల్‌కత్తా : ప్రభుత్వ రంగంలోని కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 70 శాతం వృద్ధితో రూ.7,755.55 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.4,558.39 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ3లో కంపెనీ ఉత్పత్తి పెరగడంతో పాటు డిమాండ్, అధిక అమ్మకాలు మెరుగైన ఫలితాలకు దోహదం చేశాయి. క్రితం క్యూ3లో కంపెనీ రెవెన్యూ రూ.35,169 కోట్లకు చేరింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.28,433 కోట్లుగా చోటు చేసుకుంది.

ఎమ్మెల్సీ వెంకట్‌రామ్‌రెడ్డి నివాసం, కార్యాలయాలపై ఐటీ దాడులు

- ఇద్దరు బిల్డర్స్, మరో ఫార్మా కంపెనీపై కొనసాగుతున్న ఐటీ సోదాలు
- 50 ప్రాంతాల్లో ఏక కాలంలో దాడులు

నవతెలంగాణ - ప్రత్యేక ప్రతినిధి : రాష్ట్రంలో మరోసారి ఐటీ దాడులు కలకలం రేపాయి. ముఖ్యంగా, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వెంకట్‌రామ్ రెడ్డి నివాసం, కార్యాలయాలతో పాటు మరో ఇద్దరు బిల్డర్లు, ఒక ఫార్మా కంపెనీలపై కూడా ఐటీ దాడులు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో ఇటీవలన పలు ఫార్మా కంపెనీలు, బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థలపై దాడులు సాగించిన ఆదాయపు పన్ను శాఖ తాజాగా ఎమ్మెల్సీ వెంకట్ రామ్ రెడ్డికి చెందిన రాజ్‌పుష్ప బిల్డర్స్ కంపెనీపై మంగళవారం ఉదయం నుంచి దాడులు కొనసాగిస్తున్నది. దీంతో పాటు ముప్పా బిల్డర్స్, వర్టెక్స్ బిల్డర్స్, వసుధ ఫార్మాస్యూటికల్ కంపెనీ సంస్థల పైన ఐటీ అధికారులు దాడులు నిర్వహించి సోదాలు నిర్వహిస్తున్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన దాదాపు 50 మందికి పైగా ఐటీ అధికారులు బృందాలుగా విడిపోయి ఈ దాడులు కొనసాగిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లోని వెంకట్‌రామ్ రెడ్డి నివాసంతో పాటు హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయాల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. అలాగే, గచ్చిబౌలిలోని ముప్పా బిల్డర్స్ కార్పొరేటు కార్యాలయంతో పాటు నార్సింగిలో ముప్పా బిల్డర్స్ నిర్మించిన పలు విల్లాలు, కార్యాలయాల్లో ఐటీ సోదాలు సాగుతున్నాయి. అలాగే, మాదాపూర్‌లోని వసుధ ఫార్మాస్యూటికల్ కంపెనీ ప్రధాన కార్యాలయంలో ఐటీ అధికారుల సోదాలు సాగుతున్నాయి. వసుధ ఫార్మాస్యూటికల్‌కు చెందిన మరో పదిహేను కార్యాలయాల్లోనూ ఐటీ అధికారులు క్షుణ్ణంగా సోదాలు నిర్వహిస్తున్నారు. పై కంపెనీలకు చెందిన ఎండీలతో పాటు సీఈఓలు, ఇతర అధికారుల నివాసాల్లోనూ ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. పెద్ద ఎత్తున విల్లాల నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, కొత్త కొత్త వెంచర్లు వేయటం వంటి కార్యక్రమాలు సాగిస్తున్న ఈ సంస్థలు భారీ మొత్తంలో ఆదాయపు పన్ను ఎగవేతకు పాల్పడ్డట్టూ ఐటీ అధికారులు ఆరోపిస్తున్నారు. గతంలో కొన్ని రియల్‌ఎస్టేట్ వ్యాపార సంస్థలపై తాము జరిపిన దాడుల్లో లభించిన ఆధారాల మేరకు రాజ్‌పుష్ప, వర్టెక్స్, ముప్పా, వసుధ సంస్థలపై దృష్టిని సారించిన ఐటీ అధికారులు ఒకేసారి ఈ సంస్థల కార్యాలయాలపై మెరుపు దాడులకు వ్యూహరచన చేసి అమలు చేసినట్టు తెలిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని ప్రశ్నించి ఆయన ఆస్తులు, ఇతర వ్యాపారాల గురించి ఐటీ అధికారులు ఆరా తీసినట్టు తెలిసింది. ఈ దాడులలో ఐటీ అధికారులు పెద్ద ఎత్తున ఆయా సంస్థల నిర్మాణాలకు సంబంధించిన పత్రాలు, భూముల కొనుగోలుకు సంబంధించిన పత్రాలు, ఇతర వ్యాపారాలలో భారీగా పెట్టిన పెట్టుబడులకు సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. అయితే, ఈ దాడులలో నగదు, నగలను ఇంత వరకు తాము స్వాధీనం చేసుకోలేదని ఐటీ వర్గాలు తెలిపాయి. అయితే, ఈ దాడులు పూర్తి కాలేదనీ, మరో రెండ్రోజుల పాటు కొనసాగే అవకాశమున్నదని ఐటీ వర్గాలు వెల్లడించాయి. లభించిన బిల్డర్ల ఆస్తులకు సంబంధించిన పత్రాలు, డాక్యుమెంట్ల విలువ కోట్లాది రూపాయల్లోనే ఉంటుందని ఐటీ వర్గాలను బట్టి తెలుస్తున్నది. ఐటీ అధికారులు దాడులు సాగించిన సమయంలో వారి కార్యాలయాల్లోకి వెళ్లనీయకుండా ఆయా సంస్థల సెక్యూరిటీ సిబ్బంది అడ్డుపడింది. అయితే ఐటీ అధికారుల వెంబడి వచ్చిన సీఆర్పీఎఫ్ సిబ్బంది సిబ్బంది అడ్డును బలవంతంగా తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కాసానికి మాతృవియోగం

నవతెలంగాణ -హైదరాబాద్

టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ మాతృమూర్తి కౌసల్య(93) అనారోగ్యంతో మరణించారు.గత నెల రోజులుగా ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి కన్నుమూశారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు కాసాని స్వగ్రామం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లిలో ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

చంద్రబాబు సంతాపం

కౌసల్య మరణం పట్ల ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు ఎన్.చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, అరవింద్‌కుమార్‌గౌడ్, పార్టీ సమన్వయకర్త కంభంపాటి రామ్మోహన్‌రావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. కాసానికి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అంత్యక్రియలకు చంద్రబాబు హాజరు కానున్నారని ఆ పార్టీ నేతలు చెప్పారు.

గురుకులం సీఓఈసెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీల్లో 2023-24 విద్యా సంవత్సరం ఇంటర్ మొదటి సంవత్సరం సీఓఈ సెట్ అడ్మిషన్ల దరఖాస్తు గడువును పొడిగించినట్టు ఆసంస్థ ప్రకటించింది. ఈ నెల నాలుగు వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నట్టు గురుకులాల కార్యదర్శి రొనాల్డ్‌రాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

3న శాసనసభ, మండలి సమావేశాలు ప్రారంభం

- నోటీఫికేషన్ విడుదల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శాసనసభ, శాసనమండలి సమావేశాలు శుక్రవారం ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం 12.10 గంటలకు అసెంబ్లీ హాల్‌లో ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర రాజన్ ప్రసంగిస్తారు. ఈ మేరకు గవర్నర్ పేరిట అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి నరసింహాచార్యులు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు.

జాతీయవాదం పేరుతో దేశానికి పెనుముప్పు

- దళిత జర్నలిస్టుల ప్రాతినిధ్యంతోనే సామాజిక మార్పు : మీడియా అకాడమి చైర్మెన్ అల్లం నారాయణ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మీడియా సంస్థల్లో దళిత జర్నలిస్టుల ప్రాతినిధ్యంతోనే సామాజిక మార్పు సాధ్యమని మీడియా అకాడమి చైర్మెన్ అల్లం నారాయణ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో జనవరి 31,1920లో మూక్ నాయక్ పత్రిక ఏర్పడిందనీ, ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని హెూటల్ హరిత ప్లాజాలో ఇంటర్నేషనల్ దళిత్ జర్నలిస్ట్ నెట్‌వర్క్ కన్వీనర్ (ఐడీజేఎన్) మల్లెపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో మొదటి అంతర్జాతీయ దళిత్ మీడియా దినోత్సవం నిర్వహించారు. అల్లం నారాయణ, ఉన్నత విద్యామం డలి చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రి, సీనియర్ పాత్రికే యులు కె.రామచంద్రమూర్తి, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ కృష్ణ, ఇఫ్లూ ప్రొఫెసర్ సంతోష్ హాజరై ప్రసంగించారు. అల్లం నారాయణ మాట్లాడుతూ.. మీడియా సంస్థల్లో దళి తుల ప్రాతినిధ్యం తక్కువగా ఉందనీ, పత్రికారం గంలో దళిత జర్నలిస్టులు అత్యంత వివక్షను ఎదు ర్కొన్న సందర్భాలు ఉన్నాయని వివరించారు. అందు కు ఆక్స్ ఫామ్, న్యూస్ రూం రిపోర్టుల అధ్యయనాల నివేదికలు వెల్లడించిన అంశాలే నిదర్శన మని చెప్పారు. జాతీయవాదం పేరుతో దేశానికి పెను ముప్పు ముంచుకొస్తున్నదని అణగారివర్గాలు చైతన్య వంతమై ఎదుర్కొనేందుకు బీసీలు, దళితులు, మహి ళలు, ఆదివాసీలు, మైనార్టీలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. ప్రధాన స్రవంతిలోని పత్రికల్లో దళిత జర్నలిస్టుల సంఖ్య చెప్పుకోదగినవిధంగా లేదనీ, ఆ వర్గాల సంఖ్య ఇంకా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. బుద్ధవనం స్పెషల్ ఆఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ.. మీడియాలో గతంలో దళిత జర్నలిస్టులను వెతుకులాడుకునే పరిస్థితి ఉండేదనీ, తెలంగాణ ఏర్పాటు అనంతరం ఆ పరిస్థితి మారిందన్నారు. కానీ గుర్తింపులేని పత్రికలు, యూట్యూబ్ ఛానళ్లలో గుర్తింపులేని జర్నలిస్టులుగానే మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రధాన మీడియా సంస్థల్లో దళితుల ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరముందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బుద్ధవనం ప్రాజెక్టు విశేషాల గురించి వీడియో చిత్రీకరణ ద్వారా ప్రముఖ ఆర్కియాలజిస్ట్ ఈమని శివనాగి రెడ్డి వివరించారు.

ఒకేసారి ఆన్‌లైన్ మూల్యాంకనం వద్దు

- ఇంటర్ విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనంలో ఒకేసారి ఆన్‌లైన్ విధానం చేపట్టొద్దని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఇంటర్ జవాబు పత్రాలకు సంబంధించి ఒకేసారి అన్ని పేపర్లనూ ఆన్‌లైన్ మూల్యాంకనం చేపట్టాలన్న ఇంటర్ బోర్డు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 35 లక్షల జవాబు పత్రాలను ఈ పద్ధతిలో మూల్యాంకనం చేయడం వల్ల పొరపాట్లు జరిగే అవకాశం లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో గ్లోబరీనా సంస్థ టెండర్ తీసుకున్న సందర్భంలో మాన్యువల్ పద్ధతిలో మూల్యాంకనం చేస్తేనే ఫలితాల్లో గందరగోళం ఏర్పడి విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో సరైన శిక్షణ లేకుండా అన్ని పేపర్లు దిద్దడానికి కంప్యూటర్లతోపాటు అవకాశాలపై అవగాహన కల్పించకుండా మూల్యాంకనం చేయడమంటే విద్యార్థులు నష్టపోయే అవకాశముందని తెలిపారు. విద్యాశాఖ మంత్రి కేవలం లాంగ్వేజ్ సబ్జెక్టులకే ఆన్‌లైన్ మూల్యాంకనం చేపడతామంటూ ప్రకటించారని పేర్కొన్నారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి మాత్రం లాంగ్వేజ్‌లతోపాటు ఆర్ట్స్, కామర్స్ (హ్యుమానిటీస్), ఒకేషనల్ సబ్జెక్టుల జవాబు పత్రాలకు కూడా ఆన్‌లైన్ మూల్యాంకనం చేపడతామని ప్రకటించారని వివరించారు. ప్రస్తుతానికి ఆన్‌లైన్ మూల్యాంకనాన్ని లాంగ్వేజ్ సబ్జెక్టు వరకే పరిమితం చేసి భవిష్యత్‌లో దశలవారీగా విస్తరించాలని వారు సూచించారు. విద్యార్థులకు నష్టం లేని చర్యలు తీసుకోవాలని కోరారు.

భారీ భద్రత మధ్య డెక్కన్ మాల్ కూల్చివేత

- ఒక్కసారిగా కూలిన 6 అంతస్తులు
- 60 శాతం భవనం నేలమట్టం



నవతెలంగాణ-సిటీబ్యూరో

సికింద్రాబాద్ రాంగోపాల్‌పేటలో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన డెక్కన్ మాల్ భవనం ఆరు అంతస్తులు ఒక్కసారిగా కూలిపోయాయి. అధికారులు కొన్ని రోజులుగా భారీ భద్రత నడుమ భవనం కూల్చివేత పనులు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే, మంగళవారం పనులు జరుగుతున్న క్రమంలో ఆరు అంతస్తుల భవనం ఒక్కసారిగా 60 శాతం కుప్పకూలింది. చుట్టుపక్కల ఇండ్ల వారిని ముందే అధికారులు ఖాళీ చేయించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ నెల 19న ఆరు అంతస్తుల భవనంలో అగ్నిప్రమాదం జరిగి ముగ్గురు గల్లంతైన సంగతి తెలిసిందే. ఇందులో ఒకరి ఆచూకీ మాత్రమే లభ్యం కాగా మరో ఇద్దరి అచూకీ ఇంత వరకు తెలియరాలేదు. ఈ భవనం మంటల్లో కాలిపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దాంతో మాలిక్ ట్రేడింగ్ అండ్ డిమాలిషన్ అనే సంస్థకు అధికారులు కూల్చివేత కాంట్రాక్టు పనులు అప్పగించారు. 26వ తేదీ నుంచి కూల్చివేత పనులను ప్రారంభించారు. మంగళవారం మధ్యాహ్నం తర్వాత వెనుక వైపు మిగిలి ఉన్న భాగంలో పిల్లర్లను కూల్చారు. ఈ క్రమంలో ఆరు అంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. దాంతో పెద్దఎత్తున ధుమ్ము, దూళి ఆ ప్రాంతంలో కమ్ముకుంది. ముందు జాగ్రత్త చర్యలుగా పక్కనే ఉన్న కాచిబోలి బస్తీతో పాటు కొన్ని అపార్ట్‌మెంట్ల వాసులను అధికారులు అక్కడి నుంచి తరలించారు. అయితే ఎల్ ఆకారంలో ఉన్న ఈ భవనం ప్రధాన రహదారి నుంచి వెనుక వైపు వరకు మొత్తం కూల్చివేయగా, భవనానికి కుడి వైపున ఉన్న భాగం మాత్రం అలాగే ఉంది. కూల్చివేత పనులు మూడు రోజుల్లో పూర్తి చేస్తామని మాలిక్ ట్రేడింగ్, డిమాలిషన్ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

సాగునీటి ప్రాజెక్టులపై గెజిట్‌ను రద్దుచేయించాలి

- రిటైర్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ డిమాండ్
- రజత్‌కుమార్‌కు వినతి



నవతెలంగాణ-హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల ప్రాజెక్టులను కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ పరిధిలోకి తీసుకురావాలంటూ 2021లో ఇచ్చిన గెజిట్‌ను వెంటనే రద్దుచేయించాలని తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈమేరకు ఆ సంఘం అధ్యక్షులు ఇంజినీర్ ఎం. శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇంజినీర్ టి. వెంకటశం మంగళవారం రాష్ట్ర సాగునీటి, ఆయకట్టు అభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ రజత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, గెజిట్, పునర్విభజన చట్టం తదితర అంశాలకు సంబంధించి సవివర వినతిపత్రం సమర్పించారు. గెజిట్ మూలంగా పునర్విభజన చట్టం ఉల్లంఘనకు గురవుతున్నదని గుర్తు చేశారు. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ స్పందించి కేంద్రం నుంచి అమెండ్‌మెంట్‌ను తెచ్చుకుందని చెప్పారు.రాష్ట్రం నుంచి వెంటనే స్పందించాలని రజత్‌కుమార్‌ను కోరారు. గెజిట్‌లో పేర్కొన్న అంశాలన్నీ తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు కేంద్రం ఆలస్యంగా అనుమతులు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. ఏపీ అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గెజిట్‌ను రద్దుచేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. సుప్రీంకోర్టులో ఉన్న కేసును ఉపసంహరించుకోవడం కూడా తెలంగాణకు నష్టం చేసిందన్నారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశాలు పెట్టి సాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కరెంటు కోతలపై రైతుల ఆగ్రహం

పంటల బీమా, రుణమాఫీకి అమలుకు డిమాండ్

- రైతుల భారీ ప్రదర్శన.. కలెక్టరేట్ ఎదుట ధర్నా : రైతులను ఆదుకోవాలి : పోతినేని





నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కరెంట్ కోతలు, పంటల బీమా, రుణమాఫీ తదితర సమస్యలపై తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు మంగళవారం ఖమ్మంలో పెద్దఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆర్డీవో కార్యాలయం నుంచి నూతన కలెక్టరేట్ వరకు రైతులు భారీ ప్రదర్శనగా వెళ్లి నూతన కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట బైటాయించారు. కరెంటు కోతలు ఎత్తివేసి పగటిపూట నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, ఎండిపోతున్న పంటలను కాపాడాలని కోరారు.

ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడారు. రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో యాసంగి సీజన్‌లో లక్ష ఎకరాల్లో మొక్కజొన్న సాగు అయిందన్నారు.

కరెంటు కోతలతో మక్కతో పాటు వరి, మిర్చి పంటలు ఎండిపోతున్నాయన్నారు. పది రోజులుగా రైతులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఒకవైపు ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటలు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు ప్రకటిస్తుంటే.. మరోవైపు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండి ప్రభాకరరావు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరాలో నియంత్రణ చేస్తామని, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఆటో స్టార్టర్లు బిగిస్తామని ప్రకటన చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎండీ ప్రకటనతోపాటు విద్యుత్ కోతలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంటల బీమా పథకంలో లోపాలు ఉన్నాయనే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం సమగ్ర పంటల బీమా పథకం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

అందుకు అవసరమైన నిధులు రాష్ట్ర బడ్జెట్లో కేటాయించాలని కోరారు. గత రెండు సీజన్లలో జిల్లాలో లక్షల ఎకరాల్లో మిర్చి పంట తామర వైరస్, వేరుకుళ్ళుడుతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. దెబ్బతిన్న మిర్చికి ఎకరాకు లక్ష రూపాయల పరిహారం అందించాలని కోరారు. రైతు రుణమాఫీ అమలు చేయకపోవడం వల్ల అధిక వడ్డీ భారం రైతుపై పడుతోందని చెప్పారు. ఈ బడ్జెట్లో నిధులు కేటాయించి రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సీజన్ ఆరంభం నుంచి పత్తి ధర తగ్గిందన్నారు. క్వింటాల్ రూ.6వేలు కూడా లేకపోవడంతో పత్తిని మార్కెట్‌లో అమ్ముకోలేక రైతులు ఇండ్లల్లోనే నిల్వ ఉంచారన్నారు. క్వింటాల్‌కు రూ.12 వేల ధర నిర్ణయించి సీసీఐ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు నున్నా నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, ఉపాధ్యక్షులు తాతా భాస్కరరావు, వాసిరెడ్డి ప్రసాద్, సహాయ కార్యదర్శులు చింతనిప్పు చలపతిరావు, ఎస్కే మీరా, దుగ్గి కృష్ణ, శీలం పకీరమ్మ, బిక్కసాని గంగాధర్, భూక్యా లక్ష్మా, తూళ్ళూరి రమేష్, చెరకుమల్లి కుటుంబరావు, ఉమా, సుదర్శన్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లు, స్థలాలు దక్కే వరకు పోరాటం

- రాష్ట్ర వ్యాప్తంగా 22 సెంటర్లలో భూ పోరాటం
- ఫిబ్రవరి 9న ఇందిరాపార్కు వద్ద ధర్నా: ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



గుడిసెల దగ్గర మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

నవతెలంగాణ - అమరచింత

ఇండ్లు, ఇండ్ల స్థలాలు దక్కే వరకు ఈ పోరాటం ఆపే ప్రసక్తే లేదని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. వనపర్తి జిల్లా అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని దుంపాయికుంటలో కొనసాగుతున్న భూపోరాటం మంగళవారానికి 135 రోజులకు చేరుకున్నది. మల్లు లక్ష్మి గుడిసెవాసులకు మద్దతు తెలిపి మాట్లాడారు. అమరచింత మండల కేంద్రంలో పోరాట స్ఫూర్తితోనే పేదలు ఇక్కడ గుడిసెలు వేసుకొని పోరాటానికి దిగారని చెప్పారు. పోరాడితేనే ఏదైనా సాధించుకోవచ్చు అనే పట్టుదలతో గుడిసెలు వేసుకున్నారన్నారు. ఈ పట్టుదల.. పోరాటం సమస్య పరిష్కారం అయ్యే వరకు.. మన ఇండ్లు మనకు దక్కే వరకు ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గతంలో ఎర్రజెండా నీడలో చాలాచోట్ల సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పేదలు పోరాడి.. ఇండ్ల స్థలాలు సాధించుకున్నారని గుర్తుచేశారు. స్థలం ఉన్న ప్రతి ఒక్కరికీ ఇండ్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు ఇస్తామని ఎన్నికలప్పుడు చెప్పి.. ఇప్పుడేమో మూడు లక్షలే ఇస్తామనడం సరైంది కాదన్నారు. స్థలం ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాల్లో పెట్టాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగానే ఫిబ్రవరి 3న మండల కేంద్రాల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేసి వినతిపత్రాలు ఇవ్వనున్నట్టు చెప్పారు. అయినా ప్రభుత్వం స్పందించకుంటే 9న ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి, జిల్లా కార్యదర్శి లక్ష్మి, నాయకులు సాయి లీల, ఆకాశ వేణి, అనంతమ్మ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జిఎస్ గోపి పాల్గొన్నారు.

స్కాలర్ షిప్ రెన్యూవల్స్‌కు మార్చి 31వరకు గడువు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థుల పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిపుల రెన్యూవల్స్, కొత్తగా నమోదుకు గడువును ప్రభుత్వం పొడిగించింది. మార్చి 31వరకు అవకాశం ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి టి విజయకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ పాస్ పోర్టల్ ద్వారా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలి

భద్రాచలం మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు

నవతెలంగాణ - గోవిందరావుపేట / ఏటూర్‌నాగారం



ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెల స్థలాలకు పట్టాలు ఇచ్చి పక్కా గహాలు నిర్మించివ్వాలని భద్రాచలం మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు అన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రా గ్రామంలో సర్వే నెంబర్-109లో నిరుపేదలు వేసుకున్న గుడిసెలను మంగళవారం బాబురావు సందర్శించి వారితో మాట్లాడారు. ఏజెన్సీ ఏరియాలో గిరిజనులు, ఇతర పేదలు గూడు కోసం గుడిసెలు వేసుకుంటే భూమి వారికే చెందుతుందని చెప్పారు. దొంగ కాగితాలతో, అక్రమ పట్టాలతో భూస్వాములు భూమి మీదకు వస్తే పేదలు ఐక్యంగా తరిమి కొట్టాలని సూచించారు. 5వ షెడ్యూల్ ప్రకారం 1956 నుంచి ప్రభుత్వ భూమిగా ఉన్న 109 సర్వే నంబర్‌లో పవర్ ఆఫ్ పట్టా చెల్లదని, పుల్యాల కృష్ణారెడ్డి ఏనాడూ కాస్తులో లేడని అన్నారు. ఈ భూమిపై 25 ఏండ్లుగా సీపీఐ(ఎం) పోరాటాలు నిర్వహిస్తోందని చెప్పారు. పార్టీ, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో 18 ఏండ్లు అంగడి నిర్వహించిందన్నారు. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై కృష్ణారెడ్డి అక్రమ పట్టా పొందాడని, పట్టా ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2022 జూన్‌లో ఐటీడీఏ పీఓ ఇచ్చిన తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని, వారికి అక్కడే పక్కా ఇండ్లు ప్రభుత్వం నిర్మించివ్వాలని కోరారు. వాస్తవంగా ఈ భూమి 1956 నుంచి ప్రభుత్వ భూమిగా ఉందని చెప్పారు. అనంతరం సర్వే నంబర్ 109లోని ప్రభుత్వ స్థలంలో ఎస్టీ పేదలు 500 మంది, ఇతరులు గుడిసెలు వేసుకున్నారని, వారికి పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరుతూ ఐటీడీఏ పీఓ అంకిత్‌కు వినతిపత్రం అందజేశారు. పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను, భూమి యదార్థ పరిస్థితిని పీఓకు వివరించారు. 109సర్వే నెంబర్‌లోని 10 ఎకరాలు 1985 నుంచి 2006 వరకు గ్రామపంచాయతీ ఆధీనంలో ఉందన్నారు. దీనిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న భూస్వాములపై, అక్రమ పట్టాలు ఇచ్చిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, నాయకులు పోదిల్లా చిట్టిబాబు, ఎండి దావూద్, జిమ్మ జ్యోతి, పాయం శారద, చాప పద్మ, జజ్జరి కృష్ణవేణి, తీగల ఆదిరెడ్డి, పొదిల్ల చిట్టిబాబు, అంబాల పోశాలు, మురళి, పాయం శారద, సరిత పల్లపు, రాజు, జిట్టెబోయిన రమేష్, సొహెల్, రాంబాబు తదితరులు ఉన్నారు.

నల్లగొండలో బీఆర్ఎస్‌కు వామపక్షాల పొత్తు కలిసొస్తుంది..

- శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- చట్ట సభల పని దినాలు తగ్గిపోవటం ఆందోళనకరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్‌కు వామపక్షాల పొత్తు కలిసొస్తుందని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. తద్వారా తమ పార్టీకి ఎక్కువ స్థానాలొస్తాయంటూ ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని శాసన మండలి ప్రాంగణంలో గుత్తా మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈనెల 14 వరకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగే అవకాశముందని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ మధ్య వివాదం సర్దుకుంటుందంటూ తాను ముందే చెప్పానని వ్యాఖ్యానించారు. తమిళనాడు తరహా సంఘటనలు ఇక్కడ జరగబోవని భావిస్తున్నానని అన్నారు. అక్కడి గవర్నర్ ప్రసంగం మాదిరిగా ఇక్కడి గవర్నర్ ప్రసంగం ఉండబోదని అభిప్రాయపడ్డారు. అయితే అన్ని రాష్ట్రాల్లోని గవర్నర్లు కేంద్రం చెప్పినట్టే వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో గవర్నర్ ప్రసంగం సాఫీగా సాగాలని ఆకాంక్షించారు. గవర్నర్‌తో విభేదాలు వస్తాయి.. పోతాయని అన్నారు. దేశవ్యాప్తంగా చట్టసభలు నడిచే సమయం తగ్గిపోవటం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాదికి 60 రోజులపాటు సభలు నడవాలనే అంశంపై గతంలో పెద్ద చర్చే కొనసాగిందని గుత్తా ఈ సందర్భంగా గుర్తు చేశారు. కొన్ని రాష్ట్రాల్లో రాజకీయ శూన్యత ఉందనీ, అందువల్ల బీఆర్ఎస్‌కు జాతీయ స్థాయిలో ఆదరణ కచ్చితంగా దక్కుతుందంటూ ఆశాభావం వ్యక్తం చేశారు. తన కుమారుడు వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నారనీ, అయితే పోటీ చేయాలా..? వద్దా..? అనేది పార్టీ నిర్ణయం ప్రకారమే ఉంటుందని చెప్పారు.

నిజామాబాద్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

- ఎంపీ అర్వింద్‌కు పీయూసీ చైర్మెన్ జీవన్‌రెడ్డి సవాల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిజామాబాద్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..? అంటూ పీయూసీ చైర్మెన్ ఆశన్నగారి జీవన్‌రెడ్డి... బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు సవాల్ విసిరారు. ఆయన కళ్లుండి కూడా రాష్ట్రంలోని అభివృద్ధిని చూడలేక పోతున్నారని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో జీవన్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ... మంత్రి కేటీఆర్‌ను విమర్శించే స్థాయి అర్వింద్‌కు లేదన్నారు. ఆయన తండ్రి డీఎస్‌నుద్దేశించి కేటీఆర్ గౌరవంగా మాట్లాడితే... దాన్ని కూడా అర్వింద్ జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు. వాస్తవాలను మరుగుపరిచి రాష్ట్ర ప్రభుత్వంపైనా, ముఖ్యమంత్రి కేసీఆర్‌పైనా ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

నేటినుంచి సర్కారు బడుల్లో బోధన బంద్

- భాషాపండితుల సహాయనిరాకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు బుధవారం నుంచి పాఠాలు చెప్పబోమంటూ పండిత, పీఈటీ జేఏసీ ప్రకటించింది. భాషాపండితులు సహాయ నిరాకరణ చేస్తున్నారు. ఈ మేరకు జేఏసీ ప్రతినిధులు స్టీరింగ్ కమిటీ సభ్యులు సి జగదీశ్, ఎండీ అబ్దుల్లా, చక్రవర్తుల శ్రీనివాసులు, నర్సిములు, క్రాంతికృష్ణ, గౌరీ శంకర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ మొదలైందని తెలిపారు. కానీ పండితులు, పీఈటీల పదోన్నతులపై కోర్టు కేసు పేరుతో మొండిచేయి చూపిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ పెద్దలు ఈ సమస్యపై దృష్టి సారించి సమస్య పరిష్కారానికి ఉన్న మార్గాలను అన్వేషించాలని సూచించారు. ప్రత్యేక ఆర్డినెన్స్ తేవాలనీ, కోర్టు తుది తీర్పునకు లోబడి పదోన్నతులు కల్పించడం ద్వారా పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి గ్రేడ్-2 భాషాపండితులకు పదోన్నతుల్లో న్యాయం చేయాలని తెలిపారు.

మారింది పార్టీ పేరు మాత్రమే.. డీఎన్ఏ పాతదే!

బండి, ఈటల ఢిల్లీ నుంచి నయాపైసా తీసుకొచ్చారా?

- నిధులు పారిస్తానని ప్రగల్భాలు పలికి.. రూపాయి తేలే..
- ఈ దేశానికి బీజేపీనే అరిష్టం
- తండ్రిలాంటి నాయకుని పట్టుకుని నిందలా? : ఐటీ శాఖ మంత్రి కేటీఆర్
- కమలాపూర్‌లో విద్యార్థులతో కలిసి భోజనం



మాట్లాడుతున్న కేటీఆర్



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / జమ్మికుంట/కమలాపూర్

'తెలంగాణ రాష్ట్ర సమితి.. భారత రాష్ట్ర సమితిగా పేరు మాత్రమే మారింది. పార్టీ గుర్తు, డీఎన్ఏ పాతదే. బండి సంజయ్, ఈటల రాజేందర్ ఢిల్లీ నుంచి నయా పైసా తీసుకొచ్చారా? చేసే పని ఏమీ లేక, చేయాల్సిన పని చేయకుండా మా ప్రభుత్వంపై బురదజల్లే పనే పెట్టుకున్నారు. ఈ హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఈటల రాజేందర్‌ను పరిచయం చేసి ఇంతటి నాయకునిగా ఎదిగే అవకాశం కల్పించింది కేసీఆర్ కాదా?. తండ్రిలా రాజకీయ జీవితాన్ని ఇచ్చిన కేసీఆర్ పాలన అరిష్టమంటూ ఈటల మాట్లాడటం సిగ్గు చేటు' అని ఇటు ఐటీశాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. కరీంనగర్ జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం జిల్లా కేంద్రంలోని కేసీఆర్ సర్క్యూట్ రెస్ట్‌హౌజ్ (కేసీఆర్) భవనాన్ని, పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కమలాపూర్, జమ్మికుంటలో పర్యటించారు. జమ్మికుంటలో నిర్వహించిన సభలో మంత్రి ప్రసంగించారు.

'14 నెలల కిందట జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించారు. రూ.3వేల పింఛన్ ఇస్తామన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను తీసుకొచ్చి నియోజకవర్గానికి నిధులు పారిస్తామని ప్రగల్భాలు పలికారు. ఆ రోజు ఈటల చెప్పిన మాటలు ఏమయ్యాయి. కనీసం రూపాయి తీసుకురాలేదు' అని ఈటల రాజేందర్‌పై మంత్రి విమర్శలు గుప్పించారు. 2004లో ఇదే నియోజకవర్గం నుంచి 33 మంది పోటీ పడితే ఈటలకు కేసీఆర్ టికెట్ ఇచ్చి రాజకీయ జన్మ ఇచ్చారని చెప్పారు. తల్లిపాలు తాగి రొమ్ముగుద్దినట్టు.. తండ్రిలాంటి కేసీఆర్‌ను, ఆయన ప్రభుత్వాన్ని అరిష్టమంటూ మాట్లాడటం తగునా? అని ప్రశ్నించారు. ఈ దేశానికి అరిష్టం బీజేపీ, ఆ పార్టీ నేతలే అంటూ విమర్శించారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని కేంద్రంలోని బీజేపీ సర్కారు మాట ఇచ్చిందన్నారు. జన్‌ధన్ ఖాతాల్లో కూడా రూ.15లక్షలు వేస్తామన్నారని, చివరికి దేశ ప్రజల సంపదనంతా సంపన్నులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ అన్ని రకాల వస్తువులపైనా, సేవలపైనా జీఎస్టీ బాదుతూ ఆ పన్నుల రూపేణా వచ్చిన ఆదాయాన్ని ఏం చేశారని ప్రశ్నించారు. ప్రజల సొమ్ములతోనే హైవేలు నిర్మిస్తే టోల్‌చార్జీలు ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. 8ఏండ్లలో రూ.100లక్షల కోట్ల అప్పులు చేసిన మోడీని పట్టుకుని ఇక్కడి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దేవుడు అంటూ కొనియాడుతున్నారని, అసలు మోడీ ఎవరికి దేవుడు.. ఎందుకు దేవుడు ? అని ప్రశ్నించారు. గిరిజనులకు 6 నుంచి 10 శాతం రిజర్వేషన్లను కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం తీర్మానిస్తే మోడీ ప్రభుత్వం ఊసెత్తడం లేదని అన్నారు. 'ఢిల్లీలో ఏడాది పాటు నిరసన చేపట్టిన రైతుల్లో 700 మంది రైతులు చనిపోయినందుకా? లేక ఆకాశంలో అప్పులు.. పాతాళంలో రూపాయి ఉన్నందుకా? దేవుడు అంటూ ఎద్దేవా చేశారు. గుజరాతీల చెప్పులు నెత్తిన పెట్టుకునే ఇక్కడి వ్యక్తికి తెలంగాణ ఆత్మాభిమానం ఉందా? అని ప్రశ్నించారు.

హుజూరాబాద్‌కు వరాలు

జమ్మికుంట డిగ్రీ కళాశాల మైదానంలో స్టేడియం నిర్మాణానికి రూ.10కోట్లు, హుజూరాబాద్ క్రీడా ప్రాంగణానికి రూ.10కోట్లు ప్రకటించారు. ఇల్లందకుంట దేవస్థాన అభివృద్ధికి, వీణవంక మండలానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు..

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి కేటీఆర్ అన్నారు. హన్మకొండ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల, బాలుర రెసిడెన్షియల్ విద్యార్థులతో కలిసి మంత్రి కేటీఆర్ భోజనం చేశారు. విద్యార్థినులతో ముచ్చటించారు. అమ్మాయిలు గట్టిగా అడగాలని, మీరు అడిగితేనే ఏం చేయాలన్నది తమకు తెలుస్తుందని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్, మంత్రులు గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌ని ఎన్ఎస్‌యూఐ అడ్డగింత

కమలాపూర్ మండల కేంద్రంలో మంత్రి కాన్వాయ్‌కి అడ్డంగా దూసుకొచ్చారు. ఈ క్రమంలో ఆగ్రహించిన బీఆర్ఎస్ నేతలు వారిపై పోలీసుల సమక్షంలోనే దాడి చేశారు. వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. మంత్రి పర్యటనను అడ్డుకుంటారనే నెపంతో పలువురు కాంగ్రెస్ నేతలను సోమవారం రాత్రి అదుపులోకి తీసుకొని మడికొండ పోలీసు ట్రైనింగ్ కాలేజీకి తరలించారు.

ఏకకాలంలో రుణమాఫీకి కేంద్రబడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

- తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఏకకాలంలో రుణమాఫీ చేసేందుకు, రైతుల ఆత్మహత్యలను నివారించేందుకు కేంద్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. పార్లమెంటులో రాష్ట్రపతి దౌపతి ముర్ము తన ప్రసంగంలో వ్యవసాయం బాగా అభివృద్ధి చెందిందని చెప్పిన విషయాన్ని గుర్తు చేసింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన ఆర్థిక సర్వేలో మాత్రం వ్యవసాయ రంగానికి క్రమంగా నిధులు తగ్గిపోతున్నట్టు పేర్కొనట్టు తెలిపింది.ఇదే అంశంపై ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ ఎగుమతులు రూ. 5 లక్షల కోట్లకు పెరుగుతాయని చెప్పినప్పటికీ వాస్తవంగా వ్యవసాయోత్పత్తుల ఎగుమతి, దిగుమతుల్లో 2022-23లో రూ. మూడు లక్షల కోట్ల లోటు ఉన్నట్టు ఆర్థిక సర్వే పేర్కొన్న విషయాన్ని తెలిపారు. ఎమ్ఎస్‌పీ ద్వారా పెట్టిన పెట్టుబడికి మించి రైతులకు ఆదాయం వస్తున్నట్టు పేర్కొనడాన్ని తప్పుపట్టారు. అందులో రైతుల ఆత్మహత్యలు ఎందుకు జరుగుతున్నాయో చెప్పలేదని విమర్శించారు. వ్యవసాయోత్పత్తులను రూ. 5 లక్షల కోట్ల మేర విదేశాల నుంచి దిగుమతులు చేసుకుంటున్న క్రమంలో వ్యవసాయరంగం అభివృద్ధిలో ఉన్నదని చెప్పడం హాస్యాస్పదని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఎనిమిది శాతం కేటాయింపులు చేయడం ద్వారా వ్యవసాయ రంగాన్ని, హార్టికల్చర్ పంటలను అభివృద్ధి చేయడంతోపాటు రైతుల ప్రయోజనాలను కాపాడటం జరుగుతుందని తెలిపారు. పంట నష్ట పరిహారాన్ని చెల్లించడం ద్వారా రైతుల ఆత్మహత్యలను నివారించే అవకాశం ఉంటుందని సూచించారు.

బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమ్

- ప్రవీణ్ కుమార్‌పై ఆరోపణలు మానుకోవాలి: బహుజన్ సమాజ్ పార్టీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీకి బీఆర్ఎస్సే అసలైన బీ టీమ్ అని బహుజన సమాజ్ పార్టీ నేతలు డాక్టర్ వెంకటేష్ చౌహాన్, అరుణ క్వీన్ విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బీఎస్పీ అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై విషం కక్కుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో తమ బలపడడం చూసి బీఆర్ఎస్ భయపడుతున్నదని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ఓడిపోతామోనన్న భయంతో ఆ పార్టీ నేతలు ఉన్నారని తెలిపారు. తాము కవిత మాదిరిగా లిక్కర్ స్కాం చేసి అరెస్టు కాకుండా లోపాయికారి ఒప్పందం చేసుకోలేదని విమర్శించారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎస్పీగా ఉన్న సమయంలో ఎన్ కౌంటర్లు చేశారనే ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేశారు. వేలాది మంది మావోయిస్టులను ఆయన జనజీవన స్రవంతిలో కలిపారనీ,గురుకులాల కార్యదర్శిగా లక్షలాది మంది విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు.

టీఎస్ఆర్టీసీ విజిలెన్స్ ఎస్పీగా సంగ్రామ్‌సింగ్ పాటిల్

- శుభాకాంక్షలు తెలిపిన సజ్జనార్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) విజిలెన్స్ విభాగం ఎస్పీగా ఐపీఎస్ అధికారి డాక్టర్ సంగ్రామ్‌సింగ్ పాటిల్ బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ బస్‌భవన్‌లోని తన ఛాంబర్‌లో మంగళవారంనాడాయన ఈ బాధ్యతలు చేపట్టారు. ములుగు ఎస్పీగా ఉన్న ఆయనను టీఎస్ఆర్టీసీ విజిలెన్స్ ఎస్పీగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించింది. అనంతరం ఆయన మర్యాదపూర్వకంగా సంస్థ ఎమ్‌డీ వీసీ సజ్జనార్‌ను కలిశారు. ఈ సందర్భంగా సజ్జనార్ ఆయనకు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్థ అభివద్ధి కోసం మంచి ఐపీఎస్ అధికారిని టీఎస్ఆర్టీసీకి నియమించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కతజ్ఞతలు తెలిపారు. స్వయంగా డాక్టర్ అయిన సంగ్రామ్‌సింగ్ సేవలను తార్నాక ఆస్పత్రిలో సౌకర్యాల మెరుగుదల, సిబ్బంది సంక్షేమానికి వినియోగించుకుంటామని చెప్పారు. మహారాష్ట్రలోని పండరీపూర్‌కు చెందిన సంగ్రామ్‌సింగ్ పాటిల్ 2015 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. తెలంగాణ కేడర్‌కు చెందిన ఆయన మొదట భద్రాచలం ఏఎస్పీగా పని చేశారు. నాలుగేండ్లుగా ములుగు ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లాకు రెండేండ్లు ఇంచార్జీ ఎస్పీగా పనిచేశారు. స్వయంగా డాక్టర్ అయిన సంగ్రామ్‌సింగ్ ఏజెన్సీలోని ఆదివాసీలకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్వయంగా వైద్యం అందించేవారు. పోలీసింగ్‌లో చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆయన్ని అంత్రిక్ సేవా పతకం ద్వారా సత్కరించింది.

ఏసీబీ వలలో 'ఉపాధి' అధికారి

- రిమ్స్‌లో ఉద్యోగాల కోసం కాంట్రాక్టర్ నుంచి లంచం
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- మరో ఇద్దరు అధికారులూ..

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాల్సిన జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి లంచం డబ్బులకు కక్కుర్తిపడి అడ్డంగా దొరికిపోయారు. ఆయనతోపాటు ఆ శాఖ జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి, రిమ్స్‌లో జూనియర్ అసిస్టెంట్ కూడా ఈ అవినీతిలో భాగస్వాములు కావడం చర్చనీయాంశమైంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో మంగళవారం అధికారులు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధకశాఖ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ భద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రిమ్స్ ఆస్పత్రిలో దుర్గం సొసైటీ ద్వారా 24మందికి పొరుగు సేవలు(పేషెంట్‌కేర్) ఉద్యోగాల కోసం క్లియరెన్సు(అలాట్‌మెంట్ కాపీ) కోసం సదరు కాంట్రాక్టర్ జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కిరణ్ కుమార్‌ను సంప్రదించారు. అలాట్‌మెంట్ కాపీ ఇవ్వాలంటే రూ.3లక్షల వరకు ఇచ్చుకోవాలని సదరు అధికారి డిమాండ్ చేశారు. అంతగా ఇవ్వలేనని కాంట్రాక్టర్ ప్రాధేయపడగా రూ.2.25లక్షలకు ఒప్పందం కుదిరింది. దీంతో ఈనెల 25న కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మంగళవారం సదరు గుత్తేదారు ఆ డబ్బులను ఎంప్లాయిమెంట్ కార్యాలయానికి తీసుకెళ్లి రిమ్స్ జూనియర్ అసిస్టెంట్ తేజకు అందించగా.. ఈయన ఉపాధి కల్పనశాఖ జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి విజయలక్ష్మికి అందించారు. ఆమె ఆ శాఖ ఉన్నతాధికారి కిరణ్‌కు సంబంధించిన డెస్కులో పెట్టారు. అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు కార్యాలయానికి వెళ్లి పట్టుకున్నారు. అయితే, ఫిర్యాదు ప్రకారం కిరణ్‌కుమార్‌ను పట్టుకోగా, విజయలక్ష్మి, తేజ ప్రమేయం కూడా బయటపడింది. ముగ్గురి వేలిముద్రలను కెమికల్ టెస్ట్ చేయగా.. పాజిటివ్ రిపోర్ట్ వచ్చింది. ఏ1 కిరణ్, ఏ2 తేజ, ఏ3 విజయలక్ష్మిపై కేసు నమోదు చేసి కరీంనగర్‌లోని ఏసీబీ స్పెషల్ కోర్టులో హాజరు పర్చనున్నట్టు డీఎస్పీ తెలిపారు.

మాతృభాష పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

- తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరు గౌరీశంకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాష పరిరక్షణ కోసం చట్టం చేసిందనీ, మాతృభాష పరిరక్షణ కోసం కట్టుబడి ఉందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరు గౌరీశంకర్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల స్థాయి నుంచి తెలుగును తప్పనిసరిగా అధ్యయనం చేయాల్సిందేనని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలకు ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు.సీఎం కేసీఆర్ చొరవతోనే తెలుగును తప్పని సరిచేయటంతో తెలుగు సాహితీమూర్తులు చేసిన సాహిత్య సేవలను, కృషిని ఈతరం అధ్యయనం చేస్తున్నదని చెప్పారు.

హైదరాబాదులో శాండోస్ ప్రపంచ సామర్థ్య కేంద్రం

- అభినందించిన మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

లైఫ్ సైన్సెస్ దిగ్గజ కంపెనీ శాండోస్ హైదరాబాద్‌లో ప్రపంచ సామర్థ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. 1,800 మంది ఉద్యోగులతో జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లేబరేటరీని ఏర్పాటు చేస్తున్నామని ఆ సంస్థ సీఈవో రిచర్డ్ సేనోర్ తెలిపారు. ఈ కేంద్రంలో తొలుత 800 మంది ఉద్యోగులు, ఆతర్వాత దశలవారీగా వీరి సంఖ్యను 1800కు పెంచుతామని వివరించారు. ఈ మేరకు మంగళవారం ఆయన తన ప్రతినిధి బృందంతో కలిసి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావును కలిశారు. ఈ ప్రతిపాదన పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఫార్మాసిటీలో తయారీ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని కోరారు.

బడ్జెట్‌లో ఆర్టీసీకి రెండుశాతం నిధులు కేటాయించాలి



- టీఎస్ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఆర్టీసీకి రెండుశాతం నిధులు కేటాయించాలని టీఎస్ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. జేఏసీ సమావేశం మంగళవారంనాడిక్కడి ఎంప్లాయిస్ యూనియన్ ఆఫీసులో చైర్మెన్ కే రాజిరెడ్డి అధ్యక్షతన జరిగింది. కన్వీనర్ వీఎస్ రావు, కో కన్వీనర్ కత్తుల యాదయ్య, బీ జక్రయ్య, పీ రవీందర్‌రెడ్డి, ఎన్ బుద్ధవిశాల్, కే గంగాధర్ హాజరయ్యారు. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. రెండు వేతన సవరణల అమలు కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖలు రాసిన ప్రభుత్వం అవి పూర్తయ్యి 70 రోజులు గడిచినా పట్టించుకోకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఆర్టీసీలో వెల్ఫేర్ కమిటీలను రద్దు చేసి, యూనియన్లను అనుమతించి, తక్షణం గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీసీఎస్, పీఎఫ్, ఎస్‌బీఎస్ బకాయిలు చెల్లించాలనీ, కార్మికులపై పనిభారాలు తగ్గించి, వేధింపులు నిరోధించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్ చొరవ తీసుకోవాలనీ, మంత్రులు కేటీఆర్, టీ హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్‌లతో కలిసి, అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

భద్రతకు ప్రాధాన్యతివ్వండి

- సీఎస్ శాంతకుమారి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన సచివాలయం భవన సముదాయ ప్రారంభోత్సవం, ఫార్ములా ఈ-రేసింగ్ ఏర్పాట్లలో భద్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ఈనెల 11న ఫార్ములా ఈ-రేసింగ్, 17న నూతన సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా మంగళవారంనాడామె బీఆర్కే భవన్‌లో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీజీపీ అంజనీకుమార్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విండ్ కుమార్, ఐటి శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు, నగర పోలీస్ కమీషనర్ సీవీ ఆనంద్, ఎస్పీఎఫ్ డీజీ ఉమేష్‌షరాఫ్, అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్, ఫైర్ సర్వీసుల డీజీ నాగిరెడ్డి, ఇంటలిజెన్స్ అడిషనల్ డీజీ అనిల్‌కుమార్, ఈఎన్సీ గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో భద్రతాపరంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఫిబ్రవరి 11న జరిగే ఫార్ములా ఈ-రేస్ నిర్వహణ సందర్భంగా తెలుగుతల్లి ఫ్లై ఓవర్ నుంచి ఖైరతాబాద్ ఫ్లై ఓవర్ వరకు, మింట్ కాంపౌండ్ నుంచి ఐ-మాక్స్ వరకు రోడ్లను ఫిబ్రవరి 5వతేదీ నుంచి మూసివేయాలని నిర్ణయించారు. ఈ రూట్లలో ట్రాఫిక్‌ను అనుమతించరు. నూతన సచివాలయ ప్రారంభోత్సవంలో పోలీసు, రోడ్లు, భవనాలు, జీఏడీ, తెలంగాణ స్పెషల్ పోలీస్, ఐటీ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. భద్రత కోసం మూడు కంపెనీల తెలంగాణ స్పెషల్ పోలీస్, 300 మంది సిటీ పోలీసు అధికారులను నియమించాలని నిర్ణయించారు. సిటీ ట్రాఫిక్ విభాగం నుంచి 22 మంది అధికారులను కూడా భద్రతా ఏర్పాట్లలో భాగస్వాములను చేస్తారు. బ్యాగేజ్ స్కానర్లు, వెహికిల్ స్కానర్లు, బాడీ స్కానర్లు, ఇతర పరికరాలను సమకూర్చుకోవాలనీ, మొత్తం 28 ఎకరాల్లో 9.42 చ.అ. విస్తీర్ణంలో నిర్మించిన నూతన సచివాలయంలో 560 కార్లు, 900లకు పైగా ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు సదుపాయం కల్పిస్తారు. సచివాలయం చుట్టూ ఆరు సెంట్రీ పోస్టులు, 300 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. దీనికోసం ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు. సచివాలయంలోకి వచ్చి వెళ్లే సందర్శకులకు ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు ఇస్తారు. 34 మంది సిబ్బందితో రెండు ఫైర్ ఇంజన్లు, 6వ అంతస్తు మినహా అన్ని అంతస్తులకు సందర్శకులకు పరిమితమైన అనుమతి ఇవ్వాలని నిర్ణయించారు.

రబీ కరెంట్ డిమాండ్ 15,500 మెగావాట్లు ఏర్పాట్లు చేయండి

- సమీక్షా సమావేశంలో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో వచ్చే వేసవి నాటికి 15,500 మెగావాట్లకు మించి గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదయ్యే అవకాశం ఉన్నదని విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి చెప్పారు. ఎక్కడా ఎలాంటి అవాంతరాలు లేకుండా ఉండేలా విద్యుత్ సంస్థలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే టీఎస్-ఎస్పీడీసీఎల్‌లో 1,601 పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. మంగళవారంనాడాయన విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ జీ రఘుమారెడ్డితోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఏడాది రబీ సీజన్‌లో 14,160 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదైందనీ, అలాగే 2022 డిసెంబర్ 30వ తేదీ 14,017 మెగావాట్లుగా నమోదైందని చెప్పారు. కరెంట్ డిమాండ్ ఎంత పెరిగినా రాష్ట్రంలో నిరంతర సరఫరాతో, పంటలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పెరుగుతున్న పారిశ్రామిక అభివద్ధి, గృహ వినియోగదారుల పెరుగుదల, వ్యవసాయ రంగానికి చేస్తున్న ఉచిత విద్యుత్ సరఫరా నేపథ్యంలో ఈసారి డిమాండ్ భారీగా పెరుగుతుందనే అంచనా ఉందన్నారు. అలాగే దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో ఖాళీగా ఉన్న 1,553 జూనియర్ లైన్‌మెన్ పోస్టులు, 48 అసిస్టెంట్ ఇంజనీర్/ ఎలక్ట్రికల్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశించారు.

ప్రగతి లేని పద్దులు






దేశ బడ్జెట్ కాస్తా థీమ్ బడ్జెట్‌గా మార్పు

- ప్రతిఏటా కొత్త థీమ్‌తో కేంద్ర బడ్జెట్.. మోడీ జమానాలో పాలన తీరు...

కేంద్రంలో మోడీ సర్కార్ వచ్చాక...దేశ బడ్జెట్ కాస్తా థీమ్ బడ్జెట్ గా మారిపోయింది. గతంలో బడ్జెట్ లను ప్రవేశపెట్టేటపుడు ఒక దిశ,దశ ఉండేది. కాస్తో కూస్తో ఆర్థిక సర్వేలకు దగ్గరగా కేంద్ర బడ్జెట్ ఉండేది. దానికి తగినట్టు దేశ ప్రగతి ఉండేది. కానీ బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేండ్లలో బడ్జెట్ లో చెప్పిన దానికి విరుద్ధంగా ఉంటోందని ఆర్థిక విశ్లేషకులు అంటున్నారు.

థీమ్ బడ్జెట్ అంటే..



అన్ని రంగాల కన్నా..ఏదో ఒక రంగం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించటాన్ని థీమ్ బడ్జెట్ ఉద్దేశం. దేశభక్తి ,అంతరిక్షం యాత్ర ఇలా కొన్ని రంగాలను తెరపైకి తేవటం ..దేశ ప్రజల్ని ఆ మత్తులో ముంచేయటమే బీజేపీ సర్కార్ ఎత్తుగడ. ఇంతకు ముందు సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ అన్నది. కానీ అది ఎంతవరకు సక్సెస్ అయ్యిందో జనానికి తెలుసు. ఇక డీమోనిటైజేషన్‌లో వ్యాపారం మునిగిపోయాయి. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. అయితే మోడీ ప్రభుత్వం మాత్రం దేశం వెలుగుతోందని ప్రచారం చేసుకుంటోంది. మొత్తం మీద గత కొన్నేళ్లుగా దేశ బడ్జెట్ థీమ్ ఆధారితంగా వస్తోంది.

డిజిట్ ఆల్ అంటూ ముందుకు..

ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో ఒక నిర్దిష్ట రంగంపై దృష్టి సారిస్తోంది. తద్వారా ఆ ప్రాంతంలో అవసరమైన అభివృద్ధి చేయవచ్చని బీజేపీ చెప్పుకుంటోంది. గతంలో ఇలా థీమ్ బడ్జెట్ లు ప్రవేశపెట్టినా..అవి ఉల్టా పుల్టా అయ్యాయని కేంద్రం ఇచ్చే గణాంకాలే ధ్రువీకరిస్తున్నాయి. అయితే ఈసారి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'డిజిటల్' థీమ్‌పై బడ్జెట్‌ను సమర్పించనున్నారు. గత కొన్నేళ్లుగా బడ్జెట్ థీమ్‌ను పరిశీలిస్తే, కొన్నిసార్లు బడ్జెట్‌ను మహిళా కేంద్రంగా, కొన్నిసార్లు 'స్వయం సమృద్ధి భారత్' థీమ్‌తో విడుదలయ్యాయి., కొన్నిసార్లు 'డిజిటల్ ఇండియా' థీమ్‌తో విడుదలైంది.

తొమ్మిదేండ్లుగా మోడీ ప్రభుత్వంలో సమర్పించిన బడ్జెట్ థీమ్..తీరు తెన్నులు..

బడ్జెట్ థీమ్‌ను ప్రవేశపెట్టిన తర్వాత, అదే రంగం సవాళ్లలో చిక్కుకున్నది. ఆ రంగం సంక్షేమం ఊహించబడింది. అయితే రానున్న కాలంలో ఇదే రంగానికి అత్యంత దారుణమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. కొన్నిసార్లు అంతర్జాతీయ సవాళ్ల కారణంగా, కొన్నిసార్లు అంటువ్యాధుల కారణంగానో గాడి తప్పాయి. మోడీ ప్రభుత్వ బడ్జెట్ థీమ్ గతి మారింది.లక్ష్యాల మార్గం నుంచి తడబడింది.

మొదటి బడ్జెట్ థీమ్- 'సబ్ కా సాథ్-సబ్ కా వికాస్



2014లో మోడీ ప్రభుత్వం తొలి బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ థీమ్- "సబ్ కా సాథ్-సబ్ కా వికాస్", అయితే ఇది జరిగిన వెంటనే దేశవ్యాప్తంగా మైనారిటీలపై దాడులు జరిగాయి. 2015లో దాద్రీలో అఖ్లాక్ హత్యాకాండ, చర్చిలపై దాడులు జరిగాయి. అసహనంపై దేశవ్యాప్తంగా ఆగ్రహ జ్వాలలు ఎగిసిపడ్డాయి. ఆ తర్వాత జేఎన్‌యూ వివాదం రాజుకుంది. వీటన్నింటికి నిరసనగా సాహితీవేత్తలు, మేధావులకు కేంద్రం ఇచ్చిన అవార్డులను వాపస్ చేశారు. 'సబ్ కా సాథ్-సబ్ కా వికాస్ ' నినాదం వచ్చిన ఒక సంవత్సరంలోనే దేశంలో పై పరిస్థితులు దాపురించాయి.

రెండో బడ్జెట్‌లో నల్లధనాన్ని అరికట్టడం.. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'

2015 ఫిబ్రవరి 28న మోడీ ప్రభుత్వం రెండో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఈసారి చాలా థీమ్స్‌లో కలర్ ఫుల్ మూవీని తలపించింది.. ఇందులో ప్రధానంగా 'నల్లధనంపై నియంత్రణ', 'మేక్ ఇన్ ఇండియా' , 'వ్యాపారాన్ని సులభతరం చేసేందుకు తీర్మానం' ప్రధానమైనవి. కానీ ఆ మరుసటి సంవత్సరమే దేశంలో పెద్దనోట్ల రద్దు అమలులోకి వచ్చింది, ఆర్థిక వ్యవస్థ చితికిపోయింది. సామాన్య, మధ్యతరగతి జనం బతుకులు రోడ్డున పడ్డాయి.

'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ' (సీఎంఐఈ) అంచనా ప్రకారం, పెద్ద నోట్ల రద్దు చేసిన మొదటి 1 నెలలో చిన్న పరిశ్రమలు దాదాపు రూ. 1.5 లక్షల కోట్ల నష్టాన్ని చవిచూశాయి. చాలా కంపెనీలు పూర్తిగా మూసివేయక తప్పలేదు. ఈ ఏడాది బడ్జెట్‌లో 'నల్లధనం'పై ప్రధానంగా దృష్టి సారించిన ఫలితం కూడా అంతంతే. నల్లధనాన్ని వెనక్కి తీసుకురావడం నోట్ల రద్దు లక్ష్యం కాదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. వాస్తవానికి మోడీ ఎన్నికలపుడు నల్లధనాన్ని తెచ్చి దేశ ప్రజల ఖాతాల్లో వేస్తామంటే....జన్‌ధన్ ఖాతాలు తెరిచి...ఏండ్ల తరబడి ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇంతవరకూ ఒక్క పైసా కూడా పడలేదు.

మూడో బడ్జెట్‌లో రైతులకు ప్రాధాన్యత ..



2016-17 సంవత్సరానికి గానూ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌ను సమర్పించారు. ఈ బడ్జెట్‌లో రైతులు కేంద్రంగా నిలిచారు. వచ్చే ఐదేండ్లలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐదేండ్లు పూర్తి కాకముందే, ఈ థీమ్ మరుగున పడింది.

సర్కారు వారి పాట మాత్రం 2016-17 బడ్జెట్‌ను 'గ్రామ-పేద-రైతు' బడ్జెట్‌గా పేర్కొన్నారు. కానీ 2020లో ఆర్డినెన్స్ ద్వారా మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చారు. దీనికి నిరసనగా రైతులు రోడ్లపైకి వచ్చారు. 2021 నాటికి ఉద్యమం విస్తృతమైంది.. ప్రభుత్వానికి, రైతులకు మధ్య పెద్ద వివాదమే చెలరేగింది.గల్లీ నుంచి ఢిల్లీ దాకా రైతులు ఆందోళనలతో మోడీ సర్కార్ దిగిరాక తప్పలేదు.

నాల్గవ బడ్జెట్‌లో ఇన్‌ఫ్రా ... డిజిటల్ ఎకానమీకి ప్రాధాన్యత

ఆర్థిక మంత్రిగా అరుణ్ జైట్లీకి 2017-18 బడ్జెట్ నాలుగో బడ్జెట్. ఈ బడ్జెట్‌లో ఆరోగ్య సంరక్షణ, విద్య, ఉపాధి,సూక్ష్మ చిన్నమధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ)ఇన్‌ఫ్రా రంగం , నిర్మాణాత్మక సంస్కరణలపై దృష్టి సారిస్తున్నామన్నారు.

కానీ కోవిడ్ వచ్చిన మూడేండ్ల తర్వాత, దేశంలోని మౌలిక సదుపాయాలు దానిని నిర్వహించడానికి సరిపోవని స్పష్టమైంది. ఆస్పత్రి నుంచి శ్మశాన వాటిక వరకు పెద్ద ఎత్తున లైన్లు కనిపించాయి.

2018-19 బడ్జెట్‌లో 'ఆయుష్మాన్ భారత్ యోజన' ...కరోనాలో పని చేయలేదు

ఆర్థిక మంత్రిగా అరుణ్ జైట్లీకి 2018-19 బడ్జెట్ (చివరి బడ్జెట్.) ఈ బడ్జెట్‌లో 'ఆయుష్మాన్ భారత్ యోజన' ప్రకటించారు. 10 కోట్ల కుటుంబాలకు ఏడాదికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ పథకం 2019-20 నాటికి పూర్తిగా అమలు చేయబడుతుందని భావించారు, అయితే 2020-21లో కోవిడ్ యొక్క రెండు తరంగాలు ఆరోగ్య బీమా సహకరించలేదు. కోవిడ్‌లో చాలా ఆస్పత్రులు ఈ పథకం ప్రయోజనాలను ఇవ్వడానికి నిరాకరించాయి. మరోవైపు, కోవిడ్ సమయంలో సర్కారు దవాఖానాల్లో పడకలు, ఆక్సిజన్,మందుల కోసం దేశ ప్రజలు ఎంతగానో అవస్థలు పడ్డారు. తమవాళ్లను కోల్పోయ్యారు.

లోక్‌సభ ఎన్నికల ముందు బడ్జెట్... రైతులకు ప్రతి ఏటా ఆరువేలు ఇస్తాం

2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు పీయూష్ గోయల్ మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' పథకం మినహా ఎలాంటి ప్రధాన విధాన నిర్ణయం తీసుకోలేదు.

దీని కింద దేశంలోని చిన్న సన్నకారు రైతులకు ప్రతి సంవత్సరం 6 వేల రూపాయల నగదు, ఇవ్వాలని నిర్ణయించారు.

కొత్త ప్రభుత్వం మొదటి బడ్జెట్ ప్రసంగంలో, ధనవంతులపై పన్ను గురించి చర్చ. ప్రపంచంలో రెండవ అత్యంత సంపన్నుడు భారతదేశం నుంచి బయటకు వచ్చాడు.

పూర్తికాల మహిళా ఆర్థికమంత్రిగా నిర్మలా..

2019-20లో మోడీ ప్రభుత్వం 2.0లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.. ఈ బడ్జెట్‌లో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి సంపన్నులకు ఎక్కువ పన్ను చెల్లించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ధనిక పన్ను చెల్లింపుదారులపై రెండు సర్‌చార్జి రేట్లు బడ్జెట్‌లో ప్రవేశపెట్టారు.

పేదలు, ధనికుల మధ్య అంతరం తగ్గిందా..!

సర్ చార్జి విధానం అమలు చేశాక.. ధనిక , పేదల మధ్య అంతరం కొద్దిగా తగ్గుతుందని దేశ ప్రజలు భావించారు., కానీ దేశంలో ఆర్థిక పరిస్థితి భిన్నంగా కనిపించింది. జనవరి 2020 , జూన్ 2021 మధ్య, గౌతమ్ అదానీ సంపద 7 రెట్లు పెరిగింది. ఇది మాత్రమే కాదు, అదానీ 2022 లో అమెరికన్ వ్యాపారవేత్త జెఫ్ బెజోస్ తర్వాత ప్రపంచంలో రెండవ అత్యంత సంపన్న వ్యక్తి అయ్యాడు. ఇక్కడ, కోవిడ్ కారణంగా, దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రతికూల వృద్ధి నమోదైంది. తలసరి ఆదాయం కూడా తగ్గింది..ఇది రాష్ట్రాల ఆదాయాన్ని దెబ్బతీసింది.

2020-21 సంవత్సరానికి బడ్జెట్‌లో ప్రధానంగా మూడు విషయాలపై దృష్టి

1. కేరింగ్ సొసైటీని నిర్మించడం 2. అందరికీ ఆర్థికాభివృద్ధి 3. ఆకాంక్షాత్మక భారతదేశాన్ని నిర్మించడం

ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కొన్ని నెలల తర్వాత, దేశం యావత్తు కోవిడ్ మహమ్మారి కోరల్లో చిక్కుకున్నది. సమాజంలో చీకటి కోణాలు కూడా బట్టబయలయ్యాయి. కోవిడ్‌తో మరణించిన వారి తల్లిదండ్రుల మృతదేహాలను స్వీకరించడానికి పిల్లలు నిరాకరించారు. నదుల్లో తేలియాడుతున్న మృతదేహాలు కూడా ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. అత్యంత కష్టకాలంలో, 'కేరింగ్ సొసైటీ'లో ఒకరినొకరు చూసుకునే వ్యక్తులు ఎక్కడో కనిపిస్తారు . ఎక్కడో తప్పిపోతారు.ఆక్సిజన్ సిలిండర్లు, అవసరమైన మందులు, ఆస్పత్రి పడకలను కేంద్రం తమ బాధ్యత కాదన్నట్టుగా వ్యవహరించింది. దీంతో వైద్యులు, ఫార్మా రంగం బ్లాక్ మార్కెటింగ్‌తో కోట్లకు కోట్లు వెనకేసుకున్నాయి.ఈఏడాది ప్రజల ఆశయం ఒక్కటే..ఎలాగైనా ప్రాణాలు దక్కించుకోవాలనే తపన కనిపించింది.దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ దాదాపుగా స్తంభించిపోయింది.

2021-22లో ఆరోగ్య బడ్జెట్ 137% పెరిగింది..కానీ..

2021-22 సంవత్సరంలో కోవిడ్ కారణంగా, నిర్మలా సీతారామన్ దేశానికి మొదటి డిజిటల్ బడ్జెట్ అంటూ సమర్పించారు. ఈ బడ్జెట్‌లో ఆరోగ్య బడ్జెట్‌ను రూ.2,23,846 కోట్లకు పెంచారు. ఇది 2020-21లో రూ.94,452 కోట్లు. కోవిడ్ వ్యాక్సిన్ కోసం 35 వేల కోట్లు ఉంచారు. భారతదేశం స్వదేశీ వ్యాక్సిన్‌ను తయారు చేయడమే కాకుండా అనేక దేశాలకు అందించింది.అయితే స్వదేశంలో ఉన్న వారికి అందించకుండా...విదేశాలకు పంపి మెహర్బానీ చాటుకోవటానికే మోడీ ప్రభుత్వం ప్రయత్నించిందన్న విషయం అందరికీ తెలిసిందే.

ఇక కోవిడ్ రేపిన భయంకరమైన అనుభవం తర్వాత, నిపుణులు ఆరోగ్య రంగం బడ్జెట్ పెరుగుదలను స్వాగతించారు. అయితే కోవిడ్ ప్రారంభ దశలోనే ఇలాంటి నిర్ణయం తీసుకుని ఉంటే చాలా మంది ప్రాణాలతో బయటపడేవారని చర్చ నడిచింది.

2022-23లో స్వావలంబనకు ప్రాధాన్యత, పెరిగిన వాణిజ్య లోటు



2022-23 సంవత్సరానికి బడ్జెట్ ప్రధానంగా 'స్వాతంత్ర్య అమృత్ మహోత్సవంపై వచ్చే 25 ఏండ్ల లక్ష్యం' , 'స్వయం-ఆధారిత భారతదేశం'పై దృష్టి సారించింది. కానీ ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత స్వయం సమృద్ధి కాకుండా దేశ వాణిజ్య లోటు పెరిగింది. మేం ఇతర దేశాల నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకునే పరిస్థితికి చేరుకున్నాం. తినే తిండి మొదలుకుని అన్నీ విదేశాలపైనే ఆధారపడేలా దేశ పరిస్థితులు మారాయి.,దీంతో పాటు ఎగుమతులు తగ్గాయి.

ఈసారి థీమ్ డిజిటల్...

కేంద్ర ప్రభుత్వం ఎంతో హృదయపూర్వకంగా, ప్రేమతో అందిస్తున్న పథకాలు, వాటి ఫలితాలు ఆశించిన స్థాయిలో లేవని గత అనుభవాలను బట్టి తెలుస్తున్నది.

మైనారిటీలపై దాడుల సందడిలో 'సబ్కా సాథ్-సబ్కా వికాస్' మునిగిపోయింది. 'వ్యవసాయం-రైతులు' థీమ్ రైతులను ఆదుకోలేదు. నల్లధనాన్ని వెనక్కి తీసుకురావడం, అనే అంశం పెద్ద నోట్ల రద్దుతో ధ్వంసమైంది. లక్షలాది చిన్న వ్యాపారాలు మునిగిపోయాయి.

సంపన్నులపై ఎక్కువ పన్నులు విధించి, పేదలకు, ధనికులకు మధ్య అంతరాన్ని తగ్గించాలని ఆర్థిక మంత్రి మాట్లాడినప్పుడు, ధనికుల సంపద ఎనిమిది-పది రెట్లు పెరిగింది . తలసరి ఆదాయం తగ్గింది. సామాన్యుడి తలపై అప్పు రెట్టింపు అయింది. , ఈసారి బడ్జెట్ థీమ్ 'డిజిటల్'. అంటే, ప్రతి ఒక్కరినీ సాంకేతిక పరిజ్ఞానం ఉన్నవారిగా మార్చాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. కాబట్టి మీ గాడ్జెట్‌లను సిద్ధం చేసుకోండి, మీరు ఎక్కడ వెతికినా డబ్బు కనిపిస్తుంది.ఇది నేటి భారతదేశం. పెద్ద ప్రజాస్వామ్యం అయి ఉండి కూడా... ఇంకెన్నాళ్లు దేశ ప్రజలు థీమ్ బడ్జెట్ ల మత్తులో మునిగి తేలుతారో కాలమే సమాధానం చెబుతోందని ఆర్థిక నిపుణులు విశ్లేషకులు అంటున్నారు.



కొలువు సవాల్

- కష్టంగా మారిన నాణ్యమైన ఉద్యోగాల సాధన
- మహమ్మారి, లాక్‌డౌన్ పరిస్థితుల ప్రభావం
- దేశంలోని యువత, నిరుద్యోగులకు క్లిష్ట కాలం
- బడ్జెట్‌లోనైనా ఏదైనా పరిష్కారం చూపాలి
- ఆర్థిక నిపుణులు, విశ్లేషకుల సూచన



న్యూఢిల్లీ : దేశంలో ప్రతి రంగాన్ని కుదేలు చేసిన కరోనా మహమ్మారి సామాన్య ప్రజల నుంచి చిన్న వ్యాపారుల వరకు.. ప్రతి ఒక్కరికీ వివత్కర పరిస్థితులను చూపింది. మోడీ ప్రభుత్వం ఏకపక్షంగా అమలు చేసిన లాక్‌డౌన్, పెద్ద నోట్ల రద్దు దుష్ప్రభావాలు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. ముఖ్యంగా, దేశంలోని యువత కరోనా మహమ్మారి, లాక్‌డౌన్ పరిస్థితుల ప్రభావం కారణంగా అప్పటి వరకు తమకున్న ఉద్యోగాలను కోల్పోయి నిరుద్యోగులుగా మారారు. దీంతో వారి ఆశలన్నీ అడియాశలయ్యాయి. కరోనా ముందు వరకూ ఆర్థిక మందగమనంతో భారత ఆర్థిక వ్యవస్థ తిరోగమనదశలో ఉన్నది. అయినప్పటికీ.. ఆ పరిస్థితుల్లోనూ దేశ యువత కొంత వరకు నిలదొక్కుకున్నారు. అయితే, కరోనానంతరం పరిణామాలు ఒక్కసారిగా వారి జీవితాలను తలకిందులుగా చేశాయి. ఆకర్షణీయమైన జీతాలు, ఒక స్థిరమైన హోదాలో ఉన్న ఉద్యోగులందరిలో చాలా మంది తమ ఉద్యోగాలను కోల్పోయారు. అలాంటి ఉద్యోగులు బతుకు బండి నడవటం కరోనా కాలంలోనూ, ఇప్పటికీ.. తమకు సంబంధం లేని పనులను చేస్తున్నారు. కొందరు పార్ట్‌టైమ్ ఉద్యోగాలతో నెట్టుకొస్తుంటే.. మరికొందరు ఉదయం నిద్ర లేచింది మొదలు.. అర్ధరాత్రి వరకు ఒకటికి పైగా ఉద్యోగాలను చేస్తున్న పరిస్థితులు కనబడ్డాయి.

"నేను హౌరాలోని మెటల్ వర్క్స్‌లో అకౌంటెంట్‌గా ఉద్యోగం చేసేవాడిని. అయితే, కరోనా పరిస్థితులతో ఆ ఉద్యోగం కోల్పోయాను. లాక్‌డౌన్ సమయంలో పోస్టా మార్కెట్‌కు సమీపంలోని ఉంటూ.. గోనె సంచులలో వ్యాపారం చేసే హోల్‌సేల్ సంస్థలో పార్ట్‌టైమ్ పని చేస్తున్నాను. అలాగే, ఒక ఫుడ్‌కోర్టులో క్యాషియర్‌గా చేస్తున్నాను" అని కోల్‌కతాలోని ఒక వ్యక్తి తెలిపాడు. అయితే, ఈ రెండు ఉద్యోగాల కారణంగా జీవిత నాణ్యత పడిపోయిందని సదరు వ్యక్తి వాపోయాడు. ఎక్కువ పని గంటలు, ఆరోగ్యం, భవిష్యత్తుకు సంబంధించి భరోసా లేకుండానే ఈ ఉద్యోగాలను చేయాల్సి వస్తున్నదని చెప్పాడు. ఇతను మాత్రమే కాదు.. దేశంలోని చాలా మంది యువత, నిరుద్యోగుల పరిస్థితి ఇలాగే ఉన్నదని నిపుణులు, విశ్లేషకులు చెప్పారు. మహమ్మారి ప్రేరిత వ్యాపార మాంద్యం తర్వాత ఆర్థిక వ్యవస్థ నెమ్మదిగా పుంజుకోవడంతో ఉద్యోగాలు కొంత ఏర్పడ్డాయి. కానీ, ఆ ఉద్యోగాల నాణ్యత తరచుగా అస్పష్టంగా ఉన్నది. ఎందుకంటే వాటిలో ఎక్కువ భాగం అనధికారిక రంగంలో ఉన్నాయని నిపుణులు తెలిపారు. దేశంలోని చాలా మంది యువత ఇప్పటికీ ఉద్యోగాలు పొందలేక నిరుద్యోగులుగా మారుతున్నారని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉన్న నిరుద్యోగులకూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించటం కష్టంగా తయారైందని అన్నారు. జనాభా పెరుగుదల, మహమ్మారి సమయంలో పనిని కోల్పోయిన వారితో జాబ్ మార్కెట్‌లో ఎక్కువ మంది కొత్తగా చేరటం, కేంద్రం నుంచి సరైన విధానాలు లేని కారణంగా ఉద్యోగ అవకాశాలు ఇప్పటికే చాలా తక్కువగా ఉన్నాయని నిపుణులు తెలిపారు." రెండు సంవత్సరాల కోవిడ్ -19 నుంచి కోలుకున్న పెద్ద కార్పొరేట్‌ల ద్వారా వృద్ధి ఎక్కువగా ఉన్నది. అయితే, సూక్ష్మ, చిన్న , మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ) లేదా సెమీ ఫార్మల్ రంగం కొంత భాగం చనిపోయింది. కొంత భాగం రెండింతల నుంచి కోలుకోలేదు. పెద్ద నోట్ల రద్దు, మహమ్మారి దెబ్బ కారణంగానే ఇదంతా.." అని ప్రఖ్యాత ఆర్థికవేత్త, జాతీయ గణాంక కమిషన్ మాజీ చైర్మెన్ ప్రణబ్ సేన్ వివరించారు. భారత్‌లో 2011-12లో 3 శాతం లోపు.. 2017-18లో ఆరు శాతం లోపు ఉన్న నిరుద్యోగం.. ప్రస్తుతం 8 శాతం దగ్గరకు చేరుకున్నదని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు. అయితే, తాజాగా ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లోనైనా నిరుద్యోగుల విషయంలో కేంద్రం ఏవైనా ఉపయోగపడే చర్యలు చేపట్టాలని సూచించారు. లేకపోతే దేశంలో నిరుద్యోగం తారాస్థాయికి చేరే ప్రమాదమున్నదని హెచ్చరించారు.

పదోన్నతివ్వండి..న్యాయం చేయండి..

- 10,500 జీతంతో కుటుంబాన్ని పోషించలేకపోతున్నా
- సీఎం కేసీఆర్‌కు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్ఏ కర్ణకంటి రాజేశ్ లేఖ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం కొట్లాడిన. రెవెన్యూ శాఖలో కేవలం రూ.10,500 జీతంతో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్ఏగా విధులు నిర్వర్తిస్తున్నాను. పదేండ్లయినా ప్రమోషన్ రాలేదు. ఆ జీతంతో కుటుంబాన్ని పోషించటం భారమవుతున్నది. పదోన్నతి కల్పించి న్యాయం చేయండి' అంటూ సీఎం కేసీఆర్‌కు వరంగల్ జిల్లా నెక్కొండ మండలం దీక్షకుంట గ్రామానికి చెందిన డైరెక్ రిక్రూట్‌మెంట్ వీఆర్ఏ కర్ణకంటి రాజేశ్ లేఖ రాశారు. ఆ లేఖ ఇప్పుడు చర్చనీయాంశం అవుతున్నది. లేఖలోని అంశాలు ఇలా ఉన్నాయి.' నేను అనగా కర్ణకంటి రాజేశ్ తండ్రి కీర్తి శేషులు నారాయణ. రెవెన్యూ శాఖలో వీఆర్ఏగా విధులు నిర్వర్తిస్తున్నాను. ఉద్యమాల గడ్డ కాకతీయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో పీజీ(యం.కామ్) చేస్తూ 2009 నుంచి 12 వరకు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించాను. 2012లో ఏపీపీఎస్సీ డైరెక్ట్ రిక్రూట్మెంట్ రాత పరీక్ష ద్వారా వీఆర్ఏగా నియామకం అయ్యాను. ఐదేండ్లలో పదోన్నతి వస్తుందని ఆశించి జాబ్‌లో జాయిన్ అయ్యా. పదేండ్లయినా పదోన్నతి రాలేదు. నేను ఉమ్మడి వరంగల్ జిల్లా 2020లో వీఆర్వో పదోన్నతి కోసం ప్రచురించిన సీనియారిటీ తుది జాబితాలో ఉన్నాను. కానీ, మీరు ప్రవేశపెట్టిన కొత్త రెవెన్యూ చట్టంతో వీఆర్వో వ్యవస్థ రద్దయింది. దీంతో పదోన్నతి కోల్పోయాను. నాకు ఏడాది వయస్సున్నప్పుడు మా నాన్న మరణిస్తే కష్టపడి పెంచిన తల్లికి, నన్ను నమ్ముకుని వచ్చిన భార్యకి నా పిల్లలకి పౌష్టికాహారం, మెరుగైన వైద్యం, విద్య, వారికి కావాల్సిన కనీస సౌకర్యాలు కల్పించలేకపోతున్నాను. ఆరోగ్య, ఆర్థిక, మానసిక పరిస్థితులతో నా కుటుంబం అంధకారంలోకి కూరుకుపోయింది. ప్రత్యేక రాష్ట్రం కోసం కొట్లాడిన ఒక తెలంగాణ ఉద్యమ కారునిగా ప్రాధేయపడుతూ 2017, 2020, 2022 లో మీరు ఇచ్చిన హామీ మేరకు నేను పొందాల్సిన వీఆర్వోకి సమానమైన జూనియర్ అసిస్టెంట్ స్కేల్ పదోన్నతి కల్పిస్తే ఏ ఇతర శాఖలోనైనా నీతి, నిజాయితీగా సేవలు అందించడానికి నేను సిద్ధంగా ఉన్నాను' అంటూ వేడుకున్నాడు.